సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ వారపత్రిక

RNI No. APTEL 2015/ 66622

# రాజధాని వార్తలు

www.rajadhanivartalu.com facebook.com/rajadhaniv

అమరావతి సోమవారం 14 - ఆదివారం 20 నవంబర్, 2016 సంపుటి : 2 సంచిక 8 | ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు పత్రిక | Whatsapp No: 9440662699 | పేజీలు 8 వెల : రూ. 5.00

### పంటభూములు పోయే...డబ్బులు పోయే....

## నిస్సహాయ స్థితిలో రాజధాని రైతులు


**రాజధాని వార్తలు డెస్క్, అమరావతి :** నల్లధనాన్ని అరికట్టేందుకు మంగళవారం అర్ధరాత్రి ప్రధాని నరేంద్రమోడీ పెద్దనోట్లను రద్దు చేయడంతో రాజధాని ప్రాంత రైతుల గుండెలు గుభేల్‌మన్నాయి. అప్పటి నుంచి ఇక్కడి వారంతా నిద్రలేని రాత్రుళ్లు గడుపుతున్నారు. నిజానికి అక్టోబరు 28న ఆంధ్రప్రదేశ్ పరిపాలనా కార్యాలయాల శంకుస్థాపనకు విచ్చేసిన కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని రాజధానికి భూములిచ్చిన రైతులకు పన్ను మినహాయింప లివ్వాలని కోరటం... దీనిపై త్వరలో ఒక నిర్ణయాన్ని ప్రకటిస్తామని ఆయన హామి ఇచ్చిన విషయం తెలిసిందే..

రెండేళ్ల క్రితం వరకు పంటపొలాల్లో పనిచేసుకొని సుఖ జీవనం సాగించిన రైతులకు ఈ ప్రాంతాన్ని నవ్యాంధ్ర రాజధానిగా ప్రకటించడంతో వారి జీవితాల్లో పెనుమార్పులు చోటు చేసుకున్నాయి. వాటిలో భాగంగా ఇక్కడి పంట భూములకు అమాంతం రెక్కలు వచ్చి, రూ. 5 లక్షలు గల ఎకరం భూమి రూ. 2.5 కోట్లకు చేరుకుంది. దాంతో చాలా మంది రైతులు తమ భూములను అమ్ముకున్నారు. తెలివిగల రైతులు



వేరే ప్రాంతాల్లో పంట భూములు కొనుక్కోగా, చాలా మంది కార్లు, బైకులు కొనుక్కొని రెండు,మూడంతస్తుల భవనాలను కట్టుకున్నారు. ఇక్కడ రైతుల్లో అక్షరాస్యత తక్కువ ఉండటంతో ఎన్ని బ్యాంకులు తమ బ్రాంచ్‌లను ఏర్పాటు చేసినా తమ డబ్బును బ్యాంకుల్లో జమ చేయలేదు. మరి కొద్దిమంది మాత్రం డబ్బును లాకర్లో దాచుకున్నారు. పెద్దనోట్లను ప్రభుత్వం నిషేధించగానే ఏం చేయాలో తెలియని రైతులు దిక్కుతోచని స్థితిలో నిద్రలేకుండా గడుపుతున్నారు. ఈ మండలంలోని 29 గ్రామాల్లో 33,400 ఎకరాల భూమిని రాజధానికోసం కేటాయించారు. 2014 డిసెంబరు నుంచి మార్చి 2016 వరకు 9,304 ఎకరాలు రిజిస్ట్రేషన్లు జరిగాయి. అదీ ప్రభుత్వ ధర ఎకరం రూ. 8 లక్షల నుంచి రూ. 12 లక్షల రేటులోనే. అయితే మార్కెట్ రేటుకు దీనికి ఏమాత్రం పొంతన లేదు. అంటే లెక్కకు రాని డబ్బు ఇక్కడ చాలా ఉంది. ప్రభుత్వ అధికారుల లెక్కల ప్రకారం అది నల్లడబ్బు. ఈ మధ్యకాలంలో కొనుగోళ్లు తగ్గినప్పటికీ వెలగపూడిలో సచివాలయం పని చేయడం ప్రారంభమైన తర్వాత మళ్లీ ఊపందుకున్నాయి. పన్ను చెల్లింపులు వర్తించ కుండా ప్రస్తుతం వారిదగ్గరున్న డబ్బును వ్యవ సాయం ద్వారా వచ్చిందనటానికి లేదు, ఎందుకంటే రెండేళ్ల నుంచి ఇక్కడ వ్యవసాయం లేదు. నల్లధనం ఉన్న వారంతా ముందుగానే ఇల్లు చక్కబెట్టుకుంటే మాకే ఎందుకు ఈ తిప్పలని ఇక్కడి రైతులంతా ఆవేదన చెంద ుతున్నారు.

ప్రభుత్వం తమకు ఈ విషయంపై అవగాహన కలిగించలేదని వారంతా వాపోతున్నారు. నిరక్షరాస్యత వారిపాలిట శాపంగా మారింది.



## అమరావతికి బ్రిటన్ బాండ్లు

### బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ మెక్ అలిస్టర్ వెల్లడి

**రాజధాని ప్రతినిధి, అమరావతి:** నవ్యాంధ్ర రాజధాని అమరావతి నిర్మాణానికి మసాలా బాండ్ల రూపంలో నిధులు సమకూర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ అండ్రూ మెక్ అలిస్టర్ తెలిపారు. లండన్ స్టాక్ ఎక్స్చేంజి ద్వారా ఈ బాండ్లు ఇచ్చే అవకాశముందన్నారు. విజయవాడలోని ఓ హెూటల్‌లో శుక్రవారం అలిస్టర్ ఆధ్వర్యంలో 'స్మార్ట్ సిటీ నిర్మాణ సామర్థ్యం, అనుభవం, అమరావతికి సహకారం'అనే అంశాలపై సమావేశం జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ సమావేశంలో అలిస్టర్ మాట్లాడుతూ.. అమరావతి సహా దేశంలోని 8 స్మార్ట్ సిటీల నిర్మాణానికి బ్రిటిష్ ప్రభుత్వం 11 మిలియన్ పౌండ్లు వెచ్చించనుందని తెలిపారు. సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. రాజధాని తొలి దశ నిర్మాణానికి ప్రయత్నాలు మొదలవుతున్న తరుణంలో బ్రిటన్ సహకారం కావాల్సి ఉందన్నారు.

**15న మంత్రివర్గ సమావేశం:** రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 15వ తేదీన జరగనుంది. విజయవాడలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు ఈ సమావేశం జరుగుతుంది.

### మైనారిటీ విద్యార్థులకు

## విదేశీ విద్యాపథకం

నవ్యాంధ్రప్రదేశ్‌లో మైనారిటీ సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధి పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇందుకోసం ప్రత్యేక నిధులు కేటాయిస్తూ మైనారిటీ పిల్లల విద్యాభివృద్ధికి ఇతోధికంగా కృషిచేస్తున్నారు. మైనారిటీ పిల్లలకు విదేశాలలో ప్రభుత్వ ప్రోత్సహంతో విద్యావకాశాలు కల్పించి. వారికి ఉన్నత ప్రమాణాలతో కూడిన ఉద్యోగావకాశాలు కల్పించడానికి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పనిచేస్తున్నది. మైనార్టీల విదేశీ విద్యా పథకం ద్వారా కేంద్రప్రభుత్వం పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ అందిస్తున్నది. ఈ పథకం ద్వారా మైనార్టీ విద్యార్థులు విదేశాల్లో ఉండే అత్యున్నత విద్యాసంస్థల్లో చదువుకునే అవకాశాలు ఎక్కువగా లభిస్తున్నాయి. అయితే అనేక ఆర్థిక కారణం వల్ల విదేశీ విద్యను ఎక్కువ మంది మైనార్టీలు అందుకోలేకపోతున్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల ఆకాంక్షలకు అనుగుణంగా విదేశీ విద్యను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో విదేశీ విద్యా పథకాన్ని అమలులోకి



తెచ్చింది. విదేశీ విద్యను ఎంపికైన మైనార్టీ విద్యార్థులకు ఉపకారం వేతనం కింద రూ. 10 లక్షలను ప్రభుత్వం అందిస్తుంది. ఈ ఫీజు రెండు వాయిదాలలో చెలించే విధంగా చర్యలు తీసుకుంటారు. తొలి విడతగా రూ. 5 లక్షలను ల్యాండింగ్ పర్మిట్-1-94 కార్డు (ఇమ్మిగ్రేషన్ కార్డు) చెల్లించిన తర్వాత ఈ నగదు చెల్లిస్తారు. రెండవ విడతగా మిగతా రూ. 5 లక్షల మొత్తాన్ని తొలి సెమిస్టర్ ఫలితాల తర్వాత విద్యార్థికి చెల్లిస్తారు. ఇది కాక ఎంపికైన అభ్యర్థులకు జాతీయ బ్యాంకుల నుంచి విద్యా రుణం కూడ రూ. 5 లక్షల వరకు పొందే అవకాశం ప్రభుత్వం కల్పిస్తుంది. ప్రయాణ వీసాతో పాటు వీసా రశీదు పొందిన వారికి వీసా ఖర్చులు కూడ తిరిగి ప్రభుత్వమే చెల్లిస్తుంది. పోస్టుగ్రాడ్యుయేట్, పీహెచ్‌డీకి సంబంధించి ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, ప్యూర్ సైన్సెస్, అగ్రికల్చర్ సైన్సెస్, మెడిసిన్, నర్సింగ్, సోషల్ సైన్సెస్, హ్యూమానిటీస్‌ల తోపాటు ఒక ఏడాది కాలపరిమితి కలిగిన పీజీ డిప్లొమా విభాగాలకు కూడా ఈ విదేశీ విద్యాపథకాన్ని వర్తింపజేశారు. ఈ పథకం కింద విదేశాలలో ఎంబీబీఎస్ చదువుకోవడానికి అవకాశం లభిస్తుంది. ఈ పథకం కింద సీపీఏ (సర్టిఫైడ్ పబ్లిక్ అకౌంటెంట్), సీపీఎం (సర్టిఫైడ్ పోర్ట్‌ఫోలియో మేనేజర్) విభాగాలలో యూఎస్‌లో చదువుకోడానికి అవకాశం కల్పించబడుతుంది.

**చదువుకు అర్హత గల దేశాలు**

యూఎస్ఏ, యూకె, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, న్యూజీలాండ్, స్వీడన్, నెథర్లాండ్స్ ఫ్రాన్స్ డెన్మార్క్, రష్యా, ఫిలిప్పీన్స్, కజకిస్థాన్, చైనా. దరఖాస్తు చేసుకునే విధానం అర్హత గల మైనారిటీ

- మిగతా 2 లో



అసెంబ్లీ నిర్మాణం జరుగుతున్న దృశ్యం (ఫైల్)

## శరవేగంగా అసెంబ్లీ నిర్మాణం

**రాజధాని ప్రతినిధి, అసెంబ్లీ బ్లాక్ :** వెలగపూడి సచివాలయం సముదాయంలో నిర్మిస్తున్న అసెంబ్లీని అత్యంత ఆకర్షణీయంగా రూపొందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలు సూచనలు చేశారు. అసెంబ్లీ బ్లాక్‌లో పాటు మిగిలిన 5 బ్లాక్‌లను ఇంకా మెరుగ్గా, సౌకర్యవంతంగా అభివృద్ధి చేసేందుకు ఆయన సలహాలిచ్చారు. ముఖ్యంగా శాసనసభ భవనంలోని మొదటి అంతస్తులో కమిటీహాల్‌లో దాదాపు 200 మంది కూర్చునేందుకు వీలుగా సువిశాలంగా నిర్మిస్తున్నారు. ఇందుకోసం మొదట ప్రతిపాదించిన విధంగా మూడో హాలుకు బదులు, రెండో హాలును పూర్తిస్థాయి వసతులతో ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. నవ్యాంధ్ర అసెంబ్లీలో జర్మన్ టెక్నాలజీతో కూడిన అత్యాధునిక సౌండ్ సిస్టమ్‌ను, మైకులు ఏర్పాటు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారు. దీంతో మైక్‌ముందు ఉన్న వ్యక్తి ఎటుతిరిగి మాట్లాడినా వినిపిస్తుందన్నారు. అసెంబ్లీ బ్లాక్‌ను ఇతర బ్లాక్‌ల నుంచి వేరుచేస్తూ ప్రత్యేకంగా నిర్మించనున్న కాంపౌండ్ హాల్‌తో పాటు శాసనసభ్యులు, అధికారులు, సందర్శకులు కూర్చునేందుకు సేట్టింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు.

### ఈవారం రాజధాని

- విద్యాసంస్థలు మెరుగు కావాలి : లోకేష్
- 27,28లో ముఖ్యమంత్రి విశాఖసదస్సు
- డిసెంబర్ 18న ఇండియన్ రోడ్డు కాంగ్రెస్ : కేంద్ర మంత్రి నితిని గడ్కారి
- అమరావతి నిర్మాణంపై బ్రిటన్ ఆసక్తి
- డిసెంబర్ 30 వరకూ నగదు మార్పిడి, డిపాజిట్ చేసుకోవచ్చు : మోడీ
- నోట్ల రద్దుపై ప్రభుత్వాన్ని రాద్ధాంతం చేస్తున్న అమిత్ షా
- రాజధాని భూములతో రియల్ వ్యాపారం: అఖిలభారత రైతు సంఘం సహాయ కార్యదర్శి విజ్జాకృష్ణన్
- ఆక్వా రంగానికి ప్రభుత్వం చేయుత : ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్.

### లోపలి పేజీల్లో ...

అయిదు దశల్లో 'అమరావతి'

కల నెరవేరింది

పెందలకడనే భోజనం చేస్తే బరువు పెరుగరు

సామాన్యుడు విలవిల...

ప్రాంతీయతకే పీఠం

## పెద్దనోట్ల రద్దు వెనుక ఎవరున్నారు?



**రాజధాని స్పెషల్ కరెస్పాండెంట్ :** ప్రధానమంత్రి నరేంద్రమోడీ పెద్దనోట్లను రద్దు చేస్తూ ఆకస్మికంగా చేసిన నిర్ణయం వెనుక ఆర్ఎస్ఎస్‌కు అనుబంధంగా ఉండే 'అర్థక్రాంతి సంఘటన్' ఉందని తెలుస్తోంది. ఇది మాతృసంస్థ బీజేపీకి ఆర్థిక విషయాలలో తోడ్పాటు, ఆర్థిక ఎజెండా అందజేస్తుంది. ఈ సంస్థలో కీలక సభ్యుడైన అనిల్ బొకిల్ కొన్ని నెలల కిందట ప్రధాని మోడీని కలిసి ఆర్థిక విషయాలపై వారొక మెమోరాండం ఇచ్చారని తెలిసింది. నల్లధనం, ధరల అదుపు, అవినీతి, ఆర్థిక లోటు, నిరుద్యోగం, ఆర్థిక, పారిశ్రామిక వృద్ధి వంటి అంశాలు దీనిలో ఉన్నాయి. దిగుమతులపై ఇంపోర్ట్ డ్యూటీ తప్ప ఆదాయ పన్నుతో సహా 56 పన్నులు రద్దు, 100, 500, 1000 రూపాయల నోట్ల రద్దు, పెద్ద పెద్ద లావాదేవీలను, చెక్కులు, డీడీల రూపంలో లేదా ఆన్‌లైన్‌లోనే జరడం, నగదు లావాదేవీలపై పరిమితి విధింపు, మరికొన్ని లావాదేవీలపై పన్ను లేకుండా చేయడం, బ్యాంకింగ్ ద్వారా సింగిల్ పాయింట్ పన్ను వ్యవస్థ ఏర్పాటు వంటి ఐదు సూత్రాలను మోడీకి తెలిపారని ప్రచారం. మొదట్లో ఈ విషయం ప్రధాని మోడీ, ఆయన ప్రిన్సిపల్ కార్యదర్శి నృపేంద్ర మిశ్రాల మధ్యనే గుట్టుగా ఉన్నా, తర్వాత ఆర్బీఐ గవర్నర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన ఉర్జిత్ పటేల్‌కు ఈ విషయం తెలియజేశారు. ఈ వ్యవహారం సజావుగా సాగడానికి ఆర్థికశాఖ అధికారుల సహకారం అవసరమైంది. అప్పుడు ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీకి సమాచారమందించడంలో ఇద్దరు నమ్మకస్తులైన ఉన్నతాధికారులకు ఈ బాధ్యతలు అప్పగించారని ఉన్నత వర్గాల బోగట్టా..

నిజానికి మూడు నెలల కిందటే రూ. 2000 నోట్లు ముద్రించాలని, ఆ తర్వాత కాలంలో రూ. 500 కోట్లు ముద్రించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు సంబంధించి పలు డిజైన్లను రూపొందించిన ఆర్బీఐ బృందం మళ్లీ ప్రధానిని కలిసింది. వెంటనే రూ. 2000 కోట్లను ముద్రించాలని ఆ సమావేశంలోనే నిర్ణయించారట. అనంతరం ఆర్థికమంత్రి జైట్లీ రిజర్వ్‌బ్యాంక్ డైరెక్టర్లను సమావేశపరిచి రూ. 500, 1000 నోట్ల రద్దుపై అభిప్రాయాలు కోరారనీ, ఆ సమావేశంలో చాలామంది డైరెక్టర్లు ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారని, దీనివల్ల సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇక్కట్ల పాలవుతారని తెలిపినా, ఈ విషయంలో గోప్యత పాటించామని మంత్రి వారిని ఆదేశించినట్లు తెలిసింది. తర్వాత కేంద్రం తన పని తాను చేసుకుంటూ చకచక ముందుకు పోయింది.





ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాలరెడ్డి, పక్కన లాయర్ మోయినుద్దీన్

## పార్టీ కన్నతల్లి వంటిది : మోదుగుల

**రాజధాని ప్రతినిధి-గుంటూరు :** కన్నతల్లి వంటి పార్టీని నమ్ముకున్న, వెన్నంటి ఉన్నవారికి పార్టీ నాయకత్వం ఎల్లప్పుడు మేలుచేస్తుందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి అన్నారు. నియోగకవర్గం పరిధిలోని గుజ్జనగుండ్ల ప్రాంతంలో పార్టీనాయకులు డొక్కా మాణిక్యవరప్రసాద్, మన్నవ సుబ్బారావు, చందు సాంబశివరావు, ఎంపీపీ తోట మహలక్ష్మీ, డివిజన్ అధ్యక్షుడు శింగంశెట్టి వీరయ్య తదితరులతో కలసి జనచైతన్య యాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మోదుగుల మాట్లాడుతూ పార్టీ జెండాను గుర్తించి వారికి పార్టీ సముచిత స్థానం కల్పించడం జరుగుతుందన్నారు. కార్యకర్తల సక్షేమం కోసం టీడీపీ కార్యకర్తల సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. ప్రజలు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలకు సూచించారు. ప్రజలంతా పార్టీ సభ్యత్వం తీసుకొని లబ్ధిపొందాలని సూచించారు. రాష్ట్ర అభివృద్ధికి పార్టీ నాయకులు చేస్తున్నకృషికి ప్రజలు తమవంతు సహకారం అందిచాలని ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాలరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వెన్నాసాంబశివారెడ్డి, కోవెలమూడిరవీంద్ర (నాని), దారపనేని నరేంద్ర, ఖాదర్‌బుడే, ముత్తినేని రాజేష్, వజ్జారామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన ప్రజలు

## బ్యాంక్ క్యూలైన్లో నల్లవీరులున్నారా ?





**న్యూఢిల్లీ:** బ్యాంక్ క్యూలైన్లలో ఒక్క నల్ల కుబేరుడైనా కనిపించాడా? కనీసం పెద్ద స్థాయి ఉద్యోగి ఒక్కరైనా దర్శనమిచ్చారా? అని ఒకప్పటి అవినీతి వ్యతిరేక ఉద్యమనేత, ప్రస్తుత ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఘాటుగా ప్రశ్నిస్తున్నారు. 'రోజువారీ కూలీలు, కార్మికులు, ఆటో డ్రైవర్లు, రైతులు, పేద పెన్షనర్లు.. వీళ్లు తప్ప బ్యాంకుల ముందు క్యూలైన్లలో ఎవరున్నారు? బడాబాబులు బయటికి రాలేదేం? కొందరి వద్దకే రూ. 100 నోట్ల బండిళ్లు ఎలా వెళ్లాయంటూ ఆయన తీవ్రంగా విమర్శించారు. 500,1000 నోట్లు రద్దవుతాయని వాళ్లకు ముందే తెలుసు అనడానికి ఇంతకంటే రుజువు కావాలా?'అని కేజ్రీవాల్ ప్రత్యేక వీడియోలో ప్రశ్నించారు. స్విస్ బ్యాంకుల్లో నల్లధనం దాచుకున్నవారితోపాటు దేశీయంగా నల్లధనం కలిగి ఉన్న 6000 మంది పైచిలుకు నల్ల బాబుల జాబితా 2011లోనే బయటపడిందని, 'మన దేశంలో నల్లధనం ఎవరెవరి దగ్గర ఉందో చిన్న పిల్లాడికి సైతం తెలుసు'అని గత డిసెంబర్ లో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ట్వీట్‌ను ఆయన గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు మోదీ చెప్పిన మాటలన్నీ అధికారంలోకి రాగానే మర్చిపోయారు. ఎందుకంటే ఆ 6000 మందిలో ఆయన సన్నిహితులు కూడా ఉన్నారు. పాత నోట్ల రద్దుకు సంబంధించిన నిర్ణయం కూడా ఆ బడాబాబులకు ముందే చెప్పేశారు. దీంతో వాళ్లు సెటిల్మెంట్లు చేసుకున్నారు. అందుకే క్యూలైన్లలో కనిపించడం లేదన్నారు రూ. 2000 నోటు తీసుకురావడం వెనుక చాలా పెద్ద కుట్ర ఉందని కేజ్రీవాల్ ఆరోపించారు. రూ. 2000 నోట్లు వల్ల నల్లధనం పెరుగుతుందే తప్ప తగ్గే సమస్యేలేదని ఆయన ఘాటుగా విమర్శించారు.

# రాజధాని వార్తలు కలం

## రాజకీయాలు అంత సులువు కాదు

పవన్ తన ప్రసంగంతీరును మార్చుకున్నారని మీడియా పొగుడుతూ, తెలుగుదేశంపై కూడా ఆయన విమర్శలు చేశారని చెప్పినా ఎందుకో అది తెలుగుదేశం అధినేత కనుసైగలతోనే జరుగుతుందనిపిస్తోంది. రైలు, బస్సు ప్రయాణీకులు రెండు రోజుల నుంచి చిల్లర లేక కన్నవారి చివరి చూపులకు కూడా నోచుకోలేకపోతున్నామని ఎందరో ఆవేదన చెందుతుంటే అంతమంది జనాలు పవన్ సభలకు ఎలా వచ్చారు? అధికార పార్టీ అండదండలు లేకుండా... ఏదో చిన్న చిన్నగా అందరూ అనుకునే సుతిమెత్తని విమర్శలే తప్ప ఆయన అధికార పార్టీపై నిప్పులు కురిపించి ప్రజాపక్షంగా తన వాణిని నలుదిశలా వినబడేట్లు ఏం చేశారు. నారా లోకేష్ మాట్లాడుతూ జనసేన మన మిత్రపక్షమే, దాని విమర్శలను స్వీకరిద్ధామంనడం దీనికి బలం చేకూర్చే విధంగా ఉంది. ఎక్కడైనా ఎప్పుడైనా వైఎస్ జగన్ కాస్త ప్రజల ముందుకెళుతుంటే వెంటనే వెనక్కులాగే ప్రయత్నంగా పవన్ కల్యాణ్ సభలు నిర్వహిస్తారని ప్రతిపక్ష మీడియా తెలుపుతుంది. నిజానికి 15 రోజుల క్రిందటే పవన్ అనంతపురంలో సభ నిర్వహిస్తానని ప్రకటించడం తెలిసిందే... ఏది ఏమైనా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజకీయ చతురుడు. ఆయన దగ్గర చిన్నచిన్న నాయకుల పప్పులు ఉడకవు. వారిని తనకు అనుగుణంగా నడుచుకునేటట్లు చేయడంతో ఆయన దిట్ట. ఇది గమనించుకోవడంలోనే పవన్ కల్యాణ్ భవిష్యత్ ఉంటుందనడంలో సందేహం లేదు. ప్రస్తుతం జనసేన పార్టీ తరపున అనంతపురంలో పోటీ చేస్తానని తెలపడం ట్విస్ట్. సినిమాలతోనే కాలక్షేపం చేస్తారని, షూటింగ్ గాప్‌లో మాత్రమే సభలు, సమావేశాలు జరుపుతారని విపక్షాలు విమర్శిస్తున్న నేపథ్యంలో పూర్తికాల రాజకీయవేత్తగా ఉంటానని తెలపడం ముదావహం. పవన్ చెప్పినట్టు తెలుగురాష్ట్రాల్లో శుద్ధ రాజకీయనాయకుల కొరత తీవ్రంగా ఉంది. అయితే సినిమానటులను ప్రజలు అంతగా నమ్మరు. వారు జీవితం షూటింగ్ లకే సరిపోతుందని, ప్రజలను పట్టించుకోరనే అపప్రద ఉంది. అయితే అభిమానుల తీరు మాత్రం వేరుగా ఉంటుంది. రానున్న రెండేళ్లలో జనసేనను పూర్తిగా సన్నధం చేసి పూర్తి స్థాయిలోరాజకీయపార్టీగా మలచి ముఖ్యమంత్రిగా పోటీ చేస్తున్నా అన్నా ఆశ్చర్యపోనక్కర్లేదు. కాని రాజకీయాల్లో చాలా జాగ్రత్తగా ఉండాలి. ఏ మాత్రం ఏమరపాటుగాఉన్నా జరిగే నష్టం అంతా ఇంతా ఉండదు. అదే సమయంలో ప్రజల నుంచి కూడా వ్యతిరేకత ఉంటుంది. ఏది ఏమైనా అన్న చిరంజీవి రాజకీయ జీవితం నుంచి పవన్ నేర్చుకోవలసింది చాలా ఉంది. రాజకీయాల్లోకి అడుగుపెట్టటానికి అభిమానుల అండదండలు ఉండొచ్చుగాని, వాటిలో నిలబడటానికి మాత్రం మేథస్సు ఉండాలి.

ఒకరినొకరు బూతులు తిట్టుకోవడం సరికాదని, మంచి రాజకీయాల కోసం తరిమెళ్ల నాగిరెడ్డి పుస్తకాలు చదవాలని ఆయన తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో సురాజకీయాలు నడపాలని ఎందరో అనుకున్నారు. అందులో జయప్రకాష్ నారాయణ్, కేజ్రీవాల్ ఉన్నారు. జయప్రకాష్ రాజకీయాలను శుద్ధం చేయాలని ఎంతగానో ప్రయత్నించారు. కాని ఏంజరిగింది ? రెండు జాతీయ రాజకీయ పార్టీల ఒత్తిడిలో రోజూ కేజ్రీవాల్ కోర్టులు తిరుగుతుండగా, వారి మంత్రులంతా కేసుల్లో ఇరుక్కొని జైల్లో ఉన్నారు. జయప్రకాష్ నారాయణ్ పార్టీ ఉనికిలో లేకుండా పోయింది. ఇక్కడి ప్రజలు ప్రస్తుత రాజకీయాలకు అలవాటు పడిన ప్రజలు కూపస్థ మండూకాల్లా తయారయ్యారు. రాజకీయాల పట్ల వారికి అవగాహన పెంచి, అలోచనా విధానంలో మార్పు తేవడం కొత్త రాజకీయపార్టీల మొదటి ప్రాధాన్యత కావాలి. ఏది ఏమైనా సీనియర్ రాజకీయ నాయకులతో ఎంత జాగ్రత్తగా ఉంటే అంత మంచిది. లేకుంటే మొదటికే మోసం రావచ్చు.

# అయిదు దశల్లో 'అమరావతి'

ప్రపంచం మెచ్చేలా అమరావతి నిర్మాణం జరగనుంది. అయిదు దశల్లో నిర్మాణం పూర్తి చేయటానికి ప్రణాళిక తయారైంది.

నవ్యాంధ్ర రాజధాని అమరావతి నిర్మాణాన్ని ప్రభుత్వం ఐదు దశల్లో చేపట్టనుంది. పశ్చిమం నుంచి దశలవారీగా సీడ్ కేపిటల్ అభివృద్ధి విస్తరించనుంది. ప్రతిదశలో చేపట్టే అభివృద్ధి పనులను, అక్కడి అవసరాలను అంచనా వేసింది. అవసరాలకు తగ్గట్లుగా చేపట్టబోయే చర్యలు ప్రకటించింది. మొత్తం రాజధానిలో సీడ్ కేపిటల్ నిర్మాణానికి సంబంధించిన కీలకమైన ఐదు దశల అభివృద్ధి ప్రణాళికను రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) సిద్ధం చేసింది. మొత్తం 1694 హెక్టార్లలో నిర్మించే సీడ్ కేపిటల్‌లో 6.97 లక్షల ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నట్లు స్పష్టం చేసింది. 2.98 లక్షల మందికి గృహవసతి కల్పించే విధంగా అభివృద్ధి ప్రణాళికను రూపొందించిది. సీడ్ కేపిటల్ ప్రాంతం విస్తీర్ణాన్ని ఐదు దశలుగా వర్గీకరించి ఆ మేరకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

**మొదటి దశ :** రాజధాని నిర్మాణంలో ఇది అత్యంత ప్రాధాన్యం కలిగిన ప్రథమ దశ. ఈ దశలో రాష్ట్ర పరిపాలనా యంత్రాంగం మొత్తం నూతన రాజధానికి తరలుతుంది. తొలుత ప్రభుత్వ పరిపాలనా యంత్రాంగానికి అవసరమైన నిర్మాణాలను చేపడతారు. ఇదే దశలో అన్నిదిశలనూ కలిపే విధంగా ఇక్కడ రహదారులను నిర్మిస్తారు. సీఆర్‌డీఏ ప్రారంభిస్తారు. తొలి దశలో 365 హెక్టార్ల పరిధి ఉంటుంది. ప్రస్తుతం జరిగిన శంకుస్థాపన కార్యక్రమం కూడా ఈ దశలోనే ఉంది. అలాగే 45 వేల ప్రభుత్వ, 50 వేల ప్రైవేటు ఉద్యోగ అవకాశాలకు ఉంటాయి. 26 వేల మందికి గృహవసతి కల్పిస్తారు. మొత్తం సీడ్ కేపిటల్ విస్తీర్ణంలో తొలి దశ 18 శాతంగా వుంది.

**రెండవ దశ :** సాధారణ అభివృద్ధి కార్యక్రమాలు రెండో దశలోకి వస్తాయి. రెండో దశ రాజధాని అభివృద్ధి తూర్పు దిశగా విస్తరిస్తుంది. దీనిని అమరావతి డౌన్‌టౌన్‌గా పిలుస్తారు. ఎక్కువగా వాణిజ్య రంగానికి ప్రాధాన్యం ఉంటుంది. అధిక జనసాంద్రత గల ప్రాంతాలు ఇక్కడే ఉంటాయి. అమరావతి డౌన్‌టౌన్ రహదారి, కారిడార్ల నిర్మాణం చేపడతారు. ఈ దశ చివరినాటికి బీఆర్‌టీ విధానం ప్రారంభమవుతుంది. రెండోదశలో 381 హెక్టార్ల విస్తీర్ణం అభివృద్ధి చెందనుంది. ఇందులో 10 వేల ప్రభుత్వ, 1.5 లక్షల ప్రభుత్వేతర ఉద్యోగ అవకాశాలు వస్తాయి. 94 వేల మందికి గృహవసతి కల్పిస్తారు. కృష్ణాతీరంలో నిర్మించే బొటానికల్ గార్డెన్ ఈ దశలోనే నిర్మిస్తారు.

**మూడవ దశ :** మూడో దశ కూడా దాదాపుగా రెండో దశ తరహాలోనే వుంటుంది. తూర్పుమూల దిశగా ఈ దశలో డౌన్‌టౌన్ అభివృద్ధి జరుగుతుంది. ప్రధానమైన రహదారులు ఈ దశలో పూర్తవుతాయి. తాళ్లాయపాలెం ఇందులోకి వస్తుంది. 404 హెక్టార్ల విస్తీర్ణం భూమి ఈ దశలో అభివృద్ధి అవుతుంది. సీడ్‌కేపిటల్ ప్రాంతంలో ఇది 18% ఇందులో 7 వేల ప్రభుత్వ 1.45 లక్షల ప్రైవేటు ఉద్యోగ అవకాశాలు వస్తాయి. 99 వేల మందికి గృహ వసతి కల్పిస్తారు. డౌన్‌టౌన్ వాణిజ్య ప్రాంతంపై ప్రధానంగా దృష్టి సారిస్తారు. బిజినెస్ పార్కు, అభివృద్ధి ప్రారంభమవుతుంది.

**నాల్గవ దశ :** వాణిజ్యపరంగా అభివృద్ధి చేసే ప్రాంతంలో అత్యధిక శాతం ఇక్కడే ఉంటుంది. ఈ దశలో చేపట్టే నిర్మాణాలు నదీతీరం అంతటా ఐకానిక్ బ్రిడ్జికి సమాంతరంగా అభివృద్ధి చెందుతాయి. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మార్పులు చేసుకునే విధంగా నాలుగు దశల్లో రోడ్ నెటవర్క్ ప్రారంభమవుతుంది. ఈ దశలో ప్రత్యేకమైన ట్రాఫిక్ వ్యవస్థకు రూపకల్పన చేస్తారు. ఈ దశలో 226 హెక్టార్ల మేర అభివృద్ధి చెందుతుంది. ఇందులో 1.77 లక్షల ప్రైవేటు ఉద్యోగ అవకాశాలుంటాయి. ప్రభుత్వ ఉద్యోగాలకు అవకాశం లేదు. 99 వేల మందికి గృహవసతి కల్పిస్తారు. మిశ్రమ వినియోగ కస్టమర్లు దీని పరిధిలోకే వస్తాయి.

**అయిదవ దశ :** రాజధాని సమగ్ర నిర్మాణంలో ఇదే చివరి దశ. ఇందులో పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యం కల్పించారు. 170 హెక్టార్ల మేర ద్వీపాలను కూడా అభివృద్ధి చేస్తారు. ద్వీపాలకు చేరే అనుసంధాన రహదారులు, రెండు చిన్న తరహా బ్రిడ్జిలను నిర్మిస్తారు. 1.13 లక్షల ప్రైవేటు ఉద్యోగ అవకాశాలు వస్తాయి. 50 వేల మందికి గృహవసతి కల్పిస్తారు. ఈ దశలో వాటర్‌ఫ్రంట్‌పై ప్రధానంగా దృష్టిపెడతారు. సిటి లైబ్రరీ, ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్, ఇండోర్ స్పోర్ట్స్, హబ్, గోల్ఫ్ కార్సు, విలాసవంతమైన విల్లాలు నిర్మిస్తారు.

**- అమరావతి నేడు-నాడు-రేపు**
**అనే పుస్తకం నుంచి దాసరి ఆళ్వారస్వామి**




**తుళ్లూరు మేరి మాత స్కూల్ ప్రాంగాణంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సౌత్ ఇండియన్ బ్యాంక్**

## బాధ్యతాయుతంగా వైద్యసేవలు అందించాలి

### డిప్యూటీ డి.యం.అండ్ హెచ్.ఓ. వెంకటరావు

**రాజధాని ప్రతినిది , (కొయ్యలగూడెం- అన్నరెడ్డి సుబ్బారావు) :** ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే వైద్యులు రోగులకు వైద్య సేవలందించే విషయంలో పారదర్శకంగాను, ఎంతో బాధ్యతయుతంగాను విధులు నిర్వహించాలని డిప్యూటి.డి.యం.హెచ్.ఓ. వి.వెంకటరావు పేర్కొన్నారు. కొయ్యలగూడెం ఉన్నతస్థాయి (30పడకల) ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటి (హెచ్.డి.ఎస్.) సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అభివృద్ధి కమిటి చైర్మన్ అమీర్‌బాషా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అత్యవసర ప్రాణాపాయ స్థితిలో వైద్యులపై ఎంతో నమ్మకంతో ఆసుపత్రికి వచ్చే రోగులకు ఒక్క క్షణం కూడ ఆలస్యం కాకుండా వైద్య చికిత్సలు చేసి ప్రాణాలు నిలిపితే అంతకన్న మించిన ఆత్మసంతృప్తి ఏదీ ఉండదని డి.యం.హెచ్.ఓ అన్నారు. 'రిస్క్' ఎందుకులే అనుకొని ప్రతి చిన్న కేసుని పై ఆసుపత్రులకు రిఫర్ చేసే భావన మారాలని,ఒక్క క్షణం వైద్యుడు శ్రద్ధ చూపితే ప్రాణాలు నిలిచే పరిస్థితులు ఉంటాయన్నారు. సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని, అవసరమైతే జీతాలు నిలిపివేయడం జరుగుతుందని ఆయన స్పష్టం చేసారు. ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ నిధులు వినియోగించే విషయంలో రోగుల వైద్యం చికిత్సలకు అవసరమయ్యే అత్యవసరమందులు కొనుగోలుకు వైద్యసేవలకు,ఆసుపత్రిలో రోగులకు అవసరమైన పరికరాలు కొనుగోలుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. సువిశాలమైన ఆసుపత్రి ఆవరణలలో మొక్కలునాటి,వాటికి నీటి సరఫరా ఇచ్చిన సంరక్షించటానికి స్థానిక రోటరీ క్లబ్ ముందుకు వచ్చినప్పటికే ఆసుపత్రి అధికారులు సబ్‌ర్డినేట్ సిబ్బంది సహకరించటానికి విముఖత వ్యక్తం చేసారని ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ కమిటీ అధ్యక్షుడు అమీర్‌బాషా డి.ఎం.అండ్.హెచ్.ఓ. దృష్టికి తీసుకువెళ్ళారు. అత్యవసర మందులు కొనుగోలుకు వైద్యాధికారికి, కంప్యూటర్ ఆపరేటర్లకు కుర్చీలు కొనుగోలుకు అనుమతినిస్తూ తీర్మానాలు ఆమోదించారు. అభివృద్ధి సొసైటీ సభ్యుల స్నేహన్, నాగరాజు, వైద్యాధికార్లు జ్యోత్స్న సుందర్ కుమార్‌లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయండి!

### చిక్కాల రామచంద్రరావు

**తాళం హనుమంతరావు, ఉండి(రా.వా) :** సమాజంలో అన్ని వర్గాల ప్రయోజనాల కోసం, వారి అభ్యున్నతి కోసం తెలుగుదేశ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని మాజీ మంత్రి, రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి చిక్కాలరామచంద్రరావు అన్నారు. పాములపర్రు గ్రామ సెంటరులో వ్యవస్థాపకులు ఎన్టీఆర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి గ్రామ పార్టీ అద్యక్షులు పోతినీడి కృష్ణమూర్తి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన సభలో మాట్లాడారు. ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం జన రంజక పాలన సాగిస్తోందన్నారు. రాష్ట్రం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నా క్రమ పద్ధతిలో ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నారని చిక్కాల అన్నారు.ప్రతిపక్షాలు అడుగడుగునా ఆటంకాలు సృష్టిస్తున్నా చంద్రబాబు వాటిని సమర్ధవంతంగా ఎదుర్కొంటూ పురోగమిస్తుందన్నారు. ఉండి ఎమ్మెల్యే శివరామరాజు ప్రభుత్వ పథకాలతో పాటు ప్రజావసరాలను తీర్చేందుకు వినూత్నమైన వరవడిలో స్వంత కార్యాక్రమాలను నిర్వహిస్తూ అన్ని వర్గా ప్రసంశలను అందుకుంటున్నారు. అనంతరం ఉండి ఎమ్మెల్యే శివ మాట్లాడుతూ ప్రధాన రంగంగా ఉన్న వ్యవసాయ రంగం లాభసాటిగా



**పాములపర్రులో మాట్లాడుతున్న మాజీమంత్రి చిక్కాల, ఎమ్మెల్యే శివ తదితరులు**

మార్చేందుకు రైతు సంక్షేమం కోసం చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. పేదరిక నిర్మూలనే పార్టీ లక్ష్యమన్నారు. కొబ్బరి చెట్టు నెక్కి కాయలు తీసి జనంను ఆకట్టుకున్నారు. జనాన్ని పార్టీ అభిమాని ముత్యాలపల్లి అర్జునుడును ఎమ్మెల్యే పరామర్శించారు. అనంతరం పార్టీ అధ్యక్షులు డి. సుబ్బరాజు పార్టీ పతాకాన్ని ఎగురవేసారు. ఎమ్మెల్యేశివ అల్లూరి, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం రూ7.50లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాలును ప్రారంభించారు. తదనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలోని ఆర్ అండ్ బి రోడ్డుకు రూ2కోట్లు మంజూరు చేస్తానన్నారు. పాములపర్రు గ్రామంలో అంగన్‌వాడీ భవనానికి, కాలనీల్లో సిసి రోడ్లకు, పైప్‌లైన్ పనులకు ఎమ్మెల్యే శంకుస్ధాపనలు చేసారు. నిర్మాణం పూర్తయిన రోడ్లను, కిచెన్ షెడ్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శివ,అనారోగ్య బాధితులు లొక్కాల సలోమి(వెలివర్రు)కి రూ50,510ల చెక్కును, సాగిరాజు సూర్యనారాయణరాజు(కోలమూరు)కు రూ86,200ల చెక్కును, పెనుమాల జాన్(ఉప్పులూరు)కు రూ79,300ల చెక్కులను సభల్లో అందజేసారు.ఈకార్యక్రమాల్లో సర్పంచులు ఎస్.దుర్గారావు, నక్కా చెన్నకేశవరావు, నేతల మార్టిన్, యర్రా తిరుమల, ఉండి ఏఎంసి చైర్మన్ కొత్తపల్లి గోపాలకృష్ణరాజు, మండల పార్టీ అధ్యక్షులు జుత్తిగ శ్రీనివాస్, జడ్‌పిటిసి కరిమెరక థులసి, అనంతలక్ష్మి, సుజాత, కోమటి నరేంద్రబాబు, కూనపరాజు రాంబాబు, కళ్ళేపల్లి సతీష్‌రాజు, నిమ్మల సత్యనారాయణ, యర్రా చిట్టిబాబు, కాగిత మహంకాళి, కట్టా గంగాధరరావు, మోపిదేవి శ్రీనివాస్, యిర్రింకి బుజ్జి, కాగిత బుజ్జి, కునుకు శ్రీను, సాయిరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు,

## అవయవాల్లో నయనం ప్రధానం!

**లయన్స్ క్లబ్ ఆద్వర్యంలో కంటి వైద్య శిబిరంలో అద్యక్షులు సుబ్బరాజు**



**తాళం హనుమంతరావు, ఉండి(రా.వా):** ఇంద్రియాల్లో కళ్ళు ప్రధానమైనవని ఉండి లయన్స్ క్లబ్ అద్యక్షులు బిహెచ్ సుబ్బరాజు అన్నారు. ఉండి లయన్స్ క్లబ్ ఆద్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. ఈసందర్భంగా జరిగిన సభలో సుబ్బరాజు మాట్లాడుతూ కంటి ప్రాధాన్యతను గ్రహించే ప్రతి మూరుమూల ప్రాంతాల్లో కూడా వైద్య శిబిరిలను నిర్వహిస్తుందన్నారు. దీనితో పాటు జనరల్ మెడికల్ క్యాంపులను క్లబ్ నిర్వహిస్తుందన్నారు. క్లబ్ చేపట్టే కార్యక్రమాల్లో విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యతనిస్తుందన్నారు. అనంతరం శ్రీరాజరాజేశ్వరి లయన్స్ ఆసుపత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో కంటి పరీక్షలను నిర్వహించారు. వీరిలో శస్త్ర చికిత్సలు అవసరమైన ఉచితంగా ఆపరేషన్లు చేస్తామన్నారు. క్లబ్ కార్యదర్శి పి నరసింహారావు, లయన్స్ ప్రతినిధులు కలిదిండి పెద అప్పలరాజు, బిహెచ్ హరినాథరాజు, ఆర్ నరసరాజు, కన్నెకంటి రూత్‌కళ, పెన్మెత్స పద్మావతి, బొండాడ కేశవరావు, నంబూరికాశీవిశ్వేశ్వరరావు, డి నారాయణరెడ్డి, గాదిరాజు వెంకటేశ్వరరాజు, అనంతలక్ష్మి, సన్నిధి నరసింహారావు, రామరాజు, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## అమెరికన్లంతా ఇడియట్లని 2011లో ట్రంప్ చెప్పారు



## 2016లో వారంతా దానిని నిరూపించారు

# విదేశీ విద్యాపథకం

(మొదటిపేజీ తరువాయి)

విద్యార్థులు www.apepass.cgg.gov.in ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది.

**అవసరమైన ధ్రువపత్రాలు**

అర్హత కోసం ప్రయత్నించే విద్యార్థులు తప్పని సరిగా టోఫెల్, జీఆర్ఇ, ఐఇఎల్‌టీఎస్, జీఎంఏటీ వివరాలను విదేశీ విశ్వవిద్యాలయాలలో ప్రవేశం కోసం పొందుపరచవలసి ఉంటుంది. అభ్యర్థులు తప్పనిసరిగా, స్వతహాగా విదేశీ విద్యాలయాలలో ప్రవేశం పొందాలి. అభ్యర్థులు వీసా పొందిన దేశంలోనే చదువుకోవడానికి అవసరమైన పత్రాలను తప్పనిసరిగా జతపరచాలి.

**జతపరచవలసిన పత్రాలు**

**మీ-సేవ నుంచి కులం, ఆదాయం, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలు**
**ఆధార్ కార్డు, ఇ-పోస్ ఐడీ సంఖ్య, నివాస ధ్రువీకరణ పత్రం**

గెజిటెడ్ అధికారిచే ధ్రువీకరించబడిన పాస్‌పోర్టు కాపీ, మార్క్‌షీట్, ఎస్ఎస్‌సి, ఇంటర్, గ్రాడ్యుయేట్, పీజీ స్థాయిలో.... జీఆర్ఇ, జీఎంఏటి లేదా సమానమైన అర్హతగల పరీక్ష, టెస్ట్ స్కోర్ కార్డు టోఫెల్, ఐఇఎల్‌టీఎస్ స్కోరు కార్డు, విదేశీ విశ్వవిద్యాయం నుంచి ప్రవేశం పొందిన ఉత్తర్వు లేదా లేఖ (1=20,ప్రవేశ లేదా సమానం లేఖ) జాతీయ బ్యాంకు, బ్యాంకు పాస్ పుస్తకం కాపీని స్కాన్ చేసి, అప్‌లోడ్ చేయాలి అభ్యర్థి ఫోటో స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలి. రూ.10ల నాన్ జుడీషియల్ స్టాంపు పేపరుపై స్వీయ ధ్రువీకరణ పత్రం (సెల్ఫ్ డిక్లరేషన్) స్కాన్ చేసి, అప్‌లోడ్ చేయాలి

**అర్హతలు**

వయోపరిమితిని ప్రకటించిన ఏడాదిలో జూలై మొదటి తేదీ నాటికి 35 సంవత్సరాలకు మించకూడదు. అభ్యర్థి తల్లిదండ్రులు లేదా సంరక్షకుల వార్షిక ఆదాయం అన్ని వనరుల నుంచి ఏడాదికి రూ.6లక్షలకు మించరాదు. ఒక కుటుంబం నుంచి ఒక్కొక్క మైనారిటీ విద్యార్థిని మాత్రమే ఈ పథకం కింద పరిగణించబడతారు. ప్రాయోజిత అభ్యర్థిని ద్వితీయ లేదా తదుపరి పరాయాలకు పరిగణించబడరు. మార్కుల విషయంలో రోలింగ్ కట్ ఆఫ్ విధానాన్ని పాటిస్తారు. ఇంజనీరింగ్, నిర్వహణ, ప్యూర్ సైన్సెస్ వ్యవసాయ శాస్రాలు, ఔషధం, నర్సింగ్, సామాజిక శాస్త్రాలు, హ్యూమానిటీస్ సంబంధిత డిగ్రీ సబ్జెక్టుల్లో మైనార్టీ మహిళలకు 33 శాతం రిజరేషన్ ఉంటుంది.

## అందరికీ అందుబాటులో విజయకుమార్ వైద్యసేవలు




**రాజధాని ప్రతినిధి, భవానీపురం :** ఆర్ఎంపీ డాక్టర్ విజయకుమార్ దంపతులు అత్యంత చౌకగా పేదలకు వైద్యసేవలు అందిస్తున్నారు. ఇదివరలో రూ.2, 3లకే విశేషమైన సేవలు అందించి పేద, దిగువ మధ్యతరగతి ప్రజల పాలిట దేవుడిగా డాక్టర్ విజయకుమార్ నిలిచి పోయారు. నిరుపేదలకు మందులు కూడా ఉచితంగా అందచేసే విజయకుమార్ రోగులను పరీక్షించడానికి కేవలం 30 రూపాయలను మాత్రమే ఛార్జ్ చేస్తారు. టైఫాయిడ్,మలేరియా,చర్మ సంబంధ వ్యాదులు, చిన్న చిన్న ప్రమాదాలకు లోనైన స్థానికులు ఈయన వద్దకే వస్తుంటారు. విజయకుమార్ భార్య ఝూన్సీరాణి కూడా స్త్రీలకు వైద్యాన్ని అందిస్తుంటారు. వీరికి ఇద్దరు సంతానం వారిలో ఒకరు విదేశాల్లో ఎంఎస్ చేస్తుండగా, రెండవ కుమారుడు ఇండోర్‌లో డాక్టర్ చదువుతున్నాడు.

## 14న భారీ చంద్రుడు!

**లండన్:** ఈనెల 14న అసాధారణ స్థాయిలో భారీ చంద్రుడు, మరింత వెలుగులు విరజిమ్ముతూ ఆకాశంలో ప్రత్యక్షమవనున్నాడు. 68 ఏళ్లలో భూమికి అత్యంత సమీపంగా వచ్చే సూపర్‌మూన్‌గా ఖగోళ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వాతావరణం అనుకూలిస్తే పూర్తిస్థాయి పరిమాణాన్ని ఆసియాలో వీక్షించే అవకాశం ఉందని పేర్కొన్నారు. మేఘాలు, కాంతి కాలుష్యం లేకుండా ఉంటేనే చూడటం సాధ్యం. ఈసారి భూమి నుంచి 356,509 కి.మీ దూరంలో ఉండనుంది. చంద్రుడు సాధారణంకన్నా ప్రకాశవంతంగా ఉన్నట్లు సాధారణ పరిశీలనతోనే గుర్తించవచ్చని చెబుతున్నారు.

### సవరణ

**గత వారం రాజధాని వార్తలు 2వ పేజీలో మైసూరు బెబ్బులి టీపు సుల్తాన్ అనే వార్తలో టీపు సుల్తాన్ శ్రీరంగపట్నంలో జన్మించారని పొరపాటున ప్రచురితం జరిగింది. కాని ఆయన జన్మించింది కర్నాటకలోని దేవనహళ్లి.**

సామాజిక,ఆర్థిక,సాంస్కృతిక, రాజకీయ,వారపత్రిక
రాజధాని వార్తలు క్లాసిఫైడ్స్ - రూ.500/- మాత్రమే
94406 62699, 96768 44442

# కల నెరవేరింది



## భారత జట్టులో స్థానం సంపాదించిన మేఘన

ఆమె

**భా**రత మహిళా క్రికెట్ జట్టులో ఆడేందుకు స్థానం సంపాదించిన మేఘన సబ్బినేని గమ్యంపై శ్రద్ధ, ప్రేమ ఆమెను ఉన్నత స్థానంలో నిలబెట్టాయి. భారత జట్టులో స్థానం సంపాదించడానికి కొన్ని వేలమంది కలలుకంటుంటే, మేఘన తన ప్రతిభతో ఆ కలను నిజం చేసుకుంది. ఆంధ్రా నుండి భారత క్రికెట్ జట్టుకు ఎంపికైన మూడవ వ్యక్తిగా మేఘన నిలిచింది. క్రీడల్ని వృత్తిగా మార్చుకుంటే ఆ సంతోషమే వేరుగా ఉంటుందంటున్న మేఘన గురించి...

### స్వేచ్ఛనిచ్చిన బాల్యం

కృష్ణాజిల్లా నాగాయలంకకు చెందిన మేఘన నాన్న విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నం ఎన్‌టిటిటిపిఎస్‌లో ఉద్యోగం చేస్తున్నారు.కొండపల్లి దయానంద ఆంగ్లో వేదిక్‌లో స్కూలింగ్ పూర్తయిన తర్వాత నలందాలో బికాం చదువుతోంది మేఘన. మనకి నచ్చిన పనిని చేయనిస్తే అది చాలు. అంతకుమించిన ప్రోత్సాహం అక్కర్లేదు. ఫలానా క్రీడలంటే ఇష్టం ఉందని చెప్పగానే, తల్లిదండ్రులు ముందుగా ఆలోచిస్తారు. దానిలో తప్పులేదు. కానీ పిల్లల ఇష్టాన్ని అర్థంచేసుకుని ఎప్పుడైతే స్వేచ్ఛనిస్తారో అది పిల్లలకి ఎంతో బలాన్నిస్తుంది అంటోంది మేఘన. చిన్నప్పటినుంచి ఆటలండే అమితంగా ఇష్టవపడే మేఘన ఆమె నాన్న ఆమెను ఏదో ఒక క్రీడలో ఉన్నతస్థాయిలో చూడాలని ఆశపడ్డారు. అందుకే చిన్నతనం నుంచి స్కేటింగ్ నేర్పించారు. షటిల్ బ్యాడ్మింటన్ నేర్పించారు. కానీ చివరకు క్రికెట్‌లో బాగా రాణించడం గమనించి దానిలో ప్రోత్సహించారు. క్రికెట్ బాగా ఆడే సమయంలో గుంటూరులోని జేకేసి ఆకాడమీలో నరేంద్రనాథ్‌గారు మేఘనను బాగా ప్రోత్సహించారు. క్రికెట్‌లో మంచి స్థాయిలో ఉండాలని ఆశపడినవారిలో ఆయన ఒకరు.

### ఆకాడమీల్లో శిక్షణ

ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ లోనే కేవలం క్రికెట్ ఆడేవాళ్లకోసం నాలుగు అకాడమీలు ఉన్నాయి. చాలా ప్రాంతాల్లో సబ్ సెంటర్లు ఏర్పాటుచేసారు. వాటిలో పిల్లల్ని చేర్చుకుని, చదువుతోపాటు క్రీడల్లో శిక్షణ,క్రికెట్‌కు సంబంధించిన సదుపాయాలన్నింటినీ కల్పిస్తున్నారు. గ్రామాల్లోకి వెళ్లి పిల్లల్ని గర్తించి తీసుకువస్తున్నారు. ప్రస్తుతం జట్టులో ఆడుతున్న కల్పనా కూడా అలా వచ్చిన ఆమ్మాయే. నైపుణ్యానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ స్థిరమైన ఆట తీరును చూపించాలి. దానితో పాటు ఫిట్‌నెస్ కూడా చూస్తారు. ఒక్కసారి స్కిల్ ఉందని సెలక్టర్లకు అర్థమైతే అవకాశం తప్పనిసరిగా వస్తుంది.

### సాధించిన సెంచరీలు

2007లో స్టేట్ క్యాంప్ వైజాగ్, 2008-09 ఇంటర్ జోన్స్, 2009-10లో అండర్ 19, 2011లో ఆస్ట్రేలియాతో అహ్మదాబాద్‌లో జరిగిన ఇండియా-ఎ జట్టులో ఎంపికయ్యారు. 2013-14శ్రీలంకలో ఒక సిరీస్ ఆడాను. ఇప్పుడు టి-20 జట్టులోస్థానం సంపాదించాను. అండర్623 ఆడినప్పుడు మూడు సెంచరీలు చేసి అలిండియా బెస్ట్‌గా నిలిచాను. సీనియర్స్ ఆడినప్పుడు చేసిన సెంచరీతో దేశంలోని రెండవ అత్యధిక స్కోరర్‌గా నిలిచింది. పురుషుల క్రికెట్‌లో సచిన్ టెండుల్కర్ అంటే ఇష్టం. నేను క్రికెట్ ఆడటం మొదలుపెట్టిన తర్వాత మిథాలిరాజ్‌గురించి తెలిసింది. అప్పటి నుంచి ఆమెను స్ఫూర్తిగా తీసుకున్నాను. ప్రస్తుతం మహిళా క్రికెట్ జట్టులో ఆడుతున్న స్మృతీమందనా వయస్సు చిన్నదైనా చాలా అనుభవం ఉన్న క్రికెటర్. వీళ్లందరూ తనకు స్ఫూర్తి అని చెబుతున్నారు మేఘన. ఎవరికిష్టమైన క్రీడల్ని వారు ఎంచుకోవాలంటే క్రీడలు అంటే ఇష్టపడాలి. అలాంటివారే ఇక్కడ ఇమడగలరు. ఇష్టంలేకపోతే దేనలోనూ విజయం సాధించలేరు. తల్లిదండ్రుల్లో మార్పురావాలి. ఐఐటి, ఇంజినీరింగ్,మెడిసిన్ అంటూ ఎప్పుడూ పిల్లల్ని అటువైపే తోస్తుంటారు. దానిలోనే జాబ్ సెక్యూరిటీ ఉందని అనుకుంటారు. పివి సింధు స్లివర్ మెడల్ సాధించడంతో తన కెరీర్ సెటిల్ అయింది. స్పోర్ట్‌లోకి రావాలంటే చాలామంది భయపడుతున్నారు. ముఖ్యంగా ఆడపిల్లల విషయంలో తల్లిదండ్రులు వెనకాడుతున్నారు. ఆడపిల్లల్ని అంత దూరం పంపించాలా అని ఆలోచిస్తున్నారు. ముందుగా అలాంటి ఆలోచనల్ని రానియ్యకూడదు. క్రీడల్ని కెరీర్‌గా ఎంచుకుని, కష్టపడి పనిచేస్తే తప్పనిసరిగా విజయం సాధిస్తారు.చాలాకాలం క్రికెట్‌లో రాణించాలనేదే తన ఆశయంగా చెపుతున్నారు మేఘన. మిథాలీరాజ్‌లా వీలైనని సంవత్సరాలు క్రికెట్ ఆడుతూనే ఉంటానంటున్నారు మేఘన. ప్రోటీన్‌లు,కార్బోహైడ్రేట్స్ కోసం గుడ్డు పాలు తప్పనిసరిగా తీసుకోవాలి. స్పోర్ట్స్‌లోకి రావాలంటే ముఖ్యంగా ఆడపిల్లల్ని అంత దూరం పంపించాలా అని ఆలోచిస్తున్నారు. ముందుగా అలాంటి ఆలోచనల్ని రానీయకూడదు. క్రీడల్ని కెరీర్‌గా ఎంచుకుని, కష్టపడి పనిచేస్తే తప్పనిసరిగా విజంయ సాధిస్తారు.

# మన కోసం

**జనరల్ స్టోర్స్**

| | | | |
|---|---|---|---|
| శ్రీ విజయలక్ష్మి | తుళ్ళూరు | చందోలు సత్యనారాయణ | 9441411432 |
| ఎపి.ఎస్.ఆర్. | తుళ్ళూరు | పురపాటి శ్రీనివాసరావు | 94411 28030 |
| ఖాజా ఖాదార్ | రాయపూడి | షేక్ జానీ | 9948450761 |
| తేజశ్వి | మందడం | నన్నపనేని నరేష్ | 9063631234 |
| దాదా | రాయపూడి | కౌసర్ | 99890 35143 |

**రియల్ ఎస్టేట్**

| | | | |
|---|---|---|---|
| శ్రీ సాయిరామ్ | తుళ్ళూరు | పి. పోతురాజు | 9985853188 |
| వంశీకృష్ణ | పెదపరిమి | ఎ.రాము | 9848551688 |
| క్యాపిటల్ | తుళ్ళూరు | వి.వీరాంజనేయులు | 9346229631 |
| నాగార్జున | రాయపూడి | చెరుకూరి బాబి | 7287098458 |
| రియల్‌టర్స్ | రాయపూడి | ఎండి ఆదామ్ | 9441754056 |

**సెలూన్ షాప్**

| | | |
|---|---|---|
| వెస్ట్రన్‌లుక్ | పెనుమాక గోపి | 9908183377 |

**రెస్టారెంట్స్**

| | | | |
|---|---|---|---|
| గోదావరి రుచులు | తుళ్ళూరు | యన్.రామరాజు | 9703908055 |
| బిర్యానిస్ | విజయవాడ | ------- | 7032202222 |
| శ్రీ విజయ గణపతి బ్రాహ్మణ | విజయవాడ | కె.లక్ష్మి,గణపతి | 9948462515 |
| అతిధి | వెలగపూడి | సందీప్ | 9441 228460 |
| చినస్వామి రాజధాని | సచివాలయం ప్రాంతం | | 9963441052 |
| శ్రీ దుర్గావిలాస్ | మల్కాపురం | కె.వి.రాజు | 94908 50243 |
| అయ్యప్పభోజనం | వెలగపూడి | | 99084 57372 |

**జ్యూయలర్స్**

| | | | |
|---|---|---|---|
| లలిత | తుళ్ళూరు | నాలమాలు మధు | 7905505854 |
| రాజా | తుళ్ళూరు | ప్రభురాజా | 9581500500 |

**షాప్స్**

| | | | |
|---|---|---|---|
| రేమాండ్స్‌టైలర్స్ | తుళ్ళూరు | ఎస్.కె. జాని | 9492470426 |
| వర్షిత ఫోటోస్టాట్ | రాయపూడి | పోతురాజు | 9985853188 |
| రాయల్ ఫర్నిషింగ్స్ | తుళ్ళూరు | కె. సుబ్బారావ | 9492485385 |
| బిస్మిల్లా పెయింటింగ్ వర్క్స్ | రాయపూడి | షేక్. మజీదు | 7095880828 |
| కె.జి .ఎన్. కారు ట్రావెల్స్ | రాయపూడి | ఎస్.కె.సుబాని | 97040 74820, |
| సి .ఓ వైభవ్ డ్రస్సెస్ | తుళ్ళూరు | వెంకట పున్నారావు | 08645-244484 |
| చైతన్య గోదావరి | | | |
| గ్రామీణ బ్యాంకు | రాయపూడి | | 08645244266 |
| శైవక్షేత్రము | తాళ్ళాయపాలెం | శివస్వామిజీ | 08863297856 |
| ఉంగరాల హుస్సేన్ టెంట్‌హౌస్ | రాయపూడి | ఉంగరాల . ఖాజ | 9441275466 |
| అంజుమన్ టెంట్ హౌస్ | రాయపూడి | పఠాన్ బాషా ఖాన్ | 9502085516 |
| లాస్య డిజిటల్ స్టూడియో | రాయపూడి | రవికుమార్ | 9491647400 |
| స్టైల్ ఫర్ మెన్ | తుళ్ళూరు | ఎస్.ఎమ్.జాని | 94403 07123 |

**ట్రేడర్స్**

| | | | |
|---|---|---|---|
| సాయి గణేష్ | వెలగపూడి | జొన్నలగడ్డ మనోజ్ కుమార్ | 7382371111 |
| శ్రీ చంద్రిక | రాయపూడి | కోలా శ్రీనివాసరావు | 9908073516 |

**ఎలక్ట్రికల్ వర్క్**

| | | | |
|---|---|---|---|
| ఫయాజ్ | రాయపూడి | షేక్. కలాం | 9440521023 |
| న్యూస్టార్ | రాయపూడి | షేక్. ఖాజా | 9553741230 |
| స్టార్ | విజయవాడ | ఎస్.కె.షరీఫ్ | 97038 14862 |
| గ్రీన్ అండ్ కూల్ | తుళ్ళూరు | ఎస్. జాని | 96031 06678 |

## శబరిమలలో మహిళలకు ప్రవేవం

**కేరళ ప్రభుత్వం**

**న్యూఢిల్లీ :** శబరిమల ఆలయంలోకి అన్ని వయస్సుల మహిళలను అనుమతించేందుకు సిద్ధంగా ఉన్నామని సుప్రీంకోర్టుకు కేరళ ప్రభుత్వం తెలియజేసింది. ఈ అంశంపై చాలాకాలంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో కేరళ ప్రభుత్వం తన వైఖరిని మార్పు చేసుకుని మహిళలను అనుమతిస్తామని తెలియజేసింది. ఆలయంలో మహిల ప్రవేశానికి సంబంధించిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారిస్తోంది. 10 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సులైన మహిళల ప్రవేశంపై దేశ అత్యున్నత న్యాయస్థానం బెంచ్‌ను మార్పు చేసిన తర్వాత తొలిసారిగా విచారణ జరిపింది. అయితే ఈ విషయంలో స్టేటస్‌కో ఆర్డర్‌ను కొనసాగించాలని ఆలయ తంత్రీ కన్‌దారు రాజీవదరు గత నెలలో పేర్కొన్నారు. భక్తుల విశ్వాసాలకు సంబంధించిన అంశాన్ని ప్రభుత్వం ఎలా చేతుల్లోకి తీసుకుంటుందని ఆయన అన్నారు. 2006లో తొలిసారిగా దాఖలయన ఈ పిటిషన్‌పై అనేక ఏళ్లుగా ఈ కేసును ఇప్పటికే సుప్రీంకోర్డుకు చెందిన మొత్తం 10 న్యాయమూర్తులు వేర్వేరుగా విచారణ జరిపారు. ఇదిలా ఉండగా సుప్రీంకోర్టు ఫిబ్రవరి 12న కేసు విచారణ సందర్భంగా పురుషులు, మహిళలంటూ భగవంతుడికి వివక్ష ఉండనపుడు ఆలయంలో మహిళల ప్రవేశంపై ఆంక్షలను ఒక మనిషి నిర్దేశించడంలో ఆశ్చర్యకరంగా ఉందని పేర్కొంది. ఆలయంలో మహిళ ప్రవేశంపై యూడీఎఫ్ ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. అయితే ఆలయంలోకి అన్ని వయస్సుల మహిళల ప్రవేశానికి అనుకూలంగా 2016లో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది.

## విజయవాడలో విదేశీ పోస్టాఫీసు

**ఏపీ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ ఎం సంపత్**




**రాజధాని ప్రతినిధి,(విజయవాడ) :** నవ్యాంధ్ర రాజధాని విజయవాడలో విదేశీ పోస్టాఫీసును త్వరలోనే ప్రారంభిస్తామని ఏపీ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ ఎం సంపత్ తెలిపారు. దీని ఏర్పాటుకు సంబంధించి ఆయన కస్టమ్స్ రాష్ట్ర , కార్యాలయంలో కమిషనర్ ఎస్‌కే రహమాన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనతో మీడియాతో మాట్లాడుతూ గుంటూరు, కృష్ణా సహా ఉభయ గోదావరిజిల్లాలలో ఎన్‌ఆర్‌ఐలు అధికంగా ఉన్నారని తెలిపారు. ఏపీ రాజధానిగా విజయవాడ అయినందున ఇక్కడే విదేశీ పోస్టాఫీసును ఏర్పాటు చేసేందుకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజు, కస్టమ్స్ నోటిఫికేషన్‌ను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజు, కస్టమ్స్ నోటిఫికేషన్‌ను విడుదల చేసిందన్నారు. దీనిని తపాలాలోపాటు కస్టమ్స్‌శాఖలు పరస్పర అవగాహనతో నిర్వహించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం స్థలాన్వేషణ చేస్తున్నామని, వీలైనంత త్వరలోనే పోస్టాఫీసును అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కస్టమ్స్ కమిషనర్ రెహమాన్ మాట్లాడుతూ విదేశీ పోస్టాపీసులో ఎగుమతి, దిగుమతులకు సంబంధించిన తపాలా పార్శిల్స్ తనిఖీలన్నీ కస్టమ్స్ సిబ్బంది పర్యవేక్షణలోనే జరుగుతాయన్నారు. దిగుమతి సుంకం చెల్లించవలసి వచ్చినపుడు పోస్టాఫీసులోనే చెల్లించవచ్చన్నారు.

విదేశీ వస్తువుల దిగుమతి లైసెన్స్ కలిగిన వారు పోస్టాపీసు ద్వారా దిగుమతి చేసుకునే అవకాశం లేదన్నారు. విమానాశ్రయం, నౌకాశ్రయం, ఇన్‌లాండ్ కంటైనర్ డిపో (ఐసీడి)ల ద్వారానే వారు దిగుమతి చేసుకోవాలని ఆయన సూచించారు. నిషేధం ఉన్న సరుకును పోస్ట్ పార్శిల్ ద్వారా పంపించడం నేరంగా పరిగణిస్తామన్నారు. ఈ సందర్భంగా సంపత్‌ను కమిషనర్ రమమాన్ దుశ్శాలువాతో సత్కరించారు. సమావేశంలో కస్టమ్స్ జాయింట్ కమిషనర్లు సాధు నరసింహారెడ్డి, ఎం రామమోహనరెడ్డి, డిప్యూటీ కమిషనర్లు ఎన్ నరేష్, సతీష్ ; జీఎస్ మురళీధర్, సీఎస్ రాజు, సూపరింటెండెంట్ గుమ్మడి సీతారామయ్య చౌదరి, శ్రీనివాస్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# ప్లాట్ల పంపిణీ పూర్తి

**ఆన్‌లైన్‌లో పూర్తి వివరాలు**




**రాజధాని ప్రతినిధి - విజయవాడ :** రాజధాని అమరావతిలో భూసమీకరణ కింద భూములు ఇచ్చిన రైతులకు ఏపీ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీ సీఆర్‌డీఏ) ప్లాట్ల పంపిణీ కార్యక్రమాన్ని ముమ్మరం చేసింది. ఇప్పటివరకు తుళ్ళూరు మండలంలోని 10 గ్రామాల్లో కూడా త్వరితగతిన ప్లాట్ల పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తోంది. నూతన రాజధాని నిర్మాణం కోసం ప్రభుత్వం గుంటూరు జిల్లా పరిదిలోని తుళ్ళూరు, తాడేపల్లి, మంగళగిరి మండలాల్లోని 25 రెవిన్యూ గ్రామాల పరిదిలో 24వేల మంది రైతుల నుంచి దాదాపు 34, 984 వేల ఎకరాల భూమి సేకరించింది. ఇంత భూమిని రైతులు స్వచ్ఛందంగా ప్రభుత్వానికి అప్పగించడం విశేషం. కాగా సమీకరించిన భూమిలో సుమారు 14వేల ఎకరాలకు పైగా భూమిని రెసిడెన్షియల్ ప్లాట్లుగా విభజించి ప్రభుత్వం రైతులకు అందజేస్తోంది. జూన్ 25వ తేదీ నుంచి సీఆర్‌డీఏ లాటరీ పద్ధతిలో ప్లాట్లను రూతులను కేటాయిస్తుంది. తొలుత నేలపాడు గ్రామంలో ప్లాట్ల పంపిణీ ప్రక్రియను ప్రారంభించంగా, ఇప్పటివరకు తుళ్ళూరు మండలంలోని పదిగ్రామాల్లో 11,12,13,15,16ఎ, 17,18,19 యూనిట్లలో 9,181 రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాట్లు కలిపి బోరుపాలెంలో 1001 ప్లాట్లు పంపిణీ చేయగా, అబ్బురాజుపాలెంలో 1298, పిచ్చుకులపాలెంలో 1116, దొండపాడులో 368, ఐనవోలులో 2245, కొండమరాజు పాలెంలో 1285, మల్కాపురంలో 612, నెక్కల్లులో 2316, నేలపాడులో 2018, శాఖమూరులో 3031 ప్లాట్లు పంపిణీ చేశారు. లాటరీ తీయడానికి సీఆర్‌డీఏ ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ ఆధ్వర్యంలో ప్లాట్లు లాటరీ తీస్తారు. ఆవెంటనే కాంపిటెంట్ ఆథారిటీ అధికారి సంతకం చేసి హక్కు పత్రాన్ని రైతులకు అందజేస్తున్నారు. ఆ పత్రంలో ప్లాట్ నెంబరుతోపాటు భూమి వివరాలుంటాయి. ప్లాట్ల పంపిణీకి ముందు ఆయా గ్రామాల్లో రైతులను సమావేశపర్చి అధికారులు వారికి అవగాహన కల్పిస్తున్నారు. సీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ రైతుల అనుమానాలను నివృత్తి చేస్తూ దగ్గనుండి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. అలాగే ప్లాట్ల విభజనకు సంబంధించిన పూర్తి వివరాలను సీఆర్‌డీఏ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నారు. అన్ని గ్రామాల మ్యాపులు, లేఅవుట్లు, డ్రై, జరీలు భూముల రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాట్ల వివరాలు, అన్ని ప్లాట్ల హక్కు పత్రాలను ఆన్‌లైన్‌లో వుంచారు. ఈ వివరాలను అందరూ తిలకించే అవకాశంతోపాటు, వెబ్‌సైట్ నుంచి హక్కు పత్రం పొందే అవకాశం కూడా కల్పించారు.

# సీఎం హామీల అమలు 30 శాతమా?

**రాజధాని ప్రతినిధి-విజయవాడ :** దేశంలోనే అత్యధికంగా రెండంకెల వృద్ధి రేటుతో ఏపీ ముందుంది. ఇక్కడ అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా అమలు చేయలేదు. మనమే అందరికీ ఆదర్శమంటూ పదే పదే ఆర్భాటపు ప్రకటనలు చేసే ముఖ్యమంత్రి, తాను ఇచ్చిన హామీల్లో 30 శాతం కూడా అమలుకు నోచుకోకపోవడాన్ని చూసి ఖంగుతిన్నారు. ముఖ్యమంత్రి హామీల అమలుపై 12 విభాగాల అధికారులతో చంద్రబాబు సమీక్షించారు. మొత్తం 926 హామీలకు గాను 283 పూర్తిస్థాయిలో పరిష్కారించగా, 628 పరిష్కారదిశలో వున్నామని అధికారులు వివరించారు. మరో 15 హామీల అమలుకు చొరవ తీసుకోవల్సి వుందన్నారు. మొత్తం హామీల్లో 30,56శాతం పరిష్కారమయ్యాయని చెప్పారు. దీనిపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి నేనిచ్చిన హామీలు అమలు కాకపోతే ఎలా అంటూ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు మనం ఒక వాగ్దానం చేశామంటే అది ఎంటనే అమలు కావాలి. అప్పుడే మనపై ప్రజలకు విశ్వాసం పెరుగుతుంది. ముఖ్యంగా నేను జిల్లాల్లో పర్యటించేటప్పుడు అంతకుముందు ఇచ్చిన వాగ్దానాలన్నీ అమలు జరగాలి. దీనిపై అధికారులకు ఏదైనా సమస్య ఎదురైతే తన దృష్టికి తేవాలి. ఇచ్చిన హామీల్లో 30శాతం అమలు కావడం ఏమిటి? ఇకపై ఇలా జరుగకూడదు, అధికారులు పూర్తిగా సహకరిస్తేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని సీఎం వారికి క్లాను తీసుకున్నారు. నిధులులేవనే సమస్యలేదు, ఎక్కడ నిధులు అవసరమైతే అక్కడ కన్వర్జెన్స్‌తో ముందుకు వెళుతున్నాం, నాబార్డ్ లాంటి వ్యవస్థలతో ఇబ్బందులు వస్తే నా దృష్టికి తీసుకురండి అని చెప్పారు. ముఖ్యమంత్రి మంజూరు చేశారు, తాను ఇచ్చిన హామీలన్నిటినీ సత్వరమే అమలు చేయాలని ఆదేశించారు. జిల్లాలవారీగా ఇచ్చిన హామీలు, అమలు తీరునుపరిశీలిస్తే శ్రీకాకుళంలో 55 హామీలకు గాను 17 అమలయ్యాయి. విజయనగరంలో 31కి 13, విశాఖలో 129 హామీలకు 12, తూర్పుగోదావరిలో 57కి 27, పశ్చిమగోదావరిలో 194కి 60, కృష్ణాలో 22, గుంటూరు జిల్లాలో 44కి 11, ప్రకాశంలో 55కి 12, నెల్లూరులో 26కి 3, చిత్తూరులో 99కి 53 హామీలు పూరిస్థాయిలో అమలయ్యాయి. మంత్రి కిమిడి మృణాళిని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సత్యప్రకాష్ టక్కర్, సతీస్ చంద్ర, ఎ.వి.రాజమౌళి, ఐటీ కార్యదర్శి ప్రద్యుమ్న పాల్గొన్నారు.

# అత్యాధునిక పోలీసు వ్యవస్థ

- విశాఖ దగ్గర్లో గ్రౌంహౌండ్స్ శిక్షణ కేంద్రం
- రూ.253 కోట్లతో ఫోరెన్సిక్ ల్యాబ్
- డిజిపి సాంబశివరావు వెల్లడి



**రాజధాని ప్రతినిధి-విజయవాడ :** రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్ చాలా నష్టపోయింది. వాటి నుండి బయట పడటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలీసు వ్యవస్థను ఆదుకుంటున్నట్లు డిజిపి సాంబశివరావు తెలిపారు. డిజిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పోలీసు వ్యవస్థ మరింత ఆధునికంగా తయారుకాబోతుందన్నారు. రాష్ట్రంలో ఫోరెన్సెక్ సైన్స్ ల్యాబ్‌కు రూ.253 కోట్లుతో ఏర్పాటు చేయబోతున్నట్లు, వీటిలో కేంద్రం నుండి రూ.153 కోట్లు, రాష్ట్రం నుండి రూ.100 కోట్లు రాబోతున్నట్లు తెలిపారు. విశాఖపట్నంకు దగ్గర్లో గ్రేహౌండ్స్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కృష్ణాపుష్కరాలలో నేరస్తులను పట్టుకోవడానికి ఏ విధంగా అయితే అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించామో అదే విధంగా రానున్న రోజుల్లో రాష్ట్రంలో మరింత టెక్నాలజీని ఉపయోగించనున్నట్లు పేర్కొన్నారు.అదే విధంగా పబ్లిక్ ప్రాపర్టీని ధ్వంసం చేసేవ్యక్తులను ప్రేరేపించే వారితో పాటు వాటికి సంబంధించిన సంస్థలపై సుప్రీం కోర్టు సూచన మేరకు మరింత కఠినంగా వ్యవహరించటం జరుగుతుందన్నారు. పైరులను కాపాడే బాధ్యత పోలీసులపై ఉందన్నారు. ఎమర్జెన్సీ కోసం నెం.112 వినియోగంలోకి రానున్నదన్నారు. రాష్ట్రంలో పోలీసు రిక్రూట్‌మెంట్ పరీక్షకు 3.82లక్షల మంది అభ్యర్థుల హాజరైనట్లు పేర్కొన్నారు. పోలీసులు ఏ ఒక్కరికో అనుకూలంగానో, లేదా వ్యతిరేకంగానో వ్యవహరించరని అన్నారు. మావోయిస్టులు పోలీసులపై ఎప్పుడూ ఆరోపణలు చేస్తూనే ఉంటారని ఒక ప్రశ్నకు జవాబుగా చెప్పారు. ప్రజల్లో వారికి మద్దతు లేదన్నారు. ఈ సమావేశంలో లా అండ్ ఆర్డర్ అడిషనల్ డిజిపి ఆర్.పి.ఠాగూర్ పాల్గొన్నారు.

## తుళ్ళూరు ఏఎస్పీగా విక్రాంత్ పాటిల్

**రాజధాని ప్రతినిధి-గుంటూరు :** రాష్ట్ర రాజధాని నిర్మాణం జరుగుతున్న తుళ్ళూరు సబ్ డివిజన్‌కు అడిషనల్ ఎస్పీగా విక్రాంత్ పాటిల్‌ను నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. తుళ్ళూరు సబ్ డివిజన్ ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం కొన్ని నెలల క్రితం నిర్ణయం తీసుకున్నప్పటికీ ఇంతవరకు అమలులోకి రాలేదు. తుళ్ళూరు సబ్ డివిజన్ పరిధిలో ఉన్న తుళ్ళూరు, పెదకూరపాడు, అమరావతి పోలీసు స్టేషన్లను అప్‌గ్రేడ్ చేయడంతోపాటు సుమారు 654 మంది సిబ్బందిని కొత్తగా నియమించనున్నారు. సబ్ డివిజన్ పూర్తి స్థాయిలో ఏర్పడకముందే సబ్ డివిజన్ అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో విక్రాంత్ పాటిల్ బ్యాధతలు స్వీకరించారు.

## జనవరిలో కొత్త రేషన్ కార్డులు

**రాజధాని ప్రతిధిని-శ్రీకాకుళం :** రాష్ట్రంలోని రేషన్ డిపోల ద్వారా త్వరలో మరిన్ని నిత్యావసర వస్తువులు సరఫరా చేయాలని ఆలోచనచేస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి పరిటాల సునీత అన్నారు. వచ్చే జనవరిలో రాష్ట్రంలో కోటీ 30 లక్షల కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేయనున్నామన్నారు. శ్రీకాకుళం సూర్యమహల్ జంక్షన్ వద్ద చౌకధరల దుకాణాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సునీత మాట్లాడుతూ ఇంకా రేషన్ కార్డు లేనివారు జన్మభూమి, మావూరు కార్యక్రమాల్లో కార్డులు పొందవచ్చు అన్నారు. చంద్రన్న సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా వలే క్రిస్మస్ కానుక కూడా అందిస్తామని తెలిపారు. క్రిస్మస్ కానుకలో చక్కెరకు బదులు బెల్లం ఇస్తున్నట్లు వివరించారు. రేషన్ బియ్యం సక్రమంగా లేకపోతే లబ్ధిదారులు వెంటనే తిరిగి ఇచ్చేయవచ్చని తెలిపారు. తనిఖీల్లో టీడీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షురాలు గౌతు శిరీష, గీతాశ్రకాంత్, తహశీల్దార్ ఎస్.సుధాసాగర్ పాల్గొన్నారు.

## మార్చిలో సార్క్ ఉపగ్రహ ప్రయోగం

**ఇస్రో చైర్మన్ ఎ.ఎస్.కిరణ్‌కుమార్**



**తిరువనంతపురం :** భారత ప్రతిష్టాత్మక దక్షిణాసియా ఉపగ్రహాన్ని వచ్చే మార్చిలో ప్రయోగించనున్నట్లు ఇస్రో చైర్మన్ ఎ.ఎస్.కిరణ్‌కుమార్ తెలిపారు. సార్క్‌సభ్యుల ప్రయోజనం కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఈ ఉపగ్రహ ప్రతిపాదన చేశారు. షెడ్యూల్ ప్రకారం ఈ ఉపగ్రహాన్ని ఈ ఏడాది డిసెంబరులో ప్రయోగించాల్సి ఉంది. ఇక్కడ కిరణ్‌కుమార్ ఒక కార్యక్రమ వివరాలను విలేకరులకు వెల్లడిస్తూ మార్చిలో సార్క్ ఉపగ్రమాన్ని ప్రయోగిస్తామన్నారు. టెలీ మెడిసిన్,టెలి కమ్యూనికేషన్‌తో సహా వేర్వేరు రంగాల్లో ప్రాంతీయ గ్రూపు సభ్యుల ప్రయోజనార్ధం సార్క్ ఉపగ్రహాన్ని ప్రయోగించి బహుమతిగా అందజేస్తామని 2014, నవంబరులో నేపాల్‌లో సార్క్ సదస్సు సందర్భంగా మోడీ తెలిపారు. అయితే ఈ ప్రాజెక్టు నుంచి పాకిస్తాన్ వెళ్లిపోయిన నాటి నుంచి దీనిని దక్షిణాసియా శాటిలైట్‌గా పిలుస్తున్నారు. ప్రాంతీయ గ్రూపు కోసం ప్రత్యేకించి ఒక శాటిలైట్ కోసం తుది విధివిధానాలకు సార్క్ దేశాల నిపుణులతో భారత్ సంప్రదింపులు జరుపుతోంది. డిసెంబరులో ప్రయోగించనున్న జీఎస్ఎల్వీ మార్క్-3 పై ఇస్రో చైర్మన్ మాట్లాడుతూ ఆ ఉపగ్రహానికి సంబంధించి పూర్తిస్థాయిలో ప్రయోగ ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. 'శ్రీహరికోటలో ప్రయోగించేందుకు మేము ఏర్పాట్లు చేస్తున్నాం వీలైంతన త్వరగా నిర్వహించేందుకు పనులు చేపట్టాం. డిసెంబరులో ప్రయోగించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం' అని తెలిపారు.మూడవ ప్రయోగ కేంద్రంపై ఇస్రో ఛీఫ్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ప్రయోగ కేంద్రాన్ని పూర్తిగా వినియోగిస్తున్నందున మరో కేంద్ర అవసరం ఉందని చెప్పారు. అంతకుముందు, ఇంటర్- సెంటర్ స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్న 14 ఇస్రో కేంద్రాల నుంచి వెయ్యి మంది క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతూ టీమ్ వర్క్ మెరుగుపడటంతోపాటు మానసికంగా,శారీరకంగా మరింత శక్తిపుంజుకోవడానికి, అవరోధాలు తొలగేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో విక్రమ్ సారాభాయ్ అంతరిక్ష పరిశోధనా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కె.శివన్ కూడా పాల్గొన్నారు.

# రాజధాని గ్రామాల్లో నిర్మాణాలకు తుళ్ళూరులోనే దరఖాస్తులు స్వీకారం

**రాజధాని ప్రతినిది ,(విజయవాడ) :** అమరావతి రాజధాని నగర పరిధిలోని గ్రామాల్లో భవన నిర్మాణాలకు సంబంధించిన ధరఖాస్తులను తుళ్లూరులోనే స్వీకరించేందుకు స్వీకరించాలని సీఆర్‌డీఏ కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ నిర్ణయించారు. దీనికోసం సంబంధిత అధికారులను కూడా ఏర్పాటు చేసినట్లు సంస్థ డెవలెప్‌మెంట్ కంట్రోల్ విభాగం డైరెక్టర్ వి. రాముడు తెలిపారు. సంబంధిత సాఫ్ట్‌వేర్ సిద్ధమవగానే త్వరలోనే రాజధాని పరిధిలోని గ్రామాలన్నింటిలో డీసీఎం ఎస్ ద్వారా ఆన్‌లైన్ విధానంలో భవన నిర్మాణ ధరఖాస్తులను స్వీకరిస్తారన్నాని విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అమరావతి రాజధాని నగర పరిధిలోని గ్రామాల్లో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి సాధన నిమిత్తం ప్రజలకు తగుసహాకారం అందించే దిశగా పలు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా నేలపాడు, అనంతవరం గ్రామాల్లో డెవలెప్‌మెంట్ ఫెసిలిటేషన్ సెంటర్ ద్వారా ప్రజలకు భవన నిర్మాణ అనుమతులపై జోనల్ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మణరావు, అధికారి హిమబిందు అవగాహన కల్పించారని తెలిపారు. నిర్మాణాలకు అనుమతులు ఏవిధంగా తీసుకోవాలనే అంశం వివరించారని ఆయన పేర్కొన్నారు. నేలపాడులో జరిగిన కార్యక్రమంలో గ్రామస్తుల నుండి కొన్ని అభ్యర్థనలు అందాయన్నారు. పాత ఇళ్లకు, స్థలాలకు తగిన డాక్యుమెంట్లు లేవని, వంశపారంపర్యంగా వస్తున్న ఇవి తమ స్వాధీనంలో ఉన్నాయనే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. అలాగే అనంతవరంలో కొందరు గ్రామస్తులు గ్రౌండ్‌ఫ్లోర్, జీ ప్లస్ వన్ ఉన్న పాత భవనాలకు ఎలాంటి అదనపు రుసుము చెల్లించకుండా అదనపు అంతస్తులు వేసుకునే అవకాశం కల్పించాలని కోరారన్నారు. అయితే రాజధాని పరిధిలోని గ్రామాల్లో నూతనంగా నిర్మించే భవనాలు నిబంధనలకు అనుగుణంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. గ్రామాల్లో ఇరుకు రహదారుల వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా ప్రణాళికబద్ధమైన నిర్మాణాల విషయంలో ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

**నేడు ఉద్దండరాయునిపాలెంలో అవగాహన కార్యక్రమం**

భవన నిర్మాణాలకు సంబంధించి ఉద్దండరాయుని పాలెం, లింగాయపాలెంలో భవన నిర్వహిస్తున్నట్లు రాముడు తెలిపారు. అలాగే ఈనెల 10న ఐనోవోలు శాఖమూరు, 14న నవులూరు, కృష్ణాయపాలెం, 15న కురగల్లు, నీరుకొండ,16న ఉండవల్లి, పెనుమాక, 17న ఎర్రబాలెం, మంగళగిరి మున్సిపల్ ఏరియాలో, 19న బేతపూడి, నిడమర్రు, 21న మందడం , తాళ్లాయపాలెం , 22న కొండమరాజుపాలెం, మోదుగు ల్లంకపాలెం, 23న తుళ్లూరు, రాయపూడి, బోరుపాలెం, 24న నెక్కల్లు, 26న వెంకటపాలెం, 28న తాడేపల్లి మున్సిపాలిటీ ఏరియాలో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

# చంద్రబాబుపై నిఘా పెట్టాలి : బొత్స




**రాజధాని ప్రతినిధి ,(హైదరాబాద్) :** పెద్ద నోట్ల రద్దుపై ప్రధాన మంత్రి మోడీ తీసుకున్న నిర్ణయం ముందుగానే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబునాయుడికి ఎలా తెలిసిందంటూ వైసిపి సీనియర్ నాయకులు బొత్స సత్యనారాయణ అన్నారు. దీనిపై కేంద్రం నిఘా పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రధాని నిర్ణయాన్ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తుందన్నారు. నల్లధనాన్ని వెనక్కు తీసుకురావడానికి కేంద్రం ఏ నిర్ణయాలు తీసుకున్నా తాము పూర్తిగా స్వాగతిస్తామన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయం లోటస్‌పాండ్‌లో బొత్స విలేకరుతో మాట్లాడారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండాలనేది తమ అభిప్రాయమన్నారు. దేశంలో 6 లక్షల 3 వేల గ్రామాలు ఉండగా, జనాభాలో 60 శాతం మంది ప్రజలు గ్రామీణ ప్రాంతాల్లోనే నివసిస్తున్నారని అయితే వారందరికిసరిపడా విధంగా మాత్రం బ్యాంకులు లేవన్నారు. ఇంత భారీ మొత్తంలో లావాదేవీలు జరపటానికి చాలా ఇబ్బందులు ఏర్పడవచ్చని బొత్స అన్నారు. ధనవంతులకు, పారిశ్రామిక వేత్తలకు లావాదేవీలు జరపటానికి ఎలాంటి ఇబ్బందులు ఉండని, కానీ సామాన్య ప్రజానీకం మాత్రమే ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశాలునాయన్నారు. రాత్రికి రాత్రే పెద్ద నోట్లను రద్దు చేయడంతో ప్రజలంతా ఆందోళనలో ఉన్నారన్నారు. గొప్ప నిర్ణయాలు తీసుకుంటున్నప్పుడు ప్రభుత్వాలు దానికి తగ్గట్టు ప్రజలకు ఇబ్బందుల ఏర్పడకుండా ముందుకు వెళ్లాలన్నారు. సామాన్య ప్రజలు లావాదేవీలు జరపటానికి తగ్గట్లు విధానం రూపొందించాలని బొత్స సూచించారు. నల్లధనంపై కఠిన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. పెద్ద నోట్లను రద్దు చేస్తారన్న విషయం చంద్రబాబు నాయుడుకు ముందుగానే ఎలా తెలిసిందటూ ప్రశ్నించారు. ముందుగానే ఎలా తెలిసిందంటూ ప్రశ్నించారు. ముందుగా తెలిసే హెరిటుజ్‌ను కూడా విక్రయించుకున్నారంటూ ఆరోపించారు. రాష్ట్రంలో చంద్రబాబు ఏ విధంగా ప్రజాధనాన్ని దోచుకుంటున్నారో చంద్రబాబు ఏ విధంగా ప్రజాధనాన్ని దోచుకుంటున్నారో అందరికీ తెలుస్తుందన్నారు. ఈ విషయాన్ని ముందుగానే తెలుసుకొని చంద్రబాబు జాగ్రత్త పడి ఉంటారని బొత్స అనుమానం వ్యక్తం చేశారు. ఓటుకు కోట్లు కేసులో రూ.500 నోట్ల కట్టలను రేవంత్‌రెడ్డి ద్వారా చంద్రబాబు పంపించారని బొత్స పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడులాంటి వ్యక్తులు రాష్ట్రంలో ఉండటం దురదృష్టకరమన్నారు. ఓ వైపు సమాచారాన్ని ముందుగానే తెలుసుకొని జాగ్రత్త పడ్డారని, మరో వైపు లేఖలు రాశారని, ఆ తర్వాత తన అంత ఉత్తములు లేరంటూ కితాబులిచ్చుకుంటారని బొత్స ఎద్దేవా చేశారు.

# అభివృద్ధిదారులతో సీఆర్‌డీఏ సమావేశం

**రాజధాని ప్రతినిధి-విజయవాడ :** అమరావతి రాజధానిలో అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించి అభివృద్ధిదారులతో రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) అధికారులు సమావేశం నిర్వహించారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి అజయ్‌జైన్ మాట్లాడుతూ అత్యున్నత ప్రమాణాల జీవనశైలి ఉట్టిపడే విధంగా రాజధాని నగర నిర్మాణం చేపట్టాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ బృహత్ కార్యక్రమంలో దేశంలోని ప్రఖ్యాత అభివృద్ధిదారులందరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా పలుసంస్థలు ప్రతినిధులు హాజరైన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అభివృద్ధిదారులు వివిధ నిర్మాణాలు చేపట్టేందుకు, ఏపీపీఆర్‌డీఏ నమూనా ప్రతిపాదనలను కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ వివరించారు. అభివృద్ధిదారులు కనీసం 17వేల గృహాలుండే సముదాయాలు, పది లక్షల చదురపు అడుగుల వాణిజ్య సముదాయాలు, ఐదు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణలో ఎంటర్‌టైన్‌మెంట్ జోన్లు, ఫుడ్‌కోర్టులు, కన్వెన్షన్ సెంటర్లు అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో మహీంద్ర హౌసింగ్ సంస్థ ప్రతినిధి వైభవ్ జమ్‌హేకర్, టాటా హౌసింగ్ డెవలప్‌మెంట్ కంపెనీ ప్రతినిధి సీఏ ఖిరోడా జెనా, పంచ్‌శీల్ రియాల్టీ సంస్థ ప్రతినిధి వివేక్‌రచ్చ్‌తోపాటు సీఆర్‌డీఏ అధికారులు విరామమోహనరావు, వై నాగిరెడ్డి, ఎ చంద్రశేఖరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రాజధాని నిర్మాణానికి కోళ్ల సమాఖ్య రూ. కోటి విరాళం



**రాజధాని ప్రతినిధి ,(విజయవాడ) :** ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని నిర్మాణానికి ఏపీ కోళ్ల సమాఖ్య భారీ విరాళం అందచేసింది. సమాఖ్య అధ్యక్షుడు సుందరనాయుడు ముఖ్యమంత్రి చంద్రబాబును క్యాంప్ కార్యాలయంలో కలసి రాజధాని నిర్మాణం కోసం సమాఖ్య తరపున రూ.కోటి చెక్కును అందచేశారు. ఈ సందర్భంగా సమాఖ్య ప్రతినిధులను ముఖ్యమంత్రి అభినందించారు. ప్రభుత్వం పౌష్టికాహార పథకాలకు అందిస్తున్న గుడ్ల సరఫరాను తమకు అప్పగించాలని సమాఖ్య చైర్మన్ సుందరనాయుడు ముఖ్యమంత్రిని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించి పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ఆరోగ్యం

# పెందలకడనే భోజనం చేస్తే బరువు పెరుగరు



డాక్టర్. మంతెన సత్యన్నారాయణ


పొద్దుపోయి తిని పడుకోవడం వల్ల శరీరం లావు అయినట్లుగా, బరువు పెరిగినట్లుగా మరి ఏ యితర కారణాల వల్ల అవ్వదు. అన్నింటికంటే ఇదే పెద్ద తప్పు ఈ మధ్య నూటికి 80 మందికి పైగా సున్నగా, బొద్దుగా ఉంటున్నారంటే ఈ తప్పే కారణం. శరీరాన్ని 400 కేజీలకు పైగా రికార్డుల కొరకు బరువును పెంచే సుమోలు, అంత లావు కావడానికి ఆచరించే నియమం మీకు తెలుసా! వారు పగలు పూర్తిగా ఆహారం మాని, పొట్టను మాడ్చి రాత్రి 10,11 గంటలకు అనేకరకాల వంటలను ఫుల్‌గా తిని పడుకుంటారు. పగలు తినే ఆహారానికి వారు లావు అవ్వరు. రాత్రి వేళల్లో తినే వాళ్ళు లావు తగ్గరు. దీని వెనుక శాస్త్రం ఏమిటో ఆలోచిద్దాం. పగలు ఉద్యోగ వ్యాపార రీత్యాకుదిరీ, కుదరక భోజనాన్ని సరిగా చేయకుండా, రాత్రికి పడుకుంటారు. అంటే, సుమారు '450'కిలో కేలరీల శక్తి మీ శరీరంలో నిద్రలో ఖర్చు చేసుకున్నది. మీరు తిన్నది 1000 కేలరీల శక్తి అయితే ఖర్చు 450 పోగా మిగతా 550 కిలో కేలరీల శక్తి పొదుపు అవుతుంది. దీనిని క్రొవ్వుగా మార్చి క్రొవ్వు కణాలలో (బ్యాంకులలో) దాచేస్తుంది. లేచిన వెంటనే టీ, కాఫీలు త్రాగి తేలికపాటి వ్యాయామాలు చేస్తే ఆ కాఫీ, టీలు ఖర్చు అవుతాయి తప్ప నిలువయున్న క్రొవ్వు కరగదు. రోజు రోజుకీ ఇలా కొవ్వును దాచుకుంటూ, బరువు తగ్గాలని ఇంకా ఎన్ని ప్రయత్నాలు చేసినా పూర్తిగా బరువు తగ్గడం సాధ్యపడదు. అంటే 1000 కిలో కేలరీల శక్తినిచ్చే భోజనాన్ని సాయంత్రం '6' గంటలకల్లా తింటే, అప్పటినుండీ రాత్రి 10 గంటల వరకు పడుకుటే లోనే తిన్నది ఖర్చు అవుతుంది. నిద్రలో శరీరానికి కావలసినవచ్చిన శక్తి నిలవయున్న కొవ్వునుండి కరుగుతుంది. కాబట్టి బరువు తగ్గుతారు. లేచిన తరువాత కూడా ఏమి తినకుండా, త్రాగకుండా ఏదన్నా శ్రమ చేసే ఇంకా బరువు బాగా తగ్గుతారు. ఈ మధ్య కూలీలు కూడా అంత కష్ట పడుతున్నా లావుగా ఉంటున్నారు. దీనికి కారణం, వారు కూడా పొద్దుపోయి తిని పడుకుంటున్నారు. మన పూర్వకులు సన్నగా ఉండడానికి కారణం, పెందలకడనే తిని ఆపడం అని మనం మరువకూడదు.

**పెందలకడనే ఆకలవ్వాలంటే ఏమి చేయాలి?**

మీరు సాయంకాలం వెలుతురుండగానే భోజనం చెయ్యమంటున్నారు. బాగానే ఉంది కానీ మాకు డిన్నర్‌ని మాత్రం సంతృప్తిగా తినాలని అందరూ ఉబలాటపడతారు. ఎక్కువ రకాలను, నూనె పదార్థాలను, నాన్‌వెజ్ వంటలను, పలావులను రాత్రి వేళల్లోనే బాగా తింటున్నారు. వెనుకటి రోజుల్లో పురుషులే బయటకు వెళ్ళి ఇలాంటివి తినేవారు. ఈమధ్య ఈ తిండి కోసం స్త్రీలు కూడా తయారవుతున్నారు. స్త్రీ, పురుష భేదం లేకుండా లావుగా మారుతున్నారు. ఇలాంటి వంటలను సంతృప్తిగా తినేవారికి ఆహారం ద్వారా శరీరానికి వచ్చే శక్తి సుమారు 1000కిలో కేలరీలు ఉంటుంది. రాత్రి 10 గంటలకు తిని పడుకోవడం వల్ల శరీరానికి నిద్రలో గంటకు అయ్యే ఖర్చు 60 కిలో కేలరీలు. అందరూ సుమారుగా 7,8 గంటలు పడుకోకుండా తిరుగుతూ మెలకువతో ఉంటారు. ఆ సమయంలో 500 కి లో కేలరీల శక్తి మీరు పడుకోబోయే లోపే మీరు తిన్నదానిలో ఖర్చు అవుతున్నది. రాత్రికి నిద్రలో అయ్యే ఖర్చు '450' కి.కేలు. మీరు పెందలకడనే తినడంవల్ల, తిన్న ఆహారం ద్వారా శరీరానికొచ్చే శక్తి మొత్తం రేపు ఉదయానికల్లా పూర్తిగా ఖర్చు అవుతున్నదే తప్ప కొవ్వుగా మారే అవకాశం లేదు. ఇలా తింటే మీరు భవిష్యత్‌లో లావుకారు. లావుగా ఉన్న మీరు సన్నగా అవ్వాలంటే ఇలా ఇంత తినకూడదు. సాయంకాలం భోజనం '6' గంటలకు 1000 కిలో కే.ల బదురుగా 500 కి కేల శక్తినిచ్చే ఆహారాన్ని తినాలి. ఇలా 500 కి.కేల ఆహారం తింటే ఆకలత్వదు కదా! ఒకవేళ ఆకలి లేక పోయినా అలానే తినమంటారా అని కొందరడుగుతారు. మధ్యాహ్నం తినే భోజనం పదార్థాన్ని బట్టి, తినే సమయాన్ని బట్టి సాయంకాలం అయ్యే ఆకలి ఆధారపడి ఉంటుంది. నూనె, ఉప్పు లేకుండా తేలిగ్గా జీర్ణమయ్యే ఆహారాన్ని వండుకొన్నప్పుడు మధ్యహ్న భోజనాన్ని సుమారు 1,2 గంటల మధ్యలో ముగించగలిగితే మంచిది. అదే నూనె వంటలు, లాంటివి తినవలసినవస్తే వాటిని 12,1గంటల కల్లా ముగించడానికి ప్రయత్నించండి. లేదా ఇలాంటి వంటలను తినవలసి వచ్చినప్పుడు, కుదిరితే ఉదయం టిఫిన్ మాని 10,11 గంటల కల్లా భోజనం తిని సాయంకాలం వరకూ పొట్టను మాడిస్తే చక్కగా పెందలకడనే ఆకలి వేస్తుంది. పనిని బట్టి తినే సమయాన్ని మార్చుకోవడం అందరికీ అలవాటే, కాని ఆరోగ్యం కొరకు ఇప్పట్నుండీ టైం ప్రకారం తిని పనిచేసుకోవడం అన్ని విధాలా మంచిది.

# వేర్పాటువాదులతో చర్చించండి

**కేంద్రానికి యశ్వంత్ సిన్హాప్రైవేటు ప్యానెల్ సిఫార్సు**



**న్యూఢిల్లీ :** వేర్పాటువాదులతో సహా జమ్మూ కాశ్మీర్‌లోని అన్ని వర్గాల ప్రజలతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలని బీజేపీ నేత యశ్వంత్ సిన్హా నేతృత్వంలోని ప్రైవేటు సిటిజన్స్ గ్రూప్ ఒక నివేదికలో పేర్కొంది. అల్లర్లలో గాయపడిన వారికి పునరావాస ప్యాకేజీ,పెల్లెట్ గన్స్ వినియోగంపై నిషేధం విధించడంతో సహా అనేక ఇతర చర్యలను త్వరితగతిన చేపట్టాలని కోరింది. మేధావులతో కూడిన ఈ ప్రతినిధుల బృందం ఈ మేరకు ఆ నివేదికను మీడియాకు విడుదల చేసింది. ప్రధాన స్రవంతిలో ఉన్న రాజకీయ నాయకులు, సయ్యద్ అలీషా గిలానీతో సహా వేర్పాటువాద నాయకులతో సమావేశమై ఈ గ్రూపు మాట్లాడింది. ప్రతినిధుల బృందంలో సభ్యుడు, సెంటర్ ఫర్ డైలాగ్ - రీకాన్సిలేషన్ డైరెక్టర్ సుభోద్ బ్రవే నివేదికను విడుదల చేశారు.

హురియత్ చైర్మన్ మిర్వాజ్ ఉమర్ ఫరూఖ్, గిలానీలు భేషరతు చర్చలకు సిద్ధంగా ఉన్నారని, అవి ముందుగా నిర్ణయించిన పరిధిలోనివి అయితేనే పాల్గొంటామని స్పష్టం చేశారని నివేదిక వివరించింది. 'కేంద్రంతో ఒక శాశ్వత చర్చల ప్రక్రియ ఏర్పాటు కోసం కాశ్మీరీలతో సమావేశమైనపుడు వారి సెంటిమెంట్‌ను మేము గుర్తించాం. చర్చలకు సంబంధించి సాధారణ భారతీయులను తమను ఆహ్వానిస్తే ఇద్దరి ఉద్దేశ్యాలు ఒకటి కాదని, కలిపి చర్చలు నిర్వహిస్తే కొత్త అధ్యాయం మొదలవుతోందని వారు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అని నివేదిక పేర్కొంది. అన్ని వర్గాలతో చర్చలు జరిపేందుకు కట్టుబడి ఉన్నామని బీజేపీ - పీడీపీ సంకీర్ణ ప్రభుత్వం అజెండాలో పేర్కొందని, వీలైనంత త్వరగా చర్చల ప్రక్రియ ప్రారంభించాలని తాము సిఫార్సు చేస్తున్నట్లు తెలిపింది. ప్రజాభద్రతా చట్టం క్రింద అరెస్టయిన మైనర్లను విడుదల చేయాలని, పాఠశాలలన్నింటినీ తెరచే ప్రక్రియను ప్రారంభించాలని ఈ ప్రతినిధుల గ్రూపు సిఫార్సు చేసింది. తిరిగి అరెస్టయిన మైనర్లను మేజర్‌లను ఉంచే జైళ్ల నుంచి తాత్కాలిక జువైనల్ నిర్బంధ కేంద్రాలు ఏర్పాటు చేసి తరలించాలని, అలాగే వారికి మానసికపరమైన కౌన్సిలింగ్ ఇవ్వడంతోపాటు భద్రతాదళాలు లేదా పోలీసుల చర్యల్లో గాయపడిన, మరణించిన పౌరుల కుటుంబాలకు నష్టపరిహారం ప్రకటించాలని సిఫార్సు చేసింది. బెదిరింపులను నివారించేందుకు వారి బ్యాంకు ఖాతాలకు నేరుగా ఆ పరిహారాన్ని బదిలీతోపాటు పెల్లెట్ గన్స్ కారణంగా శాశ్వత అంధులుగా మారిన వారికి జీవితకాలంపాటు తప్పనిసరిగా పునరావాస ప్యాకేజీ ప్రకటించాలని కోరింది. అలాగే పెల్లెట్ గన్స్ కారణంగా పాక్షికంగా కంటి చూపు పోగొట్టుకున్న బాధితులకు (అవసరమైతే భారత్, వీదేశీయులకు) రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా వైద్య చికిత్స అందించడంతోపాటు పరిహారానికి సిఫార్సు కూడా చేయాలని వివరించింది. కాగా పెల్లెట్ గన్స్‌తో కంటి చూపు కోల్పోయిన పిల్లలకు శ్రీనగర్‌లో అంధుల పాఠశాలను ఏర్పాటు చేయాలని మైనార్టీ కమిషన్ మాజీ చైర్మన్ వజహత్ హబీబూబా ముఫ్తీలను కలుసుకున్న కమిటీ, పెల్లెట్ గన్స్ వినియోగించిన పోలీసులపై జ్యుడిషియల్ విచారణకు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేసింది. కేంద్రం పెల్లెట్ గన్స్ వినియోగాన్ని తక్షణమే నిలుపుదల చేయాలని కోరింది. కాగా, భారత, పాకిస్తాన్ చర్చలు కాశ్మీర్‌కు శాశ్వత పరిష్కారాన్ని కనుగొనలేవని కాశ్మీర్ వేర్పాటువాదులు భావిస్తున్నారని గ్రూప్ పేర్కొంది. అయితే అనేక మంది వేర్పాటువాదులు మాత్రం భారత్, పాకిస్తాన్‌ల మధ్య మూడోపక్షం చర్చలకు సిఫార్సు చేస్తున్నారు.

# చిల్లర మాఫియా..!

- రూ.500లకు 400..రూ.1000కు 900
- 20 శాతం తగ్గించుకుని చిల్లర ఇస్తున్న వైనం

**కర్లపాలెం :** దేశ వ్యాప్తంగా ప్రధానమంత్రి మోదీ రూ. 500, 1000 నోట్లు రద్దు చేసిన నేపథ్యంలో చిల్లర కోసం కర్లపాలెంలో పలువురు చిల్లర మాఫియాగా అవతారం ఎత్తారు. రూ. వెయ్యి నోటుకు 200 రూపాయాలు తగ్గించుకుని 800 వందలు ఇస్తున్నారు. పలువురు వద్ద ఉన్న 500,1000 నోట్లు ఇక మారవు అని చిల్లర ఇస్తారని చెపుతున్నారు. దీంతో అధిక మొత్తంలో ఈ దందా విచ్చల విడిగా జరుగుతుంది. ప్రధానంగా ఐలాండ్ సెంటర్‌లోని పలువురు దుఖాణాదారుల ఆధ్వర్యంలో ఈయాన దందాకు తెరలేసినట్లు పలువురు చర్చించుకుంటున్నారు. బడాబాబుల సంగతేమో కాని సామాన్యులను సైతం వీరు వదలట్లేదు. ఒక కూలీ ఉదయం నుంచి సాయంత్రం వరకు పని చేసిన తరువాత యజమాని రూ.500 వేతనంగా ఇచ్చారు. ఈ నేపథ్యంలో యజమానిని ఇదీ చెల్లదంటా అయ్యగారు సరుకులు లేవు దుఖాణంలో సెంటర్‌లోని చిల్లర మాఫీయాగా అవతారమెత్తిన వారి వద్ద 500 వందలకు 400 వందలు తీసుకుని సరుకులు తీసుకుని వెళ్లాడు, కష్టించి చెమటోడ్చి సంపాదించిన సొమ్ములో ఈ విధంగా 100 పోయాయని ఆయన భాదపడుతూ వెళ్లాడు బడా బాబుల గురించి ఏమా కాని సామాన్యులను సైతం చిల్లర మాఫీయా వాళ్లు వదలట్లేదు. సుమారు 20 నుంచి 25 మంది ఈరకంగా ప్రజలు దోచుకుంటున్నట్లు సమాచారం కర్లపాలెం మండలం ఆక్వాసాగు అధికంగా ఉండటంతో వ్యాపార రీత్యా ఇటీవల బాగా అభివృద్ధి చెందింది. దీంతో డబ్బులు ఉన్న విషయం తెలిసిన నాటి నంచే ప్రధానంగా అందరి నోట అదే చర్చ. అప్పు తీసుకునే వారు అప్పు ఇచ్చేందుకు వస్తున్న నిరాకరిస్తున్న పంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ధనికుల సంగతేమో కాని పేదవాళ్లును చిల్లర మాఫియా వాళ్లు ఈ విధంగా చేయటం మంచి పద్దతి కాదని పలువురు వాపోతున్నారు.

# అర్ధరాత్రి రోడ్డు ప్రమాదంలో ఆరుగురి దుర్మరణం



**రాజధాని ప్రతినిధి, కిరణ్ (నూజివీడు) :** నూజివీడు పట్టణం స్టేషన్‌తోటకు చెందిన 30 మంది అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఖమ్మం,పశ్చిమగోదావరి జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతంలో ఉన్న గుబ్బలమంగమ్మ గుడికి రెండు టాటా ఏస్ వాహనాలతో బయలుదేరారు. వాహనం చెడిపోయిందని డ్రైవర్ చెప్పడంతో అందరూ కిందకుదిగి పక్కన నిల్చొన్నారు... ఇదే సమయంలో గంపలగూడెం మండలం వినగడవ సమీపంలో ఉన్న కంకర క్వారీ నుంచి ఏలూరుకు కంకర లోడుతో వెళ్తున్న టిప్పర్ అతివేగంగా వచ్చి వీరితో పాటు టాటా ఏస్ వాహనాన్ని ఊహించని రీతిలో ఢీకొట్టి ఒక్కసారిగా టిప్పర్ వారిపైకి దూసుకు వచ్చింది. రెప్పపాటులో ఆరుగురు విగత జీవులయ్యారు... మరో తొమ్మిది మందికి చేతులు, కాళ్లు విరిగాయి. కృష్ణా జిల్లా నూజివీడు మండలం తుక్కులూరులోని అడవి అంజనేయస్వామి ఆలయానికి సమీపంలో గురువారం తెల్లవారుజామున ఈ ఘోరరోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.... నూజివీడు రూరల్ ఎస్ఐ చిన్ని నాగప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీంతో గురర్రం శ్రీను(28),పందేటి వీరయ్య(45), దేవరకొండ కిషోర్(24), కలువకొల్లు శ్రీను(35), పందేటి రాణి(20), కలవకొల్లు వెంకటేశ్వరరావు(70)లు టిప్పర్ కింద పడి అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. వారిలో ఇద్దరు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడకు తరలించారు. చనిపోయిన వారి కుటుంబ సభ్యులను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేస్తామన్నారు.

# వెలగపూడికి ప్రత్యేక బస్సులు : ఆర్టీసీ ఆర్ఎం శ్రీహరి

**రాజధాని ప్రతినిధి ,(గుంటూరు) :** వెలగపూడిలోని సచివాలయానికి గుంటూరు, తెనాలి, మంగళగిరి డిపోల నుంచి బస్సులను ఏర్పాటు చేయన్నునట్లు ఆర్టీసీ ఆర్ఎం జ్ఞానంగారి శ్రీహరి తెలిపారు. నగరంలోని ఎస్‌విఎన్ కాలనీ నుంచి ఉదయం 8 గంటలకు, 8.30 గంటలకు, పట్టాభిపురం నుంచి 8 గంటలకు, 8.15 గంటలకు, ఎన్టీఆర్ బస్సుస్టేషన్ నుంచి 8 గంటలకు, 8.15 గంటలకు, రైల్వే స్టేషన్ నుంచి 8 గంటలకు, ఐజెఎం వద్ద 8.30 గంటల నుంచి 9 గంటల వరకు ప్రతి 5 నిముషాలకు ఒక బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సాయంత్రం సచివాలయం నుంచి 5.30 నుంచి ఎస్‌విఎన్ కాలనీ, పట్టాభిపురం, రైల్వే స్టేషన్, ఎన్టీఆర్ బస్సుస్టేషన్, తెనాలి, మంగళగిరిలకు బస్సులకు ఏర్పాటు చేశామన్నారు. సచివాలయ సిబ్బంది పనివేళలను దృష్టిలో పెట్టుకుని ప్రతి అరగంటకు రాత్రి 9.30 గంటల వరకు బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

# గంగరాజు రిఫరీలో ముఖ్యమంత్రి క్రికెట్ ఆడారు

**- కె.వి.యస్. దుర్గా ప్రసాద్**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు క్రికెట్ బ్యాట్ పట్టారు. శాప్‌చైర్మన్ పి. ఆశమోహనన్ బౌలింగ్ చేశారు. ఎ.పి.ఎ. , బి.సిసి.ఐ. ఉపాధ్యక్షులు గోకరాజు గంగరాజు రిఫరీగా వ్యవహరించారు. బి.సి.సి.ఐ. కమిటీ చీఫ్ సెలక్టర్ యం.యస్.కె. ప్రసాద్ ముఖ్య అతిథిగా విచేశారు. విజయవాడ యం.పి. కేశినేని నాని, ఎ.పి. జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, కృష్ణాజిల్లా కలెక్టర్ బాబు.ఎ లాంటి ప్రముఖులు ఆటను తిలకించే ప్రేక్షకులయ్యారు. ఈ సంఘటన కొంత వింతగా, మరింత విడ్డూరం అనిపించవచ్చు. అక్షరాలా నిజమండి. నవంబరు 9వ తేదీ కృష్ణాజిల్లాలో జరిగింది. ఒకవైపు రాజధాని అమరావతి నిర్మాణం, మరోవైపు పాలనా వ్యవహారాలలో సతమతమయ్యే ముఖ్యమంత్రి, క్రికెట్ ఆడే తీరుబడి ఎక్కడిది? బి.సి.సి.ఐ. చీఫ్ సెలక్టరు ముఖ్యమంత్రి క్రికెట్ ఆటను తిలకించుటమేమిటి ? అనే సందేహం మేధావులకే కాదు, సామాన్యునికి సైతం వచ్చి తీరుతుంది.

అసలు విషయంలోకి వెళదాం. కృష్ణాజిల్లా, ఇబ్రహీంపట్నం మండలంలో మూలపాడు ఓ చిన్న గ్రామం, విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారిపై, ఇబ్రహీం పట్నంకు 8కిలోమీటర్ల దూరంలో "మూలపాడు" అనే బోర్డు మాత్రం ఉంటుంది. (మాజీ హోమ్ మంత్రి, మాజీ ఆప్కాబ్ చైర్మన్ వసంత నాగేశ్వరరావు జన్మించింది ఆ మారుమూల గ్రామమైన మూలపాడు లోనేనట) అలాంటి మీరు మూలగ్రామానికి ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులు వెళ్ళిరి క్రికెట్ ఆడటం ఆశ్చర్యమనిపించక మానదు. ముఖ్యమంత్రి క్రికెట్ బ్యాట్ పట్టింది అయిదు రోజులు సాగే టెస్ట్ మ్యాచ్ ఆడటానికి కాదు. ఒకరోజులో ఫలితలే 50 ఓవర్ల వన్డే కాదు. ఇటీవల ప్రాచుర్యం పొందుతున్న 20-20 మ్యాచ్ కూడా కాదు. మరెందుకు ముఖ్యమంత్రి బ్యాట్ పట్టారు ?

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ మూలపాడు గ్రామంలో ఒక క్రికెట్ మైదానాన్ని ఏర్పాటు చేసింది. ఆ మైదానాన్ని ముఖ్యమంత్రిచే ప్రారంభించటానికి భారీ ఏర్పాట్లు జరాగాయి. ఆ కార్యక్రమంలో భాగమే ముఖ్యమంత్రి క్రికెట్ ఆడటం, గంగరాజు రిఫరీగా వ్యవహరించటం యమెస్కే ప్రసాద్ ఆటను తిలకించటం, రాజకీయ ప్రముఖులు ఆటను తిలకించటం, నిన్న మొన్నటి వరకు బయట ప్రపంచానికి అంతగా తెలియని మూలపాడు ప్రపంచానికి పరిచయమౌతుంది. అవుతుందేమిటి? ప్రపంచ క్రికెట్ చరిత్రపుటల్లోకి ఎక్కిపోయింది. భారత్ మహిళా క్రికెట్‌జట్టు, వెస్టండీస్ మహిళాజట్టు తలపడటం, ఆరు వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించిన మూలపాడులో జయకేతనం ఎగరవేయటం జరిగింది. క్రికెట్ మైదానం ప్రారంభ సమయంలో ముఖ్యమంత్రి వ్యక్తం చేసిన అభిప్రాయం 24 గంటలు గడవకముందే నిజమైంది. "నాడు ఈ స్టేడియం కొత్తది, చిన్నది కావచ్చు. ముందు ముందు ప్రపంచవేదికవుతుంది. 'అమరావతి'కి ఖ్యాతి తెస్తుంది అని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. అది అక్షరాలా నిజమైంది.

మూలపాడులోసుమారు 13 ఎకరాల విస్తీర్ణంలో స్టేడియం ఏర్పాటు జరిగింది. ఇక్కడ క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేయటం ఎ.సి.ఎ. చేసిన పెద్ద సాహసమనే చెప్పాలి. అంతేకాదు. ఏడాది వ్యవధిలో ఆటకు సిద్ధం చేయటం వారి కృషికి, పట్టుదలకు ప్రతీక అనవచ్చు. జనకాలుష్యం, శబ్ద కాలుష్యం ఉండని చక్కని ప్రదేశం. చుట్టూ ఎత్తైన కొండలు. వాటిపై ఉన్న చెట్ల నుంచి సదా వాచే పిల్లగాలులు. ఉక్కబోతతో ఉక్కిరి బిక్కిరయ్యే పట్టణవాసులకు ఈ వాతావరణం ఆనందాన్ని, ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని పంచటానికి సిద్ధంగా వుంది. ఒక్క సారి ఇక్కడ క్రికెట్ ఆడిన ఏ ప్రపంచ స్థాయి క్రికెటరయినా, ముద్దులవుతరనటం అతిశయోక్తికాదు. అందుకురూపకల్పన చేసిన ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ అభినందించి తీరాల్సిందే. ఇప్పటికే అమరావతి ప్రపంచ పటంలో చోటు చేసుకొంటుంది. ప్రపంచ ప్రముఖులను ఆశ్చర్యపరుస్తుంది. ఆర్థిక ప్రగతిని సాధించటానికి సిద్ధమౌతుంది. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన ఈ మూలపాడు క్రికెట్ స్టేడియం ప్రపంచ క్రికెట్ వేదికాబోవటం ప్రతి ఆంధ్రుడికి గర్వకారణమవక తప్పదు.


# బాలల దినోత్సవంగా నెహ్రూ జయంతి

## నెహ్రూ విద్యాభ్యాసం

మోతీలాల్ నెహ్రూ, స్వరూపరాణిలకు దంపతులకు నవంబర్14,1889లో అలహాబాద్‌లో జవహర్‌లాల్ నెహ్రూ జన్మించారు. 16 ఏళ్ల వరకు విద్యాభ్యాసం మొత్తం ఇంటిలోనే జరిగింది. ఆ తరువాత లండన్‌లోని హారో స్కూల్,ట్రినిటి కాలేజ్, కేంబ్రిడ్జి కాలేజీలో జరిగింది. మొదట నేచురల్ సైన్స్‌లో హానర్స్ డిగ్రీ తీసుకున్నారు. బ్రిటన్‌లోని ఇన్నర్ టెంపుల్ కాలేజీలో లా పూర్తిచేశారు.1912 నుంచి ఆయన న్యాయవాద వృత్తిని స్వీకరించారు.

## స్వాతంత్ర్యోద్యమం


1916లో ఆయన కమలా కౌల్‌ను వివాహం చేసుకున్నారు. ఆయనకు ఒకేఒక కూతురు ఇందిరా ప్రియదర్శిని, ఆమె 1917లో జన్మించారు.1919లో జనరల్ డయ్యర్ ఆదేశాలతో బ్రిటీషువారు పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో నిరాయుధులపై పదినిముషాలపాటు జరిపిన కాల్పుల్లో 379 మంది చనిపోయారు. 1,200 మంది గాయాలపాలయ్యారు. దీంతో ఆయన చలించిపోయి, బ్రిటీషువారి పాలనకు ఆయన చరణగీతం పాడాలని నిశ్చయించుకొని 1919లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ చేరారు. మహాత్మాగాంధీ సిద్ధాంతాలకు ఆకర్షింపబడి ప్రధాన అనుచరుడిగా వెలుగొందారు. బ్రిటీషువారికి వ్యతిరేకంగా అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. 1921 లో కాంగ్రెస్‌లోని ప్రధాన నాయకులను బ్రిటీషు ప్రభుత్వం అరెస్టు చేసి 9 నెలలు కారాగార వాసం విధించింది. ఇలాంటి శిక్షలు దాదాపు 9 వరకు ఆయన అనుభవించవలసి వచ్చింది. స్వాతంత్ర్యోద్యమంలో 24 సంవత్సరాలు ఆయన జైలు జీవితం గడిపారు. కారాగారా వాసంలోనే ఆయన మార్క్సిజం, ఫిలాసఫీ చదివారు. అందుకే ప్రధానిగా ఆయన చేసిన ఆర్థిక సంస్కరణల్లో మార్క్సిజం కనిపిస్తుంది. 1928లో నేషనల్ కాంగ్రెస్‌కు అధ్యక్షుడిగా ఉన్నారు. ఆ తరువాతి సంవత్సరంలోనే సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని కోరుతూ రౌండ్ టేబుల్ సమావేశంలో 1930లో నిర్ణయం తీసుకున్నారు. కాంగ్రెస్‌కు వెన్నుదన్నుగా నిలిచే ఆయన తండ్రి మోతీలాల్ 1931లో మరణించారు. అదే సంవత్సరములో గాంధీజీకి బ్రిటీష్ వైస్రాయ్‌కి మధ్య ఒప్పందం జరిగింది. బ్రిటీషుపాలనను వ్యతిరేకిస్తూ 1932లో ప్రజాతిరుగుబాటు జరిగింది. స్వతంత్ర్య ప్రభుత్వాన్ని ఏర్పాటుకు నాయకులంతా బ్రిటీషువారిపై తిరగబడ్డారు. ఈ క్రమంలో 1941లో నెహ్రూ తన రాజకీయ వారసుడని గాంధీ తెలిపారు. 1947లో నేషనల్ కాంగ్రెస్‌కు, ముస్లింలీగ్‌కు మధ్య రాజకీయ విభేదాలు చోటు చేసుకున్నాయి. దీన్ని అవకాశంగా తీసుకున్న బ్రిటీష్ ప్రభుత్వం దేశాన్ని రెండుగా చీల్చి ముస్లింలకు పాకిస్థాన్,హిందువులకు భారత్‌ను అప్పగించి బ్రిటీష్ రెండు దేశాలకు స్వాతంత్ర్యాన్ని ప్రకటించింది.



తనకు ఎంతో ఇష్టమైన బాలలతో జవహర్‌లాల్ నెహ్రూ



కుటుంబ సభ్యులతో చాచానెహ్రూ



## ప్రథమ ప్రధానిగా నెహ్రూ

నెహ్రూ తన నూతన ఆలోచనా ధోరణితో ఛాంధసవాదనలకు స్వస్తి పలికి, భారతావనిని సెక్యులరిజం రాజ్యంగా రూపొందించారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని బలపరిచారు. టెక్నాలజీకి పెద్ద పీట వేస్తూ ప్రజాస్వామ్య విలువలను పెంపొందించారు. జాతీయ భద్రతకు ప్రాధాన్యత నిచ్చి అంతర్జాతీయంగా అలీన విధానాన్ని రూపొందించారు. దీంతో ఏ అగ్రదేశానికి వంత పలకకుండా స్వతంత్ర్యంగా సమున్నత భారతావని నిర్మాణానికి అధ్యునిగా నిలిచారు. మే 27,1964లో ఆయన గుండె పోటుతో మరణించారు. ఆయన మరణంలో భారతమాత తన ముద్దుబిడ్డను కోల్పోయింది.

## బాలలు జాతి సంపద

చాచా నెహ్రూకు పిల్లలంటే చాలా ఇష్టం రాబోయే కాలంలో వారే అత్యంత విలువైన జాతి సంపదగా ఆయన వారిని గుర్తించేవారు. వారికోసం ఆయన అనేక పథకాలను రూపొందించారు.ఆయన మరణం తరువాత వీకే కృష్ణమీనన్ ఆయన పుట్టిన రోజును చిల్డ్రన్స్ (బాల్‌దివస్) డేగా జరుపాలని ఐక్యరాజ్య సమితిని కోరారు. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం దానికి అంగీకరించడంతో 1959 నుంచి నవంబర్ 20ను అంతర్జాతీయ బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నారు. అదే రోజు బాలల హక్కులను కూడా ఐక్యరాజ్య సమితి ఆమోదించింది. బాలలను జాతి సంపదగా పిల్లను గుర్తించిన అనేక దేశాలు ఐక్యరాజ్య సమితి అండదండలతో పిల్లలకు హక్కులను రూపొందించింది.వాటిలో జీవించే హక్కు. విద్య. ఆహారం,ఆరోగ్యం,నీరు,గుర్తింపు, స్వేచ్ఛ, రక్షణ ఉన్నాయి. కుల,మత,ప్రాంత వివక్ష లేకుండా ప్రతి ఒక్క బిడ్డ ఈ హక్కులను వినియోగించుకునే హక్కు కలిగి ఉన్నారు.ఐక్యరాజ్యసమితి మరో చారిత్రాత్మక నిర్ణయం నవంబర్20,1989లో తీసుకుంది. దీంతో బాలలందరికీ ఉచిత, నిర్భంధ విద్య అమలు చేయనున్నారు. వీటిని డిసెంబరు 1992 నుంచి దీన్ని భారత్ అమలులోకి తెచ్చింది. దీనికోసం 2010-2011కి రూ.15 వేల కోట్లు కేంద్రం ఖర్చుచేసింది. విద్యలో నాణ్యత ప్రాధాన్యతాంశం. విద్యాలయాలు భవనాలు, లేబరేటరీలు, గ్రంధాలయాల మౌలిక సదుపాయాల రూపకల్పనలే కాకుండా ప్రతిభ కలిగిన ఉపాధ్యాయులు అవసరం ఎంతైనా ఉంది. బాలబాలికలను ఉత్తేజపరచి,అర్థం అయ్యేరీతిలో బోధించి వారిని ఉన్నత విద్యావంతులుగా దేశానికి అందించే శక్తివంతమైన ఉపాధ్యాయుల కొరత చాలా ఉంది. దీనికి గ్రామస్థాయి నుంచి మేధావులు, విద్యావంతులు, రాజకీయ,మత సంఘాల ఇతోధిక సహాయ సహకారాలు అందించి మధ్యలోనే చదువు ఆపే విద్యార్థులను తగ్గించాలి. అణగారిన వర్గాల చదువులకోసం రీఎంబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం అమలుచేయాలి. అడ్డంకులన్నీ అధిగమించి దేశంలో పిల్లలందరినీ విద్యావంతులను చేయగలిగితే 'పటిష్టమైన భారత్‌ను తయారు చేయవచ్చు.

## బాలల దినోత్సవ సంబరాలు

ప్రతి ఏడాది నవంబర్ 14న బాలల దినోత్సవం ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో జరుపుతుంటారు. మొదటిసారిగా ఆనాటి భారత రక్షణమంత్రి వీకే క్రిష్టమీనన్ కృషితో నవంబరు 14,1954లో జరిపారు. ఈ సందర్భంగా బాలలను గౌరవించి, వారి బంగారు భవిష్యత్‌కు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలను ప్రకటిస్తాయి. అన్ని పాఠశాలల్లోనూ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. బాలలకు ఎంతో ఇష్టమైన ఆటపాటలను నిర్వహించిబహుమతులు అందచేస్తారు.

## బాలలపై అకృత్యాలు

బాలలకోసం ప్రభుత్వం ఎన్ని పథకాలు చేపట్టినా సంఘవిద్రోహులు, మానవ మృగాలు పిల్లలను ఎత్తుకెళ్లటం,మాఫియాలకు, రెడ్‌లైట్ ఏరియాలకు అమ్మటం,లేదా బిచ్చగాళ్లగా మార్చడం చేస్తున్నారు. పిల్లలను కిడ్నాప్‌చేసి తల్లిదండ్రులపై పగసాధించడం,వారిపై అకృత్యాలు జరపటం లాంటి ఘటనలతో దేశంలో పిల్ల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. అణగారిన వర్గాలు,యాజమాన్యాలు బాలలను శ్రామికులుగా మార్చుతున్నారు. పలకాబలపం పట్టవలసిన చేతులు పనితో రాటుదేలుతున్నాయి. దీంతో వికసించాల్సిన బాల్యం మసిబారుతోంది.

## బంగారు భవిష్యత్‌ను అందిద్దాం...

ఈ పరిస్థితులను నివారించడాని కేంద్ర పెద్ద ఎత్తున రెస్క్యూ టీంలను ఏర్పాటు చేసింది. అయితే దీనికి ప్రజా సహకారంకూడా ఎంతో అవసరం.బాలల దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ వారి బంగారు భవిష్యత్ పై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సుసంపన్నమైనదేశంకోసం బాలలకు బంగారు భవిష్యత్ నిచ్చే కార్యక్రమాలను అమలు చేయటానికి సంఘటితంగా కృషి చేద్దాం.

# ఫ్యూచర్ రిటైల్‌తో విలీనమైన హెరిటేజ్

**హైదరాబాద్ :** ఫ్యూచర్ రిటైల్‌లిమిటెడ్‌తో హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ సంస్థ చేతులు కలిపింది. అగ్రి,రిటైల్,బేకరీ వ్యాపారాన్ని హెరిటేజ్ సంస్థ ఫ్యూచర్ సంస్థకు అప్పగిస్తుంది. త్వరలోనే విలీన ప్రక్రియ పూర్తవుతుంది. పాలు, పాల ఉత్పత్తులను మాత్రమే హెరిటేజ్ అట్టిపెట్టుకుంటుంది. హెరిటెజ్ ఫ్రెష్ షోరూమ్‌లన్నీ హెరిటెజ్ సంస్థ ఆధీనంలోనే ఉంటాయి. ఫ్యూచర్ రిటైల్‌కు సంబంధించిన ఉత్పత్తులను సైతం హెరిటేజ్ సంస్థ విక్రయిస్తుంది. అదే సమయంలో హెరిటెజ్‌కు సంబంధించిన అగ్రి,రిటైల్,బేకరీలన్నీ త్వరలోనే ఫ్యూచర్‌లో విలీనం అవుతాయి. ఫ్యూచర్ సంస్థ 3.65 శాతం షేర్లను హెరిటేజ్ ఫుడ్ లిమిటెడ్‌కు అందిస్తుంది. ఈ షేర్ల విలువ రూ.295 కోట్లుగా ఉంటుంది. దీనికి సంబంధించి రెండు సంస్థల మధ్య ఒప్పందం కుదిరినట్లు హెరిటేజ్ డైరెక్టర్ నారా లోకేష్, ఫ్యూచర్ రిటైల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కిశోర్ బియాని సోమవారం పత్రికల వారికి వెల్లడించారు. ఈ సమావేశంలో హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణి కూడా పాల్గొన్నారు.ఫ్యూచర్ రిటైల్ సంస్థ బిగ్‌బజార్,ఎఫ్‌బిబి, సెంట్రల్, బ్రాండ్ ఫ్యాక్టరీ, ఈ జోన్, హోంటౌన్ లాంటి పలు ప్రధాన స్టోర్స్‌ను కలిగిఉంది. దేశంలోని 250కు పైగా నగరాల్లో ఏడాదికి 4 కోట్ల మంది వినియోగదారులు తమకు షాప్‌లలో వస్తువులను కొనుగోలు చేస్తున్నట్లు బియాన్ని తెలిపారు. ఇక హెరిటేజ్ సంస్థ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటకలలో 124 స్టోర్స్‌ను కలిగివుంది. ఏడాదికి2.4 కోట్ల మంది వినియోగదారులు తమ స్టోర్స్‌లో కొనుగోలు చేస్తున్నారని, గత ఆర్థిక సంవత్సరంలో రూ.629.70 కోట్ల మేరకు వ్యాపారాన్ని నిర్వహించామని లోకేష్ తెలిపారు. ఈ ఒప్పందంతో రెండు సంస్థలు మరింత బలపడతాయని ఇరువురు వ్యాఖ్యానించారు. ప్రస్తుతం రోజుకు 13 లక్షలు లీటర్ల పాలను తమ సంస్థ విక్రయిస్తోందని,2021 నాటికి అది 30లక్షల లీటర్లకు చేరుతుందన్నారు. రిలయన్స్ పాల విక్రయ దుకాణాలు, కేంద్రాలను కూడా హెరిటేజ్ సంస్థ కొనుగోలు చేసిందన్నారు.2600 మంది ఉద్యోగులు తమ రిటైల్ అగ్రి, బేకరీ వ్యాపారాల్లో ఉన్నారని, వారందికే పూర్తిగా ఉద్యోగ భద్రత ఉంటుందని ఒక ప్రశ్నకు సమాధానంగా లోకేష్ తెలిపారు. పాలు, పాల ఉత్పత్తుల వ్యాపారాన్ని ప్రారంభించామన్నారు.2021 నాటికి 4 వేల స్టోర్స్‌ను దేశవ్యాప్తంగా తెరవాలన్న లక్ష్యంగా పెట్టుకున్నట్లు బియానీ తెలిపారు. ఇందులో వెయ్యి స్టోర్స్ ప్రాంచైజీ నెట్‌వర్క్ ద్వారానూ, మిగిలిన 3 వేల స్టోర్స్ సొంతగానూ ఏర్పాటు చేస్తామని వివరించారు.




## కాపునాడు, కాపుయువసేన కమిటీలు ఏర్పాటు

**రాజధాని వార్తలు, కోనసీమ ప్రతినిధి-జిఎన్.రావ్ :** జాతీయ కాపునాడు, జాతీయ కాపుయువసేన జాతీయ అధ్యక్షులు తాడివాక రమేష్‌నాయుడు ఆదేశాల మేరకు తూర్పుగోదావరి జిల్లాలో కాపుయువసేన, కాపునాడు కమిటీలను ఏర్పాటుచేసినట్లు ఉభయగోదావరి జిల్లాల ఇన్‌ఛార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్.సురేష్ తెలిపారు. స్థానిక అమలాపురం కాపునాడు కార్యాలయంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. కాపుయువసేన తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా పడాల శ్రీనివాసరావు అలియాస్ పిఎస్(రాజమహేంద్రవరం), ప్రధాన కార్యదర్శిగా వానపల్లి సూరిబాబు(కొత్తపేట), కోశాధికారిగా నల్లా శ్రీనివాసరావు(నడిపూడి), సంయుక్త కార్యదర్శిగా చిక్కాల రవిశంకర్(కొంకాపల్లి) నియమితులయ్యారు. నియోజకవర్గ కన్వీనర్లుగా ముద్దాల తిరుపతిరావు అలియాస్ అను(రాజమహేంద్రవరం), మంగం నాగార్జున(కాకినాడ), కొప్పుల భాస్కరరావు(అమలాపురం), పడాల వెంకటేశ్వరరావు అలియాస్ సూపర్(పి.గన్నవరం), నిమ్మకాయల చిన్నయ్యనాయుడు(కొత్తపేట) నియమితులయ్యారు. కాపునాడు తూర్పుగోదావరి జిల్లా కమిటీ అధ్యక్షుడిగా బోడపాటి గోపాలకృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా మురమళ్ల శివవీరారెడ్డినాయుడు నియమితులైనట్లు ఆయన తెలిపారు.

## ఆర్టీసీ ఆధ్వర్యంలో మన్యసీమ దర్శిని ప్రారంభం

**రాజధాని వార్తలు, కోనసీమ ప్రతినిధి-జిఎన్.రావ్ :** కార్తీకమాసం పురస్కరించుకుని విహారయాత్రకు వెళ్లేవారి కోసం అమలాపురం నుంచి ఏజెన్సీ ప్రాంతమైన మన్యసీమకు కోనసీమ టూ మన్యసీమ ప్రత్యేక టూర్‌ను అమలాపురం ఆర్టీసి ఏర్పాటుచేసినట్లు డిపో మేనేజర్ ఏవిఎస్.సత్యనారాయణమూర్తి తెలిపారు. కార్తీకమాసంలో రంపచోడవరం ఏజన్సీలో ఉన్న మన్యం అందాలతో పాటు ప్రత్యేక ప్యాకేజీ ద్వారా మన్యసీమ దర్శిని పేరుతో బస్సు ఏర్పాటు చేశామన్నారు. ఈ బస్సులు ఈ నెల 6వ తేది ఆదివారం నుంచి ప్రారంభించారు. అమలాపురం నుంచి మారేడుమిల్లి వరకు వెళ్లే ఈ యాత్రలో మన్యంతో పాటు పలు ఆలయాలు కూడా దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ యాత్రలో ర్యాలిలోని జగన్మోహిని కేశవస్వామి ఆలయం, ధవళేశ్వరం బ్యారేజీ, కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, సీతపల్లిలోని బాపనమ్మ గుడి, రంపలోని పురాతన శివాలయం, మారేడుమిల్లిలో కాఫీతోటలు, జంగిల్ బెల్స్, ఔషధ మొక్కలు, జలతరంగిణి, పాములేరు తదితర ప్రాంతాలను చూపించి యాత్రికులను తిరిగి రాజమహేంద్రవరం తీసుకువచ్చి ఇస్కాన్ టెంపుల్, గౌతమి ఘాట్‌లో గోదవారి హారతిని చూపిస్తామని డిపో మేనేజర్ తెలిపారు. ఎక్స్‌ప్రెస్ బస్సుకు టిక్కెట్ చార్జీలు పెద్దలకు రూ.325, పిల్లలకు రూ.225గా నిర్ణయించారు. కళాశాలలు, పాఠశాలలు బృందాలుగా ఏర్పడి 50 సీట్లు గల బస్సు రూ.15వేలకు రిజర్వేషన్ చేసుకోవచ్చని చెప్పారు. పాఠశాలలు, కళశాలలవార ఎప్పుడు అడిగినా ఏర్పాటు చేస్తామన్నారు. మిగిలిన వివరాలకు అసిస్టెంట్ మేనేజర్, సెల్ : 7382911871, ఎన్.వరహాలబాబు : 7382909620, విజయ్‌కుమార్ : 7382909617 నంబర్లలో సంప్రదించాలని డిఎం తెలిపారు.

## హైసెక్యూరిటీతో కొత్త వెయ్యి నోటు

### కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ

**న్యూఢిల్లీ :** మరిన్ని భద్రతా ప్రమానాలతో నోటును త్వరలోనే ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. రూ.500,నూ.1000 నోట్ల రద్దుపై అరుణ్ జైట్లీ, కేంద్ర ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి శక్తి కాంత దాస్ మీడియాతో మాట్లాడారు. మరికొద్ది నెలల్లో కొత్త డిజైన్, కొత్త రంగుతో వెయ్యి రూపాయల నోటును అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. నోట్ల రద్దు వల్ల ప్రజలు ఇబ్బంది. పడకుండా బ్యాంకుల శాఖ, ఆర్బీఐ అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రజల అవసరాలకు సరిపడా కరెన్సీన వెంటనే అందుబాటు లోకి తీసుకొస్తామని... ఎవరూ కంగారు పడాల్సిన అవసరం లేదన్నారు. సాధారణ పౌరులు కొనుగోళ్లు చేసేందుకు కొద్దిరోజుల పాటు ఇబ్బంది. ఎదురైన ప్పటికీ... దీర్ఘకాలింకగా దేశానికి లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రభుత్వానికి తెలపకుండా భారీ మొత్తంలో డబ్బు పోగేసిన వారిపైనే చట్టపరంగా చర్యలు ఉంటాయన్నారు. రూ.500, రూ1000 నోట్లరద్దుతో ప్రజల కొనుగోలు అలవాట్లు ప్రభావితం కాగలవని జైట్లీ పేర్కొన్నారు. నోటును కొనసాగిస్తారా లేదా అన్ని దానిపై సందేహం నెలకొన్న సంగతి తెలిసిందే. రూ.1000 నోట్లు నిలిపివేసి రూ.2000 నోట్లు తీసుకురావడం ద్వారా అవినీతిని ఎలా నిర్మూలిస్తారని ప్రతిపక్ష కాంగ్రెస్ విమర్శించిన నేపథ్యంలోనే ప్రభుత్వం తాజా ప్రకటన విడుదల చేయడం విశేషం.

# పోలవరం ఎమ్మెల్యే జనచైతన్యయాత్ర

**రూ.40 లక్షలతో నిర్మించిన పలుసి.సి రోడ్డుకు ప్రారంభోత్సవాలు**

**రాజధాని ప్రతినిధి ,(కొయ్యలగూడెం అన్నంరెడ్డి సుబ్బారావు) :** రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల అలుపెరుగని యోధుడుగా శ్రవిస్తున్నారని పోలవరం ఎం.ఎల్.ఏ. మెడియం శ్రీనివాసరావు పేర్కొన్నారు. కొయ్యలగూడేం మండలం పొంగుటూరు. కన్నాయగూడేం గ్రామంలలో 4గంటలపాటు జనచైతన్య యాత్రను నిర్వహించారు. ప్రజలను, నిస్సహాయులను, వృద్ధులను మహిళలను ఇళ్ల వద్ద కలిసి పొంగుటూరులో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్.టి.రామారావు విగ్రహనికి ఎం.ఎల్.ఏ పూలమాల వేసి నివాలు అర్పించారు. తర్వాత ప్రక్కనే ఉన్న అమరజీవి పోట్టి శ్రీరాముల విగ్రహనికి ఆర్యవైశ్య సంఘనాయకులు ఛాంబర్ ఆఫ్‌కామన్స్ నాయకులుతో కలిసి ఆయన పూలమాలలు వేసారు. అనంతరం అక్కడి నుంచి ప్రధాన రహదారిపై ఎం.ఎల్.ఏ.సైకిలుతోక్కుతూ జనచైతన్యయాత్రను ప్రారంభించారు. ఉపసర్పంచ్ పసుపులేటి వెంకటరమణ ఇంటి వద్ద గ్రామతెలుగుదేశపార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రభుత్వం అమలుపరుస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధికార్యక్రమాలను వివరించారు. అనంతరం పొంగుటూరు గ్రామంలోని వీధులలో నడిచి జనచైతన్య యాత్ర జరిపారు. రూ.7లక్షలతో అక్కడనిర్మించనున్న అంగన్‌వాడీ భవనానికి ఎం.ఎల్.ఏ. శంకుస్థాపన చేశారు. దాదాపు రూ.20 లక్షలతో నిర్మించిన సి.సిరోడ్లు ప్రారంభించారు. కన్నాయగుడేం మన్నిడివెంకరావు విరామంగా యిచ్చిన స్థలంలో రూ.7లక్షలతో నిర్మించే అంగన్‌వాడీభవనానికిస్థలదాత దంపతులతో కలిసి ఎం.ఎల్.ఏ భూమిపూజ చేసి. సి.సి రోడ్లను ప్రారంభించారు. ప్రాథమిక పాఠశాల ఆవరణలో మహిళ డ్వాక్రా మహిళలతో సమస్యలను తెలుసుకున్నారు. పొంగుటూరు, కన్నాయగూడేం గ్రామలలోని దళిత వాడలలో రహదారులు అభివృద్ధికి సి.సి రోడ్లునిర్మాణానికి ఎస్.సి., ఉఎస్.టి.ఉపప్రణాళిక నిధులు రూ.25 లక్షలు మంజూరుచేస్తున్నట్లు ఎం.ఎల్.ఏ , పోలవరం ఎ.ఎం.సి.చైర్మన్, మండల పార్టీ అధ్యక్షుడు పారేపల్లి రామారావు. జడ్.పి.ఉపాధ్యక్షురాలు చింతల వెంకటరమణ, ఎం.పి.పి.అయిన పర్తిచందన శ్రీదేవి, రాష్ట్ర మహిళ సహకార పై నాన్సుకార్పొరేషన్ డెరేక్టర్ గంగిరెడి మేఘలాదేవి, మాజీ ఎం.పి.పి.మట్టా సత్తిపండు తెలుగు దేశపార్టీ నాయకుల తంకటరమేష్, నిమ్మగడ్డ చక్రధరరావు, కొటవటు రామకృష్ణ , ప్రగడరాంబాబు, మద్దుకూరికృష్ణ, సర్పంచ్ కాసగాని వెంకటలక్ష్మి ఉపసర్పంచ్ రమణ, సి.డి.పి.ఓ.వి. అమరావతి, పి.ఆర్.ఎ.ఇ.పాల్గొన్నారు.



కన్నాయ గూడేంలో రూ.7 లక్షలతో నిర్మచే అంగన్‌వాడీ భవనానికి స్థలదాత మన్నీడి వెంకరావు దంపతులతో కలిసి భూమి పూజచేస్తున్న ఎం.ఎల్.ఏ . తదితరులు.

# నోట్ల రద్దుపై రాజ్యసభలో చర్చకు టీఎంసీ నోటీసు

**కోల్‌కత్తా :** దేశంలో పెద్ద నోట్లు రద్దు చేస్తూ కేంద్రం తాజా నిర్ణయంపై చర్చించేందుకు తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) రాజ్యసభకు నోటీసులు జారీ చేసింది. ఈ నెల16న జరిగే బిజినెస్ అవర్‌ను 267 అధికరణం కింద రద్దు చేసి ఆ కాలాన్ని నోట్ల రద్దుకు దారితీసిన పరిస్థితులపై కేంద్రం తీసుకున్న ఒంటెత్తుపోకడలపై చర్చలు జరపవలసిందిగా కోరినట్లు రాజ్యసభలో టీఎంసీ జాతీయ అధికార ప్రతినిధి నాయకులు దీరెక్ ఓ బ్రియన్ తెలిపారు. ఈ సందర్భంగా బ్రియెన్ పీటీఐతో మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్ణయం తీసుకుని సాధారణ, మధ్య, పేద వర్గాల ప్రజలను తీవ్ర అసౌకర్యానికి గురించేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దేశంలో అవినీతిని, నల్లధనాన్ని అంతమొందించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల అమాయక ప్రజలు ఎందుకు నష్టపోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిష్పాక్షికంగా, పారదర్శకంగా కఠినమైన ప్రణాళికా చర్యలు చేపటాలని సూచించారు. ఈ రకమైన కుట్రపూరిత చర్యల వల్ల దేశంలో రెండురోజులుగా అరాచకం, గందరగోళం మరింత పెరిగాయని బ్రెయిన్ ఆవేదన వెలిబుచ్చారు.

## గుంటూరులో 'మహాసిమెంటు' ప్లాంట్

**హైదరాబాద్ :** మై హోం ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ త్వరలోనే గుంటూరు జిల్లాలో తమ సిమెంటు బ్రాండ్ అయిన"మహా సిమెంటు" ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుంది. ఏడాదికి1.5 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఈ ఫ్యాక్టరీ ఏర్పాటు కానుంది. ఈ విషయాన్ని మహాసిమెంటు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాంబశివరావు సోమవారం పత్రికల వారికి వెల్లడించారు.తెలంగాణలోని నల్గొండ, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు,విశాఖ జిల్లాల్లో ఇప్పటికే మహా సిమెంట్‌కు 3 ఫ్యాక్టరాలున్నాయి. తమిళనాడులోని టుటికోరన్‌లో జనవరి మాసం నుండి కొత్త ప్లాంట్ ప్రారంభం కాబోతోంది. దీంతో ఈ నాలుగు ప్లాంట్లలో కలిపి ఏడాదికి 10 మిలియన్ టన్నుల సిమెంటు ఉత్పత్తి అవుతుందని ఆయన వివరించారు. ఈ సందర్భంగా నూతన లోగోను ఆయన ఆవిష్కరించారు. గుంటూరు, కర్నూలు జిల్లాల్లో తమ సంస్థకు వెయ్యి ఎకరాల భూములు ఉన్నాయని పేర్కొంటూ ఎప్పటి నుండి గుంటూరు జిల్లాలో ఫ్యాక్టరీని నిర్మించేది త్వరలోనే వెల్లడిస్తామన్నారు. నిధుల కొరత తమకు లేదని ఒక ప్రశ్నకు సమాధానంగా ఆయన తెలిపారు.పెద్ద ఎత్తున స్థానికులకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ప్రస్తుతం తమ సంస్థకు 4 వేల డీలర్లు, 70 గోడౌన్లు ఉన్నాయని,17 రాష్ట్రాల్లో సిమెంటు విక్రయాలు సాగుతున్నాయన్నారు. ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ 5 వేల మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు ఆమన తెలిపారు.టుటికోరన్‌లో 10 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రపంచలోనే రెండవ అతి పెద్ద బిల్డింగ్ మెటీరియల్ కంపెనీ అయిన ఐర్లాండ్‌కు చెందిన సిఆర్‌హెచ్ పిఎల్‌సితో మై హోం సంస్థ భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకుందన్నారు. 18 సంవత్సరాలకు సిమెంటు పరిశ్రమలో పేరొందిన బ్రాండ్‌గా మహాసిమెంటు వెలుగొందుతోంది. నిర్మాణ రంగం, సిమెంటు, విద్యుత్,విద్య, రెడిమిక్స్ కాంక్రీట్ వ్యాపారాలను మైహోం సంస్థ నిర్వహిస్తోంది.



## అభినయ కూచిపూడి నాట్య అకాడమీకి

# ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో స్థానం

కె.వి.రమణారావు, రాజధాని ప్రతినిధి, జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం అభినయ కూచిపూడి నాట్య అకాడమీ 25వ కూచిపూడి దేశభక్తి గీతముల నృత్య కళోత్సవాలు స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో ఘనంగా జరిగాయి. ఈ కళోత్సవాల్లో భాగంగా 500 మంది నృత్య నర్తకీ నర్తకులచే తలపైన వాటర్ బాటిళ్లు ధరించి ప్రదర్శించిన నృత్యం అతిథులతో పాటు ప్రేక్షకులను అలరించింది. చిన్నారులు రాష్ట్ర దేశభక్తి గీతం 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' అంటూ ప్రదర్శించిన కూచిపూడి నృత్యం అబ్బురపరిచింది. ఎక్కడా తడపడకుండా వీరు చేసిన నృత్యం ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో స్థానం దక్కించుకుంది. కూచిపూడి నృత్య చరిత్రలో ఇదొక నూతన అధ్యాయం. 500 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఏకకాలంలో శిరస్సున మంచినీటి బాటిళ్లు ధరించి నృత్య ప్రదర్శన ఇవ్వడం చాలా అరుదైన సంఘటనగా పలువురు అభివర్ణించారు. ప్రదర్శనను ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి బిస్వదీప్‌రాయ్ చౌదరి ప్రత్యక్షంగా తిలకించారు. ఆయన మాట్లాడుతూ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో ఈ నృత్య ప్రదర్శనకు స్థానం కల్పిస్తున్నట్లు ప్రకటించారు. ఇడియాలోనే ఈ తరహా ప్రదర్శన మొట్టమొదటని, అందుకే రికార్డు సాధించిందని వెల్లడించారు. ఈ మేరకు ధృవీకరణ పత్రాన్ని కార్యక్రమ నిర్వాహకురాలు, అభినయ కూచిపూడి నాట్య అకాడమీ వ్యవస్థాపకురాలు, నాట్యమయూరి, తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు గ్రహీత ఎస్.రూపాదేవికి అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన పార్లమెంటు సభ్యులు ఎంపీ మాగంటి బాబు విద్యార్థులను ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి ఆధ్యాత్మిక ప్రవచన వాచస్పతి కేఎల్ఎన్ ధనకుమార్ అధ్యక్షత వహించగా జానపద కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్ఆర్ కృష్ణబాబు సభను ప్రారంభించారు. ఎంపీ మాగంటి బాబు మాట్లాడుతూ త్వరలో అమరావతిలో జరిగే కార్యక్రమంలో ప్రత్యేక



ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో స్థానం సంపాదించినట్లు ధృవీకరణ పత్రం స్వీకరిస్తున్న రూపాదేవి




విద్యార్థుల నృత్య ప్రదర్శన దృశ్యం

ప్రదర్శనకు వీరికి అవకాశం ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరతామని తెలిపారు. అవకాశం ఉంటే దేశ రాజధాని ఢిల్లీలో రిపబ్లిక్‌డే రోజున జరిగే కార్యక్రమంలో వీరి ప్రతిభను చాటే రీతిలో అనుమతి ఇవ్వాలని ప్రధానమంత్రి మోదీని కోరతానని తెలిపారు. అభినయ కూచిపూడి నాట్యఅకాడమీకి ప్రభుత్వ నుంచి అకాడమీ ఏర్పాటుకు భూమిని కేటాయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి స్పాన్సర్ చేసిన శశి విద్యాసంస్థల అధినేత బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణకు అభినందనలు తెలిపారు. రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమ శాఖా మంత్రి పీతల సుజాత ఫోన్‌లో చిన్నారులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమాన్ని రూపొందించిన నాట్యమయూరి రూపాదేవిని కొనియాడారు. కూచిపూడి నాట్య అకాడమీ అభివృద్ధికి సహకారం అందిస్తానని తెలిపారు. చిట్రోజు తాతాజీ దంపతులు జ్యోతిప్రజ్వలన చేయగా బాలాజీరావు దంపతులు నటరాజస్వామి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు మాట్లాడుతూ కళాకారుల నాట్య కౌశల్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు శివలక్ష్మి, ఎంపీపీ కొడవటి మాణిక్యాంబ, జడ్పీటీసీ శీలం రామచంద్రరావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మండవ లక్ష్మణరావు, సిటీకేబుల్ ఎండీ పాలపర్తి శ్రీనివాస్, ప్రముఖ శిల్పి దేవికారాణి ఉడయార్, ఆకాశవాణి ప్రతినిధి ఠకినాల జయప్రకాష్, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ ముస్తఫా, బండారు సత్యనారాయణ, పెనుమర్తి రామ్‌కుమార్, జంగారెడ్డిగూడెం ఎంఈవో ఆర్.రంగయ్య, డీఎస్పీ జె.వెంకట్రావు, చావా రమేష్‌బాబు, టీవీఎస్ రాజు, సబ్బి కనకారావు, ఎండీ ఉమర్‌ఆలీ, కాసర నరిశిరెడ్డి, తిప్పాభట్ల రామకృష్ణ, ఎండీ మౌలా, చిలుకూరి సుబ్బయాచారి, శ్రీమంతుల రమణ, నున్నా కృష్ణయ్య, మందపల్లి కృష్ణయ్య తదితరులు పాల్గన్నారు. మల్లాది పర్వతవర్ధని గీతాలాపన చేశారు. జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి సివిల్ అసిస్టెంట్ సర్జన్ డా. కె.సునీత పర్యవేక్షించారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా విజయశంకర ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల (రాజమండ్రి ) సుకవిత నాట్యాచార్య పసుమర్తి శ్రీనివాసశర్మ, మహిళా కళాకారుల ప్రధాన కార్యదర్శి, నాట్యాచారిణి సీహెచ్ లక్ష్మీకుమారి (తాడేపల్లిగూడెం) వ్యవహరించారు. ఈ ప్రదర్శనలో జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, ప్రతిభా ఇంగ్లీషు మీడియం స్కూల్, భాష్యం బ్రిలియంట్ స్కూల్, కిడ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, ఏపీఎస్‌డబ్ల్యుఆర్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీ జంగారెడ్డిగూడెం, ఎంవీఆర్ విద్యానికేతన్ సరిపల్లి, ఇండియన్ యూపీ స్కూల్, అక్షరా ఇంగ్లీషు మీడియం స్కూల్ జంగారెడ్డిగూడెంకు చెందిన విద్యార్థులు పాల్గన్నారు. అభినయ కూచిపూడి నాట్య అకాడమీ నిర్వాహకులు నాట్యాచారిణి రూపాదేవి ఆధ్వర్యంలో విద్యార్థులు అందించిన ఈ నృత్య ప్రదర్శనతో జంగారెడ్డిగూడేనికే కాకుండా పశ్చిమ గోదావరి జిల్లాకే పేరు తీసుకువచ్చినందుకు పలువురు అభినందించారు.

# వ్యాపార కీలాద్రి

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ ఆలయ అధికారుల వ్యవహారశైలి వివాదాలు, విమర్శలకు దారి తీస్తున్నది. పాలనాపరమైన ఇబ్బందులను అధిగమించేందుకు దేవాదాయ శాఖకు చెందిన స్పెషల్ గ్రేడ్ కమిషనర్ల స్థానంలో ఐఏఎస్ స్థాయి అధికారిని కార్యనిర్వహణాధికారి (ఈవో)గా ప్రభుత్వం నియమించింది. అయితే ఈవోగా సూర్యకుమారి బాధ్యతలు చేపట్టినప్పటి నుండి భక్తులకు సౌకర్యాలు, సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టకుండా కేవలం ఆదాయాన్ని పెంచుకునే విధంగా చేపట్టిన చర్యలు విమర్శలకు దారితీస్తోంది. కృష్ణాపుష్కరాల సమయంలో అమ్మవారి దర్శన టిక్కెట్ల ధరలను విపరీతంగా పెంచిన విషయం తెలిసిందే. ఈ దేవస్థానంలో అత్యధిక ధరగా రూ.100ల టిక్కెట్లను విక్రయించేవారు. దసరా రోజుల్లో ఈ టిక్కెట్లును కొనుగోలు చేసిన వారిని, రద్దీని బట్టి అంతరాలయ దర్శనం కల్పించేవారు. అయితే పుష్కరాలను పురస్కరించుకుని ప్రత్యేక దర్శనం పేరుతో రూ.500ల టిక్కెట్ల అమ్మకాలకు శ్రీకారం చుట్టారు. తిరుమలలో శ్రీవారి దర్శనం టిక్కెట్ ధర రూ.300లు ఉంటే దుర్గమ్మ దర్శనానికి అంత ఎక్కువ ధర తగదని సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయం వ్యక్తం చేయడమే కాకుండా ధరను తగ్గించాలని ఈవోను ఆదేశించారు. అయితే రూ.500 టిక్కెట్లను కొనసాగిస్తూనే అదనంగా రూ.300 టిక్కెట్లు వందల సంఖ్యలో మాత్రమే అమ్ముడయ్యాయి. ఇదే పద్ధతిని దసరా మహోత్సవాలకూ అమలు చేస్తూ ఇంద్రకీలాద్రిని వ్యాపార కీలాద్రిగా మార్చేస్తున్నారని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విశేషమైన అలంకారాలు నిర్వహించే దసరా రోజుల్లో కుంకుమార్చన పూజా టికెట్ల ధరలను రూ.3వేలుగా నిర్ణయించారు. కుంకుమార్చన టిక్కెట్ల పరంగా 2014లో రూ.1000 లుగా ఉన్న టిక్కెట్లను 2015లో రూ.3వేలకు పెంచారు. మూలా నక్షత్రం రోజున సరస్వతి అలంకారాన్ని డిమాండ్ దృష్ట్యా ఆ రోజు పూజలు



చేసేందుకు తొలుత రూ.10 వేలుగా నిర్ణయించారు. రెండేళ్ల క్రితం రూ.4000లుగా ఉన్న టిక్కెట్ ధరను రూ.10 వేలకు పెంచాలని నిర్ణయించారు. సమన్వయ కమిటీ సమావేశంలో కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గద్దె అనురాధ టిక్కెట్ల ధరల పెంపుపై గట్టిగా అభ్యంతరం వ్యక్తం చేయడంతో సగం తగ్గించి రూ.5 వేలుగా మార్పు చేశారు. అదీకాక ములానక్షత్రం రోజున నిర్వహించే పూజలకు సంబంధించిన తొలి బ్యాచ్ టిక్కెట్లను పూర్తిగా బ్లాక్ చేసినట్లు ఆరోపిస్తున్నారు. వీటిని రాజకీయ నేతలు, వీఐపీలకు కేటాయించినట్లు చెబుతున్నారు. పూజా టిక్కెట్ల ధరలు పెంచడం ఒక ఎత్తైతే వాటిని నిర్వహించే విధానం అపహాస్యంగా మారింది. భక్తుల సంఖ్యను బట్టి రోజుకు మూడు నుండి నాలుగు బ్యాచ్‌లలో పూజలు చేయాలని భావించారు. అయితే చివరి బ్యాచ్‌లలో ఒకరిద్దరు మాత్రమే ఉండడంపై దేవస్థానం సిబ్బందే అవాక్కవుతున్నారు. భారీగా ధరలు పెంచడం వల్లే అటు పూజా టిక్కెట్లు, ఇటు దర్శనం టిక్కెట్ల అమ్మకాలు తగ్గిపోయునట్లు అర్చకులు సైతం అంగీకరిస్తున్నారు. ఇంద్రకీలాద్రిపై చేపట్టిన అభివృద్ధి పనులకు భారీ మొత్తంలో నిధులు అవసరం అవుతాయి. కనుక ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగానే ఐఏఎస్ అధికారిని నియమించినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. తనకున్న అధికారాలను దుర్వినియోగం చేస్తూ ఈవో ఒంటెత్తు పోకడలకు పోతున్నారని బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గమ్మ ఆలయాలను 'శ్రీదుర్గా మల్లేశ్వరస్వామివార్ల దేవస్థానములు'గా రిజిస్టర్ చేశారు. ప్రస్తుతం దేవస్థానం పరంగా అన్ని కార్యకలాపాలు ఇదే పేరుతో నిర్వహిస్తున్నారు. అనేక దశాబ్దాలుగా భక్తులందరి మనోఫలకాలపై ముద్రపడిన ఈ పేరును కూడా మార్చాలని అధికారులు నిర్ణయించారు. అయితే ఈ పేరులో మల్లేశ్వర స్వామివారి పేరును తొలగించి 'శ్రీ కనకదుర్గ దేవస్థానములు'గా మార్పు చేయాలని కోరుతూ దీనికి సంబంధించిన ఫైలును దేవాదాయశాఖ పరిశీలనకు పంపించారు. అక్కడ నుండి ఇంకా ఏవిధమైన అనుమతులు రాకుండానే దసరా మహోత్సవాల సందర్భంగా ముద్రించిన ఆహ్వాన పత్రాలు, ఫోటోలపై 'శ్రీ కనకదుర్గ దేవస్థానములు' అని పేర్కొన్నారు. ఈ విషయమై కూడా భక్తజనం నుండి విమర్శలు వెల్లువత్తుతున్నాయి. కుంకుమార్చన చేయుంచుకున్న భక్తులకు అందచేసే పూజాసామాగ్రితోపాటు దేవస్థానం తరపున ఇచ్చే అమ్మవారి ఫోటోపై దేవస్థానముల కొత్త పేరును చూసిన భక్తులు ఒకింత ఆశ్చర్యానికి లోనవుతున్నారు. మరికొందరైతే స్వామివారి పేరును తొలగించడం సరికాదని, పాతపేరునే కొనసాగించాలని సూచిస్తున్నారు. భక్తాభీష్టానికి అనుగుణంగా నడచుకోవాల్సిన దేవస్థానం ఇష్టానుసారంగా ధరలు పెంచడం, పేర్లు మార్చడం తగదంటున్నారు. ఈ విషయమై ప్రభుత్వం జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, దుర్గమ్మ దర్శనాన్ని కూడా వ్యాపారం చేయడాన్ని స్వస్తి చెప్పాలని ప్రజలు కోరుకుంటున్నారు.

- ఎస్.రాజేంద్ర ప్రసాద్

## మార్చి నాటికి నగర పంచాయతీ భవనం పూర్తి

కె.వి.రమణారావు, రాజధాని ప్రతినిధి, జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం వారపు సంత సమీపంలో నిర్మిస్తున్న నగర పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణం వచ్చే మార్చి నాటికి పూర్తిచేస్తామని పబ్లిక్‌హెల్త్ (రాజమండ్రి) ఎస్ఈ పి.శ్రీరామన్నారాయణ తెలిపారు. కార్యాలయ నిర్మాణ భవన పనులను ఆయన పరిశీలించారు. రూ. 1.60 కోట్లతో ఈ భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు. చైర్‌పర్సన్ బంగారు శివలక్ష్మి మాట్లాడుతూ పట్టణానికి ఎర్రకాలువ జలాశయ నీరు శుద్ధిచేసి మంచినీరుగా సరఫరా చేసే పథకాన్ని మంజూరు చేయించాలని ఎస్ఈని కోరారు. దీనిపై ఎస్ఈ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ గోదావరి జలాలు ఇచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఇ ఆర్.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

## సీసీ డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన

కె.వి.రమణారావు, రాజధాని ప్రతినిధి, జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం నగర పంచాయతీలోని 13వ వార్డులో సీసీ డ్రెయిన్ నిర్మాణానికి చైర్‌పర్సన్ బంగారు శివలక్ష్మి శంకుస్థాపన చేశారు. వార్డులోని దువ్వెల బుచ్చయ్య ఇంటి నుంచి అశ్వారావుపేట రోడ్డు వరకు సుమారు 250 మీటర్ల మేర 13వ ఆర్థిక సంఘం నిధులు రూ. 5 లక్షలతో నిర్మిస్తున్నట్లు చైర్‌పర్సన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ అట్లూరి రామ్మోహనరావు, కౌన్సిలర్ చింతల వెంకటేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు రాజాన సత్యనారాయణ (పండు), మద్దిపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కార్తీకంలో వేంకటేశుని సన్నిధిలో ప్రత్యేక పూజలు

రాజధాని వార్తలు, కోనసీమ ప్రతినిధి-జివిఎన్.రావ్ : అమలాపురం పట్టణం మహిపాలవీధిలో వేంచేసియున్న శ్రీ భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం మొదటి శనివారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కర్రి రామస్వామి(దత్తుడు), ధర్మకర్తల మండి సభ్యులు, ఆలయ కార్యనిర్వహణాధికారి వివిఎస్ఎన్.మూర్తి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



# భద్రాచలం రైల్వే లైన్ నిధులకు కృషి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బాబు

### ఎంపీ మాగంటి బాబు

కె.వి.రమణారావు, రాజధాని ప్రతినిధి, జంగారెడ్డిగూడెం : ఈ ప్రాంత ప్రజలు ఎంతో కాలం నుంచి ఎదురుచూస్తున్న కొవ్వూరు భద్రాచలం రైల్వే లైన్ వేయడానికి కేంద్ర ప్రభుత్వం సుముఖంగా ఉందని ఏలూరు ఎంపీ మాగంటిబాబు తెలిపారు. జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయగూడెంలో శ్రీమద్దిఆంజనేయస్వామి వారిని దర్శించుకున్న ఎంపీ బాబు అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఈ రైల్వే లైన్ ప్రక్రియలో ఇప్పటికే సర్వే పూర్తయిందని, గుర్వాయగూడెం మీదుగా రైల్వే లైన్ వెళ్లడం శుభపరిణామని అన్నారు. ప్రస్తుతం ఈ రైల్వే నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. రాబోయే బడ్జెట్‌లో నిధుల కేటాయింపుపై కృషి చేస్తానని తెలిపారు. కేంద్ర రైల్వే శాఖా మంత్రి సురేష్‌ప్రభు వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. రైల్వే లైన్ నిర్మాణంతో రవాణా సౌకర్యం మెరుగవుతుందని, వాణిజ్య కేంద్రంగా జంగారెడ్డిగూడెం అభివృద్ధి చెందుతుందన్నారు. అర్థ శతాబ్దం నాటి కల పోలవరం ప్రాజెక్టు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పూర్తవుతుందని, కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూర్చడం ముఖ్యమంత్రి కార్యదక్షతకు నిదర్శనమని ఎంపీ అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీచైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, పోలవరం ఎమ్మెల్యే మొడియం శ్రీనివాసరావు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు శివలక్ష్మి, జడ్పీటీసీ శీలం రామచంద్రరావు, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు మండవ లక్ష్మణరావు, పారిజాతగిరి చైర్మన్ బిక్కిన సత్యనారాయణ తదితరులు పాల్గన్నారు. మద్ది ఆలయ చైర్మన్ యిందుకూరి రంగరాజు, ఈవో పెన్మెత్స విశ్వనాథరాజు మద్ది క్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకం గురించి ఎంపీకి వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆలయ ధర్మకర్తలు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కాపు సత్యాగ్రహ పాదయాత్రను విజయవంతం చేయండి

రాజధాని వార్తలు, కోనసీమ ప్రతినిధి-జివిఎన్.రావ్ : కాపు ఉద్యమనేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కాపు రిజర్వేషన్ల కోసం చేపట్టనున్న కాపు సత్యాగ్రహ పాదయాత్రను విజయవంతం చేయాలని ముమ్మిడివరం నియోజకవర్గ కాపునేతలు పిలుపునిచ్చారు. స్థానిక శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణమండపంలో కాపునేత గుద్దటి రామకేశవ బాలకృష్ణ(జమ్మి) అధ్యక్షతన జరిగిన సమావేశంలో కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం ఈ నెల 16 నుంచి ఐదు రోజుల పాటు కోనసీమలో నిర్వహించనున్న పాదయాత్రకు కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనకు కాపు నాయకులు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కాపునాయకులు ధూళిపూడి చక్రం, సలాది శేషారావు, వాననాశి రామారావు, రంబాల బోసు, ఏడిద నాని, త్సవటపల్లి నాగభూషణం, బోనం సూర్యం, రాయపురెడ్డి జానకీరామయ్య, గణేశుల బ్రహ్మానందం, ఏడిద దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఉండవల్లి చరిత్రకారుడు నశీర్ అహమ్మద్‌కు 'ప్రౌడ్' విశిష్ట సేవా అవార్డు



రాజధాని ప్రతినిధి: గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లి గ్రామానికి చెందిన చరిత్రకారుడు, బహుగ్రంథరచయిత, సయ్యద్ నశీర్ అహమ్మద్‌కు హైదరాబాద్‌కు చెందిన'ప్రౌడ్' సంస్థ'విశిష్ట సేవా అవార్డు' ను ప్రకటించింది. గత రెండు దశాబ్దాలుగా భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రను పరిశోధిస్తూ వెలుగులోకి రాని విశిష్ట సమాచారాన్ని వెలికి తీసి వందలాది వ్యాసాలు,అనేక పరిశోధనాత్మక చరిత్ర గ్రంథాలను వెలువరించడం ద్వారా తెలుగు ప్రజలకు చారిత్రక సమాచారాన్ని అందజేస్తున్న నశీర్ అహమ్మద్ నిరంతర కృషికి గుర్తింపుగా ఈ అవార్డు అందించి గౌరవించనున్నట్లు 'ప్రౌడ్'(ప్రోగ్రెసివ్ ఆర్గనైజేషన్ ఫర్ అన్‌రీచ్డ్ అండ్ డిసేబుల్డ్,హైదరాబాద్) సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మేడంకి సుబ్బారావు తెలిపారు. ఈ నెల 19 న హైదరాబాద్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని'ఎన్టీఆర్ అడిటోరియం'లో జరుగే సంస్థ 12 వ వార్షికోత్సవ సంబరాలలో నశీర్‌కు ఈ 'విశిష్ట సేవా అవార్డు' అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నశీర్ అహమ్మద్‌తోపాటుగా ప్రొఫెసర్ కొలకలూరి ఇనాక్, పద్మశ్రీ నత్రా రవికుమార్, కవయిత్రి కాట్రగడ్డ భారతి, సామాజిక కార్యకర్త ఎన్ సిద్దోజీ రావులను అవార్డులతో ఘనంగా సత్కరించనున్నారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా వెంకటేశ్వర విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎ.దామోదరం, తెలంగాణా రాష్ట్రం హైదరాబాద్ జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రశాంతి,తెలంగాణ రాష్ట్రం భాషా - సంస్కృతి శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, స్నేహ గ్రూప్ ఛైర్‌పర్సన్ డా॥ కె.శివభాగ్యారావు తదితర పుర్వప్రముఖులు పాల్గొంటారని సుబ్బారావు వెల్లడించారు.

## మద్ది ఆంజనేయస్వామిని దర్శించుకున్న ఎంపీ మాగంటిబాబు



మాగంటిబాబుకు మద్ది ఆంజనేయస్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న చైర్మన్ రంగరాజు

కె.వి.రమణారావు, రాజధాని ప్రతినిధి, జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి ఆలయాన్ని ఏలూరు ఎంపీ మాగంటిబాబు, జడ్పీచైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, పోలవరం ఎమ్మెల్యే మొడియం శ్రీనివాసరావులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ చైర్మన్ యిందుకూరి రంగరాజు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి వారి సన్నిధిలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ రంగరాజు ఎంపీ మాగంటిబాబుకు మద్ది ఆంజనేయస్వామి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ ప్రధానార్చకులు వేదాంతం వెంకటాచార్యులు, ఆలయ అర్చకులు వీరికి వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఈకార్యక్రమంలో ఈవో పెన్మెత్స విశ్వనాథరాజు, ధర్మకర్తలి మండలి సభ్యులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. శనివారం లక్ష తమలపాకుల పూజా కార్యక్రమం జరిగింది. స్వామి ఒక్కరోజు ఆదాయం రూ. 1,54,358లు వచ్చినట్లు కార్యనిర్వహణాధికారి విశ్వనాథరాజు తెలిపారు.

## ఖైది నంబర్ 150 చిత్రం కోసం పూజలు

రాజధాని వార్తలు, కోనసీమ ప్రతినిధి-జివిఎన్.రావ్ : మెగాస్టార్ చిరంజీవి నటించిన 150వ చిత్రం ఖైది నంబర్ 150 అఖండ విజయం సాధించాలని అయినవిల్లి శ్రీసిద్ధి వినాయకస్వామివారి ఆలయంలో అఖిల భారత చిరంజీవి యువత అధ్యక్షుడు రవణం స్వామినాయుడు ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. ప్రధాన అర్చకుడు మాచరి సూరిబాబు, వేదపండితులు కప్పగంతుల సూర్యనారాయనశర్మ నేతృత్వంలో చిరంజీవి పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రవణం స్వామినాయుడు మాట్లాడుతూ ఖైది నంబర్ 150వ చిత్రం విజయం సాధించాలని అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయంతో పాటు ధర్మస్థలం మంజునాథస్వామి, యాద్రాద్రి లక్ష్మీనరసింహస్వామి, కాంచిపురం కామాక్షి, వారణాశి కాశీవిశ్వనాథుడు, కొల్హాపూర్ మహాలక్ష్మి తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చిరంజీవి యువత అధ్యక్షుడు ఏడిద శ్రీను, పిసిసి అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సి గిడుగు రుద్రరాజు, ఆల్డా చైర్మన్ యాళ్ల దొరబాబు, కోనసీమ టిబికె జెఎసి కన్వీనర్ కల్లకొలను తాతాజీ, కాపు రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లా విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## అమలాపురంలో బీజేపి అసెంబ్లీ కార్యాలయం ప్రారంభం



రాజధాని వార్తలు, కోనసీమ ప్రతినిధి-జివిఎన్.రావ్ : అమలాపురం స్థానిక ఎర్రమిల్లివారి వీధిలో భారతీయ జనతాపార్టీ అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయం, ఉచిత వైద్యశాలను రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణ బీజేపి అధ్యక్షుడు అయితాబత్తుల అభిషేక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ఆకుల మాట్లాడుతూ దివంగత నాయకులు వారణాశి సూర్యనారాయణమూర్తి, యుర్రమిల్లి భీమశంకరం వంటి నాయకులు ఉభయగోదావరి జిల్లాలో ఎందరో నాయకులు, కార్యకర్తలను తయారుచేశారని అన్నారు. బీజేపికి సేవలు అందించడంతో పాటు కార్యాలయానికి భవనాన్ని ఇచ్చిన యర్రమిల్లి పాండురంగారావును పూలమాలతో సత్కరించారు. ఉచిత వైద్యసేవలను కూడా ఈ సందర్భంగా ప్రారంభించారు. తొలుతుగా రాష్ట్ర ఆల్డా చైర్మన్ యాళ్ల దొరబాబు భరతమాత చిత్రపటానికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వి.నాయుడు, ఉంగరాల చినబాబు, మానేపల్లి అయ్యాజివేమా, కర్రి చిట్టిబాబు, బసవా శివరామ్‌ప్రసాద్, ముదునూరి రంగరాజు, ఎం.రాజ్యలక్ష్మి, మోకా వెంకటసుబ్బారావు, నిమ్మకాయల వెంకటరెడ్డినాయుడు, చిట్టూరి రాజేశ్వరి, మల్లాడి హనుమంతరావు, బసవా చినబాబు, యల్లమెల్లి కొండ, గుమ్మళ్ల రెడ్డినాయుడు, డాక్టర్ పెయ్యల శ్యామ్‌ప్రసాద్, అరిగెల తేజ తదతరులు పాల్గొన్నారు.

# సామాన్యుడు విలవిల...







ప్రధానమంత్రి నరేంద్రమోడీ నల్లధనం నిరోధానికి చేపట్టిన పెద్దనోట్ల రద్దు భూమరాంగ్ అయ్యి సామాన్యుడి బ్రతుకు దుర్భరమయ్యింది. డబ్బులన్నా కడపు నింపడంలేదు. హఠాత్ నిర్ణయంతో ఎక్కడ ప్రయాణీకులు అక్కడే ఆగిపోయారు. ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడం వల్ల వందనోట్లు, పదులు, యాభైలు అందుబాటులో లేకుండా పోయాయి. నల్లధానాన్ని అరికట్టడానికి చేసిన మార్గం నల్లధనం పేరుకుపోవడానికి సులువయ్యింది. వందలున్నవారంతా ఐదువందలకు రూ. 400 వందలు వెయ్యిరూపాయలకు రూ. 700 ఇస్తూ అక్రమ సంపాదకు పాల్పడుతున్నారు. నల్లధనం వెలికితీతకు ప్రయోగించిన పెద్దనోట్ల రద్దు మళ్లీ నల్లధనం కూర్పుకు దోహదపడటం కొసమెరుపు. ఏదిఏమైనా ఎక్కడో నల్లడబ్బుగల కుబేరులు పడవలసిన బాధలు ఇప్పుడు సామాన్యుడు అనుభవిస్తున్నాడు. ఈ ప్రతిపాదన రాగానే సెలబ్రటీలంతా ఆహా మోడీ, ఓహో మోడీ అన్నారు. వారికేం తెలుసు సామాన్యుడి బాధలు ...దాన్ని చూసి రెచ్చిపోయిన ప్రభుత్వం మరింత ప్రగల్భాలు పలికింది. ఈరోజు చూడండి ఎంత మంది పిల్లలతో, వృద్ధులతో, పాలు, పెరుగు, కూరలు, బియ్యం లాంటి నిత్యావసర సరుకులు కూడా లేకుండా దిక్కులేనివారిగా బస్టాండ్లలోను, రైల్వేస్టేషన్లలోనూ పడిఉన్నారో చూస్తే తెలుస్తుంది. ఐందొందలు మార్చాలంటే బ్యాంకులకు, లేదా పోస్టాఫీసులకు వెళ్లాలి. ఒక్క నోటు ఉన్నా ఎండల్లో క్యూలో నుంచోవాలి. ఆరోజు పనీపాటలు మానేసి మరీ... అర్జంటుగా ఆసుపత్రికి పోడానికి కూడ వీలులేనిపరిస్థితి. ప్రజలకు ఎంతో చేస్తున్నామని నిరూపించుకునే ప్రయత్నంలో కేంద్రం అష్టకష్టాలు పెడుతుందనడంలో సందేహం లేదు... నిజానికి ఆదినుంచీ మోడీకి ప్రచారటోపం ఎక్కువ ..సర్జికల్ స్ట్రయిక్స్ (లక్షితదాడులు) తన ప్రభుత్వ ఘనతగా చెప్పు కొచ్చారు. దేశరక్షణకోసం ప్రభుత్వం,సైన్యం ఎప్పటికప్పుడు నిర్వహించే విషయమే... దేశరక్షణలో భాగంగా దాడులు నిర్వహిస్తూనే ఉంటారు. కాని దాన్ని బహిర్గత పరచి తాను, తమ ప్రభుత్వం ఏదో చేసినట్లు ప్రచారం చేసుకున్నారు. మెరుపుదాడులు సైనికులు విజయమని, మోడీకి వారి ప్రభుత్వానికి సంబంధంలేదని ప్రతిపక్షాలు నానా యాగీచేయడంతో ప్రభుత్వం వెనక్కు తగ్గవలసి వచ్చింది. అయినా కేంద్ర ప్రభుత్వం మళ్లీ ప్రచారం కోసం రూ. 500,1000లను హఠాత్తుగా అర్ధరాత్రి నుంచి రద్దు చేయడం సామాన్యుడిపాలిటి పిడుగుపాటుగా పరిణమించింది. పెళ్లిళ్లు, ఫంక్షన్లు ఆగాయి. వాటితో పాటే కొన్ని గుండెలు కూడా.. నల్లధనం నిరోధానికి రెండు వారాలపాటు సామాన్యులకు ఇబ్బందులు తప్పవని అరుణ్ జైట్లీ సెలవిస్తున్నారు. అయితే ఆసుపత్రుల్లోని రోగులు, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రజలు ఎంతకష్టాన్ని అనుభవిస్తున్నారో ...ప్రాణం ఖరీదును ప్రభుత్వం ఇంత తేలికగా చూస్తారనుకోలేదు.

**నరేంద్రమోడీ నిర్వాకంతో చిన్నవ్యాపారాలు ధమాల్...**

ఒక్కో వ్యక్తికి రోజుకు రూ. 4,000 మాత్రమే బ్యాంకు కౌంటర్ నుంచి పెద్దనోట్లు మార్చుకునే అవకాశం, రోజుకు రూ. 10,000 నగదు, వారానికి రూ. 20 వేలు మాత్రమే బ్యాంకుల నుంచి విత్‌డ్రాకు అనుమతించడం శుభకార్యాలు జరుపుకునే వారికి పెద్ద దెబ్బ. 18నవంబరు వరకు ఏటియంల నుంచి రూ. 2,000 వేలు, ఆపై తేదీల్లో రోజుకు రూ. 4,000 తీసుకునే వెలుసుబాటు కల్పించడంతో పిల్లల ఫీజులు కూడా కట్టలేని స్థితిలో ప్రజలు ఉన్నారు.

### వీళ్లంతా తేలుకుట్టిన దొంగలే...

రానున్న పరిణామాలను అంచనావేయలేని ట్విట్టర్ సెలబ్రిటిలంతా వెనుక ముందు ఆలోచించకుండా, ప్రభుత్వాన్ని శక్తి కొద్దీ పొగిడేశారు. అందులో సినిమావాళ్లు మరీ... ఎవరికి వారు మోడీ దగ్గర మార్కులు కొట్టేయడానికి పోటీలు పడ్డారు. ఇప్పుడు సినిమాలు బంద్ కావడంతో నోట్లో గుడ్డలు పెట్టుకొని సైలెంట్‌గా వారంతా ఏడవవలసి వస్తోంది. తెలుగు పరిశ్రమలో ప్రముఖ హీరోఇంట్లో రూ. 25 కోట్లు కరెన్సీ ఉండిపోతే ఏం చెయ్యాలా అని చార్టెడ్ ఎకౌంటెంట్లతో సమావేశం జరిపారని సమాచారం. కొత్త సినిమాల విడుదల ఆగిపోయాయి. నిజానికి ఇది సినిమా పెద్దలకే పెద్ద దెబ్బ... ఎందుకంటే హీరోలు తమ సొమ్ముకు పన్ను కట్టవలసి ఉంటుందని , ముందుగానే తెలుపు, నలుపుల్లో రెమ్యూనరేషన్ తీసుకుంటారు. ఇంకా కొన్ని ప్రాంతాల డిస్ట్రిబ్యూషన్ వాటా కూడా...వీళ్లంతా ఇప్పుడు తేలుకుట్టిన దొంగలే...

### రాజధానిప్రాంతంలో

రాజధాని ప్రాంతంలో రైతులంతా తమ భూములను బినామీలకు అమ్మేశారు. వారు మరికొందరు బిల్డర్లకు అమ్మేశారు. ఇలా ఇక్కడి భూమి చాలా చేతులు మారింది. మరి ఆ డబ్బంతా ఏమైంది...ఎక్కడుంది... బ్యాంకుల్లో కంటే ఇంట్లోనే ఎక్కువ ఉండిపోయాయి. వారంతా దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు.

### హైటెక్ ముఖ్యమంత్రి వ్యాఖ్యలు

హైటెక్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ఆన్‌లైన్ ఉండగా నగదు దండగ అని వ్యాఖ్యానించడం ప్రజలను ఆగ్రహానికి గురిచేస్తోంది. రాష్ట్రంలో ఇప్పటికి కూడా చాల మందికి ఇంకా బ్యాంకు ఎకౌంట్లు లేవు.. నిజానికి పాలు, పళ్లు, మందులు,ఇస్త్రీ, పనిపనుషులు, కూరలు తదితర రోజువారీ ఖర్చులన్నీ డబ్బుతోనే జరుగుతుంటాయి. ఆన్‌లైన్‌లో డబ్బువాడకాలు తెలీని వారు చాలా మంది ఉన్నారు. డీడీలు, చెక్‌లు దినసరి వేతనదారులుకు ఇచ్చే సంస్కృతి ఇక్కడ లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పటికిప్పుడు నగదు ఎందుకంటే ఎవరికైనా ఎలా ఉంటుంది ? కిందిస్థాయి సమాజం గురించి, వారి సాదక బాధకాల గురించి బాబుకు బొత్తిగా తెలీదని జనాలకు అర్థమైపోయింది.

## ఇదేం మొదటిసారి కాదు

**న్యూఢిల్లీ :** మన దేశంలో రూ.500, రూ.1,000 నోట్లను చలామణి నుంచి ఉపసంహరించడం ఇదే తొలిసారి కాదు. స్వాతంత్ర్యం రాకముందు నుంచి ఇలాంటి సందర్భాలు మన దేశంలో ఉన్నాయి. 1946లో తొలిసారిగా ఈ తరహా చర్య చేపట్టారు. అప్పుడు అమలులో ఉన్న రూ.1,000, రూ.10,000 నోట్లను చలామణి నుంచి తొలగించారు. ఆర్‌బీఐ ఇప్పటివరకు ముద్రించిన అత్యంత విలువైన నోటు రూ.10,000 దీనిని 1938లోనే ముద్రించారు. 1946లో వెనక్కు తీసుకుని మళ్లీ 1954లో ముద్రించారు. 1954లో రూ.1,000,రూ.5,000 రూ.10,000నోట్లను ముద్రించారు. మళ్లీ 1978 జనవరిలో ఉపసంహరించారు. రూ.500 నోటును 1987 అక్టోబరులో, 1,000 నోట్లను 2000 నవంబరులో మళ్లీ ప్రవేశపెట్టారు. రూ.2,000నోటును ప్రవేశపెట్టనుండటం మాత్రం ఇదే తొలిసారి మనం నిత్యం ఉపయోగిస్తున్న వివిధ మొత్తాల్లోని కరెన్సీ నోట్లు గతంలో అనేక మార్పులకు గురయ్యాయి. 1967 నుంచి అశోక స్తంభం వాటర్‌మార్క్‌తో నోట్లను ముద్రించడం మొదలుపెట్టారు. నోట్లపై జాతీయ చిహ్నమైన మూడు సింహాల కింద ఉండే 'సత్యమేవజయతే' సూక్తిని 1980లో తొలిసారిగా ముద్రించారు. 1987 అక్టోబరులో గాంధీ చిత్రం, అశోకస్తంభాలతో రూ.500 నోటును ముద్రించారు. మహాత్మాగాంధీ సిరీస్ నోట్లను 1996 నుంచి ముద్రించడం మొదలు పెట్టారు. భద్రతా ప్రమాణాలు పెంచి ఎంజీ సిరీస్ కొత్త నోట్లను 2005 నుంచి తీసుకొచ్చారు. **- బోస్**

### ప్రభుత్వ లక్ష్యం ఏమిటి ?

విదేశాల నుంచి నల్లడబ్బు తెచ్చి ప్రతివారి బ్యాంకులో జమచేస్తానన్న ఎన్నికల వాగ్ధానంతో ప్రధాని పదవిని చేపట్టిన మోడీ ప్రజల దృష్టిని మార్చడానికే ఈ ప్రక్రియ చేపట్టారని విపక్షాలు దుమ్మెత్తి పోస్తున్నాయి. ప్రజలు ఇబ్బంది పడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం సామాన్య ప్రజల జీవితాలతో ఆడుకుంటుం దన్నారు. వచ్చేఏడాది ఉత్తరభారత దేశంలోజరుగుతున్న ఎలక్షన్లలో ప్రయోజనం పొందటం కోసమే ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని వారు దుమ్మెత్తి పోస్తున్నారు.

### ముందుగానే సర్దుకున్న బడాబాబులు

కార్పొరేట్ శక్తులు, రాజకీయాలు కలిసిపోయిన ప్రస్తుత రాజకీయాల్లో పెద్ద నోట్ల చెలామణి రద్దు గురించి ముందు గానే తెలుసుకొన్న బడాబాబులు మూడునెలల ముందుగానే బ్యాంకులావాదేవీల ద్వారా సర్దుకున్నారని తెలుస్తోంది. ప్రధాని నరేంద్రమోడీకి చిత్తశుద్ధి ఉంటే వాటిపై దర్యాప్తు చేయించాలని వారినందరినీ ఒదిలేసి మాపై ఈ ప్రతాప మేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అదే జరగకపోతే ఇప్పటికే ఈ ప్రభుత్వం కూలిపోయి ఉండేదని కూడా కొంతమంది యువకులు ఘాటుగా స్పందించారు.

## 86 శాతం లావాదేవీలు బంద్

**న్యూఢిల్లీ :** మోడీ ప్రభుత్వం తీసుకున్న పెద్ద నోట్ల రద్దు నిర్ణయం దేశవాప్తంగా సంచలనం సృష్టించింది. బ్లాక్‌మనీని దాచుకున్న నల్లకుబేరులకు ఊహించని షాక్. అయితే అకస్మాత్తుగా తీసుకున్న ఈ నిర్ణయ వల్ల ఇప్పటి వరకూ చెల్లు బాటయిన 86శాతం డబ్బుకు సంబంధించిన క్రయవిక్రయాలు ఒక్కసారిగా నిలిచిపోయాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లెక్కల ప్రకారం నవంబర్ 8న రద్దు నిర్ణయం వెలువడినప్పటి నుంచి ఇప్పటివరకూ 217 బిలయన్ డాలర్లు, మనకరెన్సీలో 14లక్షల కోట్ల రూపాయల 5వందల సొమ్ము వినియోగంలో ఉంది. ఇందులో 7.85లక్షల రూపాయలు 5వందల సొమ్ము వినియోగంలో ఉంది. ఇందులో 7.85లక్షల రూపాయలు 5వందల నోట్లు, 6.33లక్షల వెయ్యి రూపాయలనోట్లు ఉన్నాయి. ఇందులో ఉద్దేశపూర్వకంగా మార్చుకోని సొమ్ము కొంత ఉంటే, సామాన్యులు, మధ్యతరగతి ప్రజలసొమ్ము మరికొంత ఉంది. అయితే ఈ నిలిచిపోయిన సొమ్ములో సగానికి పైగా, అధిక శాతం నల్ల డబ్బేనని ఆర్థిక నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. రెండుమూడు రోజుల్లోనే ఇంత డబ్బుబయటపడితే, ఇంకెంత డబ్బుందోనని చర్చించుకుంటున్నారు. కొన్నికొన్ని ప్రాంతాల్లో డబ్బును తగలబెట్టడం, చెత్త కుప్పల్లో పడేయడం వంటి ఘటనలు కూడా జరిగాయి. బ్లాక్‌మనీని సంపాదించిన బడాబాబులు ఎన్ని తిప్పలు పడుతున్నారో ఈ ఘటనలే నిరూపిస్తున్నాయి.



లింగాయపాలెంలో డ్వాక్రా మహిళలకు చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి పీతల సుజాత

## రాష్ట్రాభివృద్ధికి సహకరిద్ధాం

### తోటసీతారామలక్ష్మీ

**రాజధాని ప్రతినిధి ,(కొయ్యలగూడెం,అన్నంరెడ్డి సుబ్బారావు) :** మహానేత దివంగత రామారావు ఆశ యాలసాధనకోసం , రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పార్టీ కార్యకర్తలు అండగానిలవాలని జిల్లా తెలుగు దేశం పార్టీ అధ్యక్షురాలు రాజసభసభ్యురాలు తోటసీతారామాలక్ష్మీ కోరారు. కొయ్యలగూడెం మండలం సరివెపల్లిలో తెలుగు దేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ఏర్పాటు చేసిన ఎన్.టి.ఆర్. విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈసందర్భంగా అక్కడ పోలవరం ఎం.ఎల్.ఏ. అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో సీతారామ లక్ష్మీ ప్రసంగించారు. రాష్ట్రప్రభుత్వం అమలుపరుస్తున్న ప్రజాసంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను, రాజధాని మహానగరం అమరావతి నిర్మాణానికి సి.యం. చేస్తున్న అవిరళ కృషిని జనచైతన్య యాత్రలలో కార్యకర్తలు ప్రజలకు వివరించాలని, వారి సమస్యలను కూడ తెలుసుకోవాలని ఆమెపేర్కొన్నారు. ఎమ్మెల్యే కష్టపడి పనిచేస్తున్నారని. ప్రజలకు, కార్యకర్తలకు ఇంకా ఏవైనా సమస్యలు, ఇబ్బందులు ఉంటే ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని ఆమె అన్నారు. తెలుగుదేశం పార్టీకి పశ్చిమగోదావరి జిల్లా ప్రాణం వంటిదని. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఈజిల్లా అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఎమ్మెల్యే శ్రీనివాసరావు ప్రసంగిస్తూ కార్యక్రమాలకు రూపకర్త ఏర్పాటు చేయుచున్నారు. దివంగిత ఎన్.టి.ఆర్.విగ్రహాలను ప్రతిగ్రామంలోను ఏర్పాటు మండల తెలుగు దేశంపార్టీ అధ్యక్షుడు, ఎ.ఎం.సి. చైర్మన్ పారేపల్లి రామారావు, జడ్.పి.ఉపాధ్యక్షురాలు చింతల వెంకటరమణ , రాష్ట్ర మహిళా సహకార ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గంగిరెడ్ల మేఘలాదేవి, ఎం.పి.పి. పర్తిచందన శ్రీదేవి మాజీ ఎం.పి.పి.మట్టా సత్తిపండు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పారేపల్లి శ్రీనివాస్ సరివెపల్లిగ్రామ పార్టీ అధ్యక్షుడు ఆకుల పేర్రాజు పాల్గొన్నారు.

### సరివెపల్లిలో బి.సి.కమ్యూనిటీహాలులో నిర్మాణానికి ఎం.పి.నిధులు.

సరివెపల్లిలో బి.సి. కమ్యూనిటిమాలుభవనం నిర్మాణానికి తమ ఎం.పి.ల్యాడ్స్ నిధులు మంజూరు చేస్తున్నట్లు రాజ్య సభసభ్యురాలు తోట సీతరామలక్ష్మీ ప్రకటించారు.

## అమరం ఎడిటర్ కృష్ణమూర్తి రాజు మృతికి సంతాపం


**రాజధాని వార్తలు, కోనసీమ ప్రతినిధి-జిఎన్.రావ్ :** పశ్చిమ గోదావరిజిల్లా నిడదవోలుకు చెందిన అమరం పత్రిక సంపాదకులు తోటకూర కృష్ణమూర్తిరాజు మృతికి వర్కింగ్ జర్నలిస్టు యూనియన్(చిన్న వార్తపత్రికలు) వ్యవస్థాపక కార్యదర్శి. అధ్యక్షులు జిఎన్.రావ్ అధ్యక్షతన ముమ్మిడివరంలో జరిగిన సమావేశంలో ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. తోటకూర కృష్ణంరాజు తూర్పుగోదావరి జిల్లా ఆత్రేయపురంలో 1935లో జన్మించారు. ఎస్ఆర్ఎంటి, టివిఎస్‌ల్లో చాలాకాలం ఉద్యోగం చేశారు. 2005లో అమరం పత్రిక స్థాపించి దానికి సంపాదకులుగా వ్యవహరించారు. చిన్నపత్రికల సంఘానికి రాష్ట్ర అధ్యక్షుడిగా సమాచార హక్క చట్టం ప్రచార ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, వినియోగదారుల హక్కుల సంఘానికి ప్రతినిధిగా సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు వి.శివశంకర్, కె.భగవాన్‌దాస్, ఎ.భరత్‌రామ్, అబ్బాస్‌హైదర్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దనోట్ల రద్దుపై వచ్చే వారం సుప్రీం విచారణ

**న్యూఢిల్లీ :** దేశంలో రూ.500, రూ.1000 నోట్లను రద్దుచేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సుప్రీంకోర్టులో వచ్చేవారం విచారణ జరగనుంది. కేంద్రం పెద్దనోట్లు రద్దు చేస్తూ జారీ చేసిన ప్రకటన నిరంకుశంగా ఉందని, ప్రజలకు నోట్ల మార్పిడికి తగినంత సమయం ఇవ్వలేక పేర్కొంటూ దాఖలైన పిటిషన్‌పై కోర్టు విచిరణ చేపట్టనున్నట్లు తెలిపింది. ప్రకటనను కొట్టివేయడమో, లేక నోట్ల మార్పిడికి తగినంత సమయం ఇవ్వాల్సిందిగా కేంద్రాన్ని ఆదేశించడమో చేయాలని పిటిషనర్ కోర్టును కోరారు. పెద్దనోట్ల రద్దు విషయంపై కేంద్రం కూడా సుప్రీంకోర్టులో కేవియట్ దాఖలు చేసింది. తమ వాదనలు వినిపించేందుకు అవకాశం ఇవ్వాలని, అప్పటివరకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వొద్దని కోర్టును కోరింది. వీటిని డిసెంబరు 30లోగా బ్యాంకుల్లో మార్చుకోవచ్చు.

## ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మండి!

### ఉండి ఏఎంసి చైర్మన్ కొత్తపల్లి గోపాలకృష్ణరాజు.



**తాళం హనుమంతరావు, ఉండి(రా.వా):** రైతులు కష్టపడి పండించిన ధాన్యాలను దళాలను నమ్మి అమ్మకాలు చేయవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మాలని ఉండి ఏఎంసి చైర్మన్ కొత్తపల్లి గోపాలకృష్ణరాజు సూచించారు. ఉండి మార్కెట్ యార్డులోనూ, యండగండి గ్రామంలోనూ ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం ఈకేంద్రాలను ఏర్పాటు చేయకపోతే రైస్‌మిల్లర్ల, కమీషన్‌దార్ల దోపిడీ యధేచ్ఛగా కొనసాగేదని అన్నారు. రైతులకు భరోసా కల్పించేందుకే ధాన్యం మార్కెట్‌లోకి వచ్చే సమయంలోనే ప్రత్యామ్నాయంగా ఈకేంద్రాలను ప్రారంభించామన్నారు. రైతుల వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల సర్పంచుల ఛాంబరు అధ్యక్షులు జుత్తిగ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఏడాది రబీలో సాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఉండి ఎమ్మెల్యే శివరామరాజు అహర్నిశలు కృషి చేసి రబీ పంటను సంరక్షిస్తున్నారన్నారు. ఈఏడాది నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పుంతరోడ్లను నిర్మించి రైతుల రవాణా ఖర్చులను తగ్గించాలనే ధ్యేయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఉండి జడ్‌పీటీసీ కరిమెరక తులసిశ్రీనివాసరావు, ఎంపీపీ దలియ లక్ష్మి, సర్పంచ్ ముదునూరి విజయకృష్ణంరాజు, వైస్‌ఎంపీపీ మంతెన కృష్ణకుమారిసాయిరాజు, సాగిరాజు సాంబరాజు , కునుకు శ్రీనివాస్, మోపిదేవి శ్రీనివాస్, కాగిత బుజ్జి, కాగిత మహంకాళి, ఏఎంసి వైస్ చైర్మన్ కట్టా గంగాధరరావు, ఐకేపి ప్రతినిధులు రాజేష్, కృష్ణకుమారి, డ్వాక్రా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వేగేశ్న అనంతలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

# తెలుగు దేశంలో రచ్చకెక్కిన వర్గ విభేధాలు...

- రసాభాసగా మారిన బయ్యనగూడెం పి.హెచ్.సి ప్రారంభోత్సవం
- చిరాకు పడ్డ ఎంపి మగంటి

**రాజధాని ప్రతినిధి, (కొయ్యలగూడెం అన్నరెడ్డి సుబ్బారావు) :** తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండున్నర సంవత్సరాలకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖమంత్రి కామినేని శ్రీనివాసరావు, జడ్.పి. చైర్మన్ మళ్లపూడిబాపిరాజు తొలిసారిగా అధికార పార్టీ కార్యక్రమాలలో పాల్గొన్నారు కొయ్యలగూడేం మండలంలో తెలుగుదేశం పార్టీలో అంతర్గతంగా ఉన్న వర్గ విబేధాలు తీవ్రస్థాయికి చేరాయి. బయ్యనగూడెం పి.హెచ్.సి. భవనాల ప్రారంభోత్సవం కార్యక్రమం రసాభాసగా మారింది. ఒక వర్గం నాయకులు, కార్యకర్తలు ఏకపక్షంగా తమవర్గం నాయకులు, ప్రజాప్రతినిధులకు మద్దతుగా నినాదాలు హోరెత్తించటంతో ఆసుపత్రి ప్రారంభోత్సవం కారక్రమాన్ని హడావుడిగా ముగించారు. కార్యకర్తల తీరుపట్ల పోలవరం ఎం.ఎల్.ఏ. మొడియం శ్రీనివాసరావు తీవ్ర ఆగ్రహన్ని వ్యక్తంచేశారు. అంకాలగూడెం, కొయ్యలగూడెంలలో సి.సి. రోడ్ల ప్రారంభోత్సవం కార్యక్రమాలలో ఎం.పి.మాగంటిబాబు అత్యుత్సాహంతో అందరిపై తానే పువ్వులు జల్లుతుశ్రేణులను ఉత్సాహపరచారు. అయితే సి.సి. రోడ్ల ప్రారం భోత్సవం సందర్భంగా ఎం.పి.మాగంటిబాబు కొబ్బరి కాయలను నేల మిదకొట్టకుండా వాటిని గాలిలోకిపైకి విసరి, మరోకొబ్బరికాయను విసరి గాలిలోనే కొట్టటం, అవి జనాలపై పడటంతో ఆయన విచిత్ర వైఖరి ప్రజలను ఆశ్చర్యపరిచింది. పోలవరం మండలం ఎల్.ఎన్.డి. పేటలో రూ.68.లక్షలతో నిర్మించిన పి.హెచ్.సి.భవనాన్ని ప్రారంభించిన మంత్రి కామినేని. జడ్.పి. చైర్మన్‌బాపి రాజు ఎం.పి.బాబు, ఎం.ఎల్.ఏ. శ్రీనివాసరావు ఆ కార్యక్రమం ముగిసిన తర్వాత మార్గమధ్యలో దిప్పకాయలపాడులో పార్టీనాయకుడు, రైతునేత సూర్య ప్రకాశరావు ఇంటికివెళ్లి అనారోగ్యంలో ఉన్న ఆయనను పరామర్శించారు. ఎం.పి.మాగంటిబాబు, మంత్రికామినేని, చైర్మన్ బాపిరాజును పార్టీనాయకుడు వీరవల్లిశివాజీ ఇంటికి వెళ్లారు. ప్రజాప్రతినిధులు వారితో పాలేరువెళ్లారు. అయితే శివాజీ పారేపల్లిరావు, మిగిలిన పార్టీనాయకులు, కార్యకర్తలు అక్కడికివెళ్లకుండా రాష్ట్ర బి.జె.పి. వద్దకు వెళ్లారు. శివాజీని పరామర్శించిన అనంతరం ఎం.పి. మంత్రి తదితరులుకూడా అల్పాహారం తీసుకొని నిర్మలా ఇంటివద్ద రాష్ట్రమహిళా మోర్చ అధ్యక్షురాల శరణాలమాలతో సమావేశమయ్యారు. రాణి, నిర్మలా,కిశోర్ జిల్లామహిళమోర్చ అధ్యక్షురాలు సుభద్రదేవి, జిల్లా బి.జె.పి. అధ్యక్షుడు వర్మ తదితరులు మంత్రి తదితరులు స్వాగతంపలికారు అహ్వానించే సమయంలో ఎ.ఎం.సి. చైర్మన్ పారేపల్లి రాకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేసారు. అక్కడికి మీరు రాకపోవటం ఏమిటి? ఇలా అయితే నేను పోలవరం నియోజకవర్గానికి రాను రామారావునుద్దేశించి అన్నారు. ఎమ్మెల్యే మౌనం వహించారు. అనంతరం ఆప్రాంతంలో ఒక సి.సి. రోడ్డునుకూడా ఎం.పి.కొబ్బరి కాయలగానిలోకి ఎగరేసి కొట్టారు. తర్వాత బయ్యనగూడెం పి.హెచ్.సి. ప్రారంభోత్సవంలో కూడా ఎం.పి. అసహనంగానే ఉన్నారు. ఆసుపత్రి భవనాన్ని సంస్థదాత దంపతులను అభినందించిన ఎం.పి. బాబు ఒక్కడే బయటకు వచ్చి వరండాలోని కుర్చీలో కూర్చుండి పోయారు. వెనక్కబడిగా ఆవిష్కరించి మంత్రి కామినేని ఎం.పి.బాబు నిష్కమించారు. తర్వాత ముళ్లిపూడిబాపిరాజు ఆసుపత్రి స్థలదాత శివకుర్తి సత్యనారాయణ దంపతులను సత్కరించింది. ఎమ్మెల్యే తదితరులు వెలుతీరిగి బయటకు వెళ్తుండగా పెళ్ల బికించి. జడ్.పి. ఉపాధ్యక్షురాలు చింతల వెంకటరమణ, ఎం.పి.పి. అయనపర్తి చందనశ్రీదేవి, ఎ.పి.మహిళ సహకార ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గంగిరెడ్ల మేఘాలాదేవి, జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు పెనుమర్తి రామ్‌కుమార్, ఆర్.పి.ఓ.లవన్న పి.యం. అం.హెచ్.ఓ. తదితరులు పాల్గొన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు, ఎ.ఎం.చైర్మన్ అయిన పారేపల్లి రామారావు స్వగ్రామం బయ్యనగూడెం వర్గవిబేధాలు రచ్చకెక్కటం, రసాభాన కావటం చర్చనీయంశమవుతంది. ఈ పరిస్థితి పట్ల ఎమ్మెల్యే అసంతృప్తి విషయం పార్టీ అధిష్టానం దృష్టికి వెళ్లింది.



బయ్యనగూడెం పి.హెచ్.సి ప్రారంభోత్సవంలలో మంత్రి తదితరులు



పి.హెచ్.సి. వద్ద తెలుగుదేశం కార్యకర్తలను వారిస్తున్న ఎం.ఎల్.ఏ.



మౌలానా అబుల్‌కలాం జయంతి సందర్భంగా ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ హిదాయత్‌ను సన్మానిస్తున్న మాజీ మంత్రి డొక్కా మాణిక్య ప్రసాద్, లాయర్ మోయినుద్దీన్



జాతీయ విద్యాదినోత్సవంలో ప్రసంగిస్తున్న ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు రహమాన్, ఖాదర్ తదితరులు


మైనార్టీ దినోత్సవంలో ప్రసంగిస్తున్న కృష్ణాజిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ గౌసియా బేగం



మైనార్టీ వెల్ఫేర్ డే సందర్భంగా దర్స్‌గా ఇస్లామిక్ స్కూల్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేసిన ముస్లిం డెవలప్‌మెంట్ సొసైటీ

# ప్రాంతీయతకే పీఠం

- అంచనాలకు అందని ట్రంప్ విజయం
- నివ్వెరబోయిన ప్రపంచ దేశాలు
- అగ్రదేశంగా అమెరికా కొనసాగుతుందా ?



సర్వేల అంచనాలను తలక్రిందులు చేస్తూ డొనాల్డ్ ట్రంప్ భారీ మెజారిటీతో విజయం సాధించారు. అతిపెద్ద ప్రజాస్వామ్యంలో చర్చావేదికల ద్వారా వారి ప్రసంగాలను, పరిణితిని, ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలపై వారి స్పందనను అంచనావేసి ఓట్లు వేసే అమెరికన్లు ఈ సారి ప్రాంతీయతకే పట్టం కట్టారు. దీంతో ప్రపంచ దేశాలు నివ్వెర బోయాయి. నిజానికి అమెరికా అగ్రదేశమే అయినప్పటికీ అక్కడ కూడా నిరుద్యోగం ఎక్కువగా ఉంది. అంతేకాదు అక్కడి యువతలో ఉన్నత చదువులు చదివినవారు బహుతక్కువ.వాషింగ్టన్, న్యూయార్క్, లాస్ ఏంజెల్స్, షికాగో, డల్లాస్, మిచిగాన్ , అరిజోన, న్యూ జెర్సి, పెన్సిల్వేనియా, ఓహాయో లాంటి నగరాలను సందర్శించిన విదేశీయులు అక్కడి బహుళ అంతస్థుల భవనాలు, అక్కడ ఉన్న పెద్ద కంపెనీలను చూసి అదే అమెరికా అనుకుంటారు. కాని ఉత్తర అమెరికా అంతటా సామాన్య ప్రజలే ఉంటారు. 16 ఏళ్లు దాటగానే పిల్లలే సంపాదించుకోవాలి దీంతో అక్కడి విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారు. అత్తెసరు చదువులతో, నైపుణ్యతలేమితో అక్కడి యువత నిరుద్యోగానికి గురవుతున్నారు. ఇది గమనించిన ట్రంప్ స్థానికులకే ఉద్యోగాలని, విదేశీయులను వెనక్కిపంపుతామని, ముస్లింలను దేశంలోకి అడుగుపెట్టనివ్వబోమని ప్రకటించడం అక్కడి వారిని ఆకర్షించింది. నిజానికి అమెరికా అగ్రదేశంగా కొనసాగడానికి అనేక దేశాల నుంచి వలసవచ్చిన మేధావులే కారణం. వారిని కాదన్న రోజున నాసాతో సహా ఇతర ప్రముఖ కంపెనీలు అక్కడ మనగలగలేవు. అదే జరిగితే అమెరికా దాని ఉనికిని కోల్పోతుంది.

స్థానికత్వాన్ని రెచ్చగొట్టిన ట్రంప్ తండ్రి మూలాలు జర్మన్‌వి కాగా అతని తల్లి స్కాట్‌లాండ్ ఇద్దరూ యూరోపిన్లే...బ్యాంకు ఎగవేతకు పాల్పడిన ట్రంప్ వ్యాపార, నైతిక అపజయాలతోపాటు రియల్ ఎస్టేట్ విజయాలు కలిస్తే ట్రంప్ అని ప్రత్యర్థులు చెబుతుంటారు. ఆయన హోటళ్లు, కేసినో వ్యాపారాలు ఆరుసార్లు దివాళాతీసాయి. చట్టంలోని లొసుగులు ఉపయోగించి బ్యాంకులతో బేరాలాడి అద్భుతమైన డీల్స్ కుదుర్చుకుంటానని ఆయనే అనేకమార్లు తెలిపారు. పన్ను ఎగవేతదారుడిగా కూడా ఆయన సుపరిచితుడే .. సినిమా యాక్టర్‌గా కూడా ఆయన సుపరిపచితుడే. లిటిల్ రాస్కెల్స్ సినిమాల్లో ఆయన ఆయిల్ టైకూన్‌గా నటించారు. అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం ట్రంప్ 1988,2004,2014ల్లో ప్రయత్నించగా, న్యూయార్క్ గవర్నర్ పదవిపై 2006,2014లో దృష్టి పెట్టారు.

### అగ్రదేశంలో మహిళలకు అన్యాయం

అభివృద్ధి చెందుతున్న ఆసియా దేశాల్లో మహిళలు 19 శతాబ్ధంలోనే రాజకీయాల్లో అత్యున్నత పదవులు అధిష్టిస్తే ఇప్పటివరకు అగ్రదేశం అమెరికాలో అధ్యక్షపీఠం ఇప్పటివరకు ఒక మహిళ ఎన్నికకాకపోవడం ఆశ్చర్యంగా ఉంది. చిన్న దేశం శ్రీలంకలో సిరిమావో బండారు నాయకే 1960లోనే అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో ఇందిరాగాంధీ 1966లో ప్రధాన మంత్రి పదవిని చేపట్టారు. ఇజ్రాయిల్ ప్రధానిగా 1969లో గోల్డ్ అమీర్ ఎన్నికయ్యారు. ఇంగ్లాండ్ ప్రధానిగా మార్గరేట్ థాచర్ 1979లో ఎన్నికవ్వగా,పాక్ ప్రధానిగా బెనజీర్ బుట్టో 1989లో ఎన్నికయ్యారు. బంగ్లా ప్రధానిగా ఖలీదా జియా 1991లో పదవి చేపట్టగా, ఆపై షేక్ హసీనా ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే అగ్రదేశంలో ఇంతవరకు మహిళా అధ్యక్షురాలిగా ఎన్నికవకపోవడం విధి విచిత్రం. ఆడవారిపట్ల భాష, భావం బాగోపోయినా, వ్యక్తిగత జీవితం చిందరవందరగా ఉన్నా, వ్యాపారాల్లో అవినీతి, దివాళాకోరుతనం ఉన్నా ట్రంప్‌నే అమెరికన్లు ఎందుకు ఎన్నుకున్నారనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా ఉండిపోయింది. నిజానికి హిల్లరీ క్లింటన్‌కు అన్ని విషయాల్లో అనుభవం కలిగిన వ్యక్తి . రాజకీయాల్లో దాదాపుగా 24 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉంది. అంతే కాదు , అమెరికా, ప్రపంచ దేశాల పట్ల ఆమెకు అవగాహన అధికంగా ఉంది. దేశం ఎదుర్కొంటున్న క్లిష్ట సమస్యలపై స్పష్టంగా స్పందించగలరు కూడా...అయినా ఆమెను అమెరికా ప్రజలు తిరస్కరించడానికి కారణం, డెమాక్రటిక్ పార్టీ నుంచి రెండుసార్లు అధ్యక్షుడిగా ఎన్నికైన ఒబామా పనితీరుపై అసంతృప్తి పొందటమేనని అనుకోవాలా ?

### అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్‌కు రాజభోగాలు

అమెరికాకు ప్రెసిడెంట్‌గా ట్రంప్ రాజభోగాలను అనుభవిస్తారు. ఆయనకు వార్షిక వేతనంగా 4,00,000 డాలర్లు (2కోట్ల 66లక్షల 84వేల180ను) లభిస్తాయి. అంటే నెలకు దాదాపు ఇరవై రెండు లక్షల పైమాటే. వాటితో పాటు 50వేల డాలర్ల(33లక్షల 35వేల 522) వార్షిక వ్యయ ఖర్చులు, అదనంగా ప్రయాణాలకు 1,00,000 డాలర్లు(66లక్షల 71వేల 245), వినోదానికి 19,000డాలర్లు(రూ.12,67,498)ను ఆయనకు చెల్లిస్తారు.

అధ్యక్షులు పనిలో ఒత్తిడి లేకుండా ఉండటానికి 18 ఎకరాల పచ్చని మైదానం,దానిలో నీటి కొలనులను ఏర్పాటు చేశారు. 55 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న సువిశాలమైన శ్వేతసౌధంలో 132 గదులుంటాయి. ఆ గదులన్నీ ఎల్లప్పుడూ పూల సువాసనలు వెదజల్లిలా తీర్చిదిద్దుతారట. వెంచర్ వ్యయాలు ఏడాదికి 2,50,000 డాలర్ల పైనే ఖర్చు అవుతాయని అంచనా. మొత్తంగా వైట్ హౌస్ వ్యయం ఏడాదికి 4 మిలియన్ డాలర్ల పైనే ఉంటుంది

అధ్యక్షుడి కోసం ప్రత్యేకంగా 747-200బీ జెట్‌ను వినియోగిస్తారు. దానిలో సూపర్ లగ్జరియస్ ఆఫీస్, కాన్ఫరెన్స్ రూం, బాత్, జిమ్, బెడ్ రూములు ఉంటాయి. ఎయిర్‌ఫోర్స్ అంచనా ప్రకారం ఒక్కసారి గంటసేపు ఈ విమానం గాలిలో ఎగిరితే 2,10,877 డాలర్ల ఖర్చు అవుతుందని తెలుస్తోంది. అయితే తక్కువ దూరాలకు అధ్యక్షుడు ఎప్పుడూ తన ప్రైవేట్ చాపర్ మెరైన్‌నే వాడతారు. అమెరికా ప్రధమ కుటుంబం తినే ప్రైవేట్ మీల్స్, స్టేట్ డిన్నర్స్ అన్నింటికీ గార్డెన్‌లోని ఫ్రెష్ ఫ్రూట్స్, వెజిటేబుల్స్‌నే ఉపయోగిస్తారు. ఎగ్జిక్యూటివ్ చెఫ్‌లు వీటిని తయారు చేస్తారు. అదేవిధంగా శ్వేతసౌధం మైదానంలోని తేనెటీగల నుంచి తీసిన తేనెనే ఉపయోగిస్తారు. శ్వేత సౌధ అధ్యక్ష కుటుంబం కోసం ఏర్పాటుచేసిన ఏకాంతవాసం క్యాంప్ డేవిడ్ కూడా చాలా చక్కగా ఉంటుంది. చెక్కతో నిర్మించబడిన ఈ ఇళ్లు, స్పా, స్విమింగ్ పూల్, బౌలింగ్ అల్లే, స్కీట్ షూటింగ్ రేంజ్, టెన్నిస్ కోర్టులు, గోల్ఫ్, గుర్రం స్టేబుల్స్, ఐస్ స్కేటింగ్ రింక్‌లు కలిగి ఉంటుందట. కుటుంబంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా సేద తీరడానికి ఇది బాగా ఉపయోగపడుతుంది. అమెరికా అధ్యక్ష పదవినుంచి దిగిపోయాక కూడా 2,00,000 డాలర్ల వరకు ఏడాది పెన్షన్, ఉచిత ఆరోగ్య సదుపాయాలు, కార్యాలయ ఖర్చులతో ట్రావెల్, జీవితకాల సీక్రెట్ సర్వీసు ప్రొటెక్షన్, ఇంకా తమకు నచ్చిన సిబ్బందిని నియమించుకునేందుకు 96,000 డాలర్లను వారు పొందుతారు.

### ట్రంప్ విజయానికి కృషిచేసిన చాట్‌బోట్

డొనాల్డ్ ట్రంప్ విజయంలో 'సాఫ్ట్‌వేర్ రోబో'ల పాత్ర కూడా ఉందని పరిశోధకులు చెబుతున్నారు. ప్రస్తుతం ఫేస్‌బుక్.. ట్విట్టర్.. ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్రముఖ సోషల్‌మీడియా సైట్లలో చాట్‌బోట్‌లను ఎంచుకునే వీలుంది. అంటే.. సాఫ్ట్‌వేర్ రోబోలు అన్నమాట. ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌తో పనిచేసే ఈ రోబోలు వాటంతట అవే పోస్టులు చేసేస్తాయి. అలా అమెరికా అధ్యక్ష ఎన్నికల సమరం సందర్భంగా కొన్ని లక్షల చాట్‌బోట్‌లను వినియోగించారట. యూనివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియాకు చెందిన కంప్యూటర్ పరిశోధకులు తాజాగా జరిపిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. అమెరికా అధ్యక్ష ఎన్నికలకు సంబంధించి ఈ ఏడాది సెప్టెంబర్ 16 నుంచి అక్టోబర్ 21 వరకు 28లక్షల ఖాతాల నుంచి చేసిన దాదాపు 2కోట్ల ట్వీట్లను పరిశోధకులు విశ్లేషించారట. వాటిల్లో 4లక్షల 96వేల చాట్‌బోట్ ఖాతాలు ఉన్నట్లు గుర్తించారు. మొత్తం ట్వీట్లలో 19శాతం ఈ చాట్‌బోట్లు చేసినవేనని అంచనా వేశారు.

ట్రంప్.. హిల్లరీ ఇద్దరికీ ఈ చాట్‌బోట్లు ఉన్నాయి. కానీ హిల్లరీ కంటే ట్రంప్‌కు మద్దతు తెలిపే బోట్‌లే ఎక్కువకావడంతో ట్రంప్- హిల్లరీ మధ్య జరిగిన బహిరంగ చర్చకు సంబంధించిన విషయాలను వక్రీకరిస్తూ ఈ సాఫ్ట్‌వేర్ రోబోలు ట్రంప్‌కు అనుకూలంగా ట్వీట్లు చేశాయని అంటున్నారు. ఈ ఆటోమేటెడ్ ట్వీట్ల ద్వారా ట్విట్టర్ 'ట్రెండింగ్' టాపిక్స్‌లో ట్రంప్ నిలిచేలా చేశాయని చెబుతున్నారు.

ట్రంప్ విజయంతో అమెరికా మేధావి వర్గం నిద్రలేని రాత్రుల గడుపుతోంది. ఆయన ఎప్పుడు ఎలా స్పందిస్తారో తెలియదు, ముక్కోపి ఏ విషయంలోనైనా అవగాహన చాలా తక్కువ. స్వేచ్ఛావాణిజ్యాన్ని అరికడతానన్నారు. దీంతో ఉన్న ఉద్యోగాలు కూడా ఊడుతాయేమోనని భయం యువతలో ఉంది.

కొసమెరుపు ఏమంటే ట్రంప్‌ను అమెరికా అధ్యక్షుడిగా అంగీకరించబోమని ప్రజలు ఆందోళనలు నిర్వహిస్తున్నారు.

– ఖాన్

## రష్యాతో ట్రంప్ యుగళగీతం

### పాక్‌కు ఇక్కట్లు

అమెరికా బద్ధ శత్రువైన రష్యాకు స్నేహ హస్తం చాపుతామని ట్రంప్ ప్రకటించడం రెండు అగ్రదేశాల మధ్య సుహృద్భావన కలిగిస్తుందనడంలో సందేహం లేదు. ఇది ప్రపంచ దేశాలకు ఊరట నిస్తుంది. ఇరాకీయులు వరల్డ్ ట్రేడ్ సెంటర్‌ను కూల్చలేదని అది సౌదీ అరేబియా అని ఆయన ప్రకటించడంతో ఆదేశానికి భయం పట్టుకుంది. చైనా జాతీయులు అమెరికన్ల ఉద్యోగాలను దోచుకుంటున్నారనడం అక్కడి ఉద్యోగులను వేధిస్తోంది. ముస్లింలను దేశం నుంచి వెళ్లగొడతానని, వారికి వీసాలను నిరాకరిస్తామనడంతో ముస్లింలకు వణుకు పట్టుకుంది. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ప్రపంచానికి సరఫరాచేస్తోందని ట్రంప్ ఆదేశంపై గుర్రుగా ఉండటం పాక్ నేతలకు తీవ్ర ఇబ్బందిగా పరిణమించింది.



శ్రీ కల్కి అందరివారు
విశ్వశాంతి ధర్మ స్థాపకులు,దైవ సత్యస్వరూపి,
లోక రక్షకులు జగద్గురువులు శ్రీ కల్కి
ఎం.బేగ్
8143307812
కలియుగ కాల ప్రమాణము 4,32000 సంవత్సరాలు
3658 వ సం॥క్రీ॥ శ॥ 570 సం॥లో వచ్చారు. శ్రీ కల్కి
అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (స) వారు
కలియుగము మహా మంత్రమునకు సామ వేదములో
హో హో 1 లా ఇలాహ
హూ హూ 2 ఇల్లల్లాహు
హీ హీ 3 మొహమ్మదుర్ రసూలుల్లాహి
ఎవరూ నరకాని పోకుండా స్వర్గానికి వెళ్లాలనే ఆకాంక్షిస్తూ..


## హెచ్‌బీసీకి విశేష ఆదరణ

హైదరాబాద్ :ఆరోగ్యానికి, పర్యావరణానికి ఎంతో ఉపయోగకారిగా నగర రవాణాల్లో సైక్లింగ్‌కు అధిర ప్రాధాన్యత లభిస్తోంది. నాలుగు సంవత్సరాల క్రితం ఏర్పడిన హైదరాబాద్ బైసిక్లింగ్ క్లబ్ (హెచ్‌బీసీ)కి విశేష ఆదరణ లభిస్తోంది. కేవలం 800 మంది సభ్యులతో ప్రారంభమైన ఈ క్లబ్‌లో నేడు 12 వేల మందికి పైగా సబ్యులున్నారు. ఇటీవల ఈక్వెడార్‌లోని క్విటో నగరంలో హేబిటాట్ మూడు పేరుతో అంతర్జాతీయ సదస్సును ఐక్యరాజ్య సమితి నిర్వహించింది. వచ్చే 20 ఏళ్లల్లో అమలు చేయాల్సిన ఎంజెడాను, నూతన అర్బన్ ఎజెండా పేరిట ఖరారు చేశరాఉ. వరల్డ్ సైక్లింగ్ అలయన్స్ (డబ్యూసిఎ) బ్రెస్సెల్స్ ప్రధాన కేంద్రంగా ఉన్న యురోపాయన్ సైక్లింగ్ ఫెడరేషన్ (ఇసిఎఫ్)లను ఈ అర్బన్ ఎజెండాలో సైక్లింగ్‌ను భాగస్వామ్యం చేశారు. సదస్సులో పాల్గొన్న హోటల్ రమదామనోహర్ అధినేత, హైదరాబాద్ బైసిక్లింగ్ క్లబ్ వ్యవస్థాపక మనోహర్ చేసిన ప్రసంగం విశేషంగా ఆకట్టుకుంది. సదస్సు విధేషాలను ఆయన పత్రికల వారికి వివరించారు. 2050 నాటికి 70 శాతం ప్రజలు నగరాల్లోనే నివసిస్తారని, ఉద్గారాలను తగ్గించేందుకు సైక్లింగ్ ఎంతో ఉపయోగ పడుతుందని ఆయన పేర్కొన్నారు. ఒక్కొక్క సైకిల్ ధర రూ.25 వేలుగా ఉంది. తమ క్లబ్‌లో అధిక సంఖ్యలో పాల్గొనాల్సిందిగా మనోహర్ విజ్ఞప్తి చేశారు.


అతి త్వరలో దినపత్రికగా రానున్న
రాజధాని వార్తలు
పత్రికకు విజయవాడలో డీటీపీ
ఆపరేటర్లు,సబ్ -ఎడిటర్లు,
డిజైనర్లు కావలెను
94406 62699, 96768 44442

డెవలప్‌మెంట్ కోసం
రాజధాని అమరావతి ప్రాంతంలో
డెవలప్‌మెంట్ కోసం భూమి కావాలన్నా
లేక భూమి ఇవ్వాలన్నా
సంప్రదించండి
96768 44442


## బాధితులకు అండగా ఉంటాం: కాంగ్రెస్



మట్లాడుతున్న మక్కెన మల్లికార్జునరావు, పక్కన, లింగంశెట్టి ఈశ్వర రావు టిజె. సుధాకర బాబు, మల్లాదివిష్ణు,మక్కెన మల్లికార్జునరావు

రాజధానిప్రతినిధి - తుళ్ళూరు : రాజధాని గ్రామాల్లో ప్రభుత్వం చేస్తున్న చర్యల వల్ల ఇబ్బందులు పడే వ్యవసాయ కూలీలకు, రైతులకు అసంఘటిత కార్మికులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతలు అభయం ఇచ్చారు. ఈ మేరకు గురువారం సాయంత్రం మండలంలోని రాయపూడిలో మండలపార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు.నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి టి.జె.సుధాకర్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మక్కెన మల్లికార్జునరావు, లింగంశెట్టి ఈశ్వరరావు,మల్లాది విష్ణు పాల్గొని ప్రసంగించారు. పార్టీ మండల అధ్యక్షుడు బోగినేని అప్పారావు,కొమ్మినేని రామాంజనేయులు పాల్గొన్నారు.




అన్నె రాధా కృష్ణమూర్తి (చిట్టిబాబు)
గ్రామ సర్పంచ్
జనాబ్ అబ్దుల్ లతీఫ్ సాహెబ్
గ్రామ ఉపసర్పంచ్
కానూరు గ్రామం,సనత్ నగర్‌లను అభివృద్ధి పథంలో నడిపిస్తూ
3 ఏళ్ళు దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా
శుభాకాంక్షలు తెలుపుతూ
మహ్మద్ సిద్దక్ సాహెబ్
అబ్దుల్ రహమాన్ సాహెబ్
శ్రీమతి సత్యవతి (వార్డు మెంబర్)
షేక్ హమీద్ సాహెబ్
షేక్ బాజీ సాహెబ్ (రాయపూడి)
మహ్మద్ సనావుల్లా సాహెబ్
హాజ్ ఖలీ సాహెబ్
లాయర్ బషీర్ ఖాన్ సాహెబ్
మునీర్‌బాను సాహెబ్
నూరుల్లా బేగ్ సాహెబ్
మహ్మద్ ఖాదర్ సాహెబ్ ఎం.పి.టి.సి
మహ్మదీయ మజీదు అధ్యక్షులు, సభ్యులు
ముబారక్ మజీదు అధ్యక్షులు, సభ్యులు
మదీన మజీదు అధ్యక్షులు, సభ్యులు
అక్సా మజీదు అధ్యక్షులు, సభ్యులు
మహ్మద్ రబ్బాని (వార్డు మెంబరు)
మహ్మద్ సాబు సాహెబ్ (వార్డు మెంబర్),
బేగ్ సాహెబ్
మహ్మద్ గుల్జార్ సాహెబ్
గ్రామ పెద్దలు, సనత్‌నగర్ వాస్తవ్యులు
డా॥ మునీర్ ఖాన్ సాహెబ్
షేక్ అనీర్ సాహెబ్
అన్సారి సాహెబ్
రహీం ఖాన్ సాహెబ్
అబ్బాస్ సాహెబ్ (మలిక్ జ్యుయెలరీ)
మహ్మద్ సాధిక్ సాహెబ్
మహ్మద్ హాజీ సలీం సాహెబ్
షేక్ అమీల్ సాహెబ్
మహ్మద్ సులేమాన్ సాహెబ్
జికిరియా సాహెబ్
అన్వారి సాహెబ్ (వార్డు మెంబర్)


Printed, Published and Owned by Pattan Hussain Khan, Published at 6-45/1, Rayapudi Post, Thullur Mandal, Guntur District, AP 522237. Printed at Jagathi Publications Ltd., D.No : 5-625, Vadlapudi road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur District, AP. Editor : Pattan Hussain Khan, Cell: 9440662699, Email: info@rajadhanivartalu.com, RNI No. APTEL / 2015 / 66622. Postal Regd. No.GTR/84/2016-18